ఆదివారం
03-03-2024

విజయవాడ ప్రచురణ

సంపుటి : 72, సంచిక : 251
పేజీలు : 8, వెల: రూ.6.00

Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com

స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23

అక్షరాక్షరం అభ్యుదయం

చైనాలో సూపర్ సోనిక్ అల్ట్రా హైస్పీడ్ ట్రైన్ తయారీ

బీజింగ్: అత్యంత వేగవంతమైన రైళ్లకు పెట్టింది పేరైన చైనాలో ఇప్పుడు మరో అత్యాధునిక, సూపర్ సోనిక్ అల్ట్రా హైస్పీడ్ ట్రైన్‌ను అభివృద్ధి పర్చారు. ఆకృతిలో రైలును పోలి, వేగంలో విమానానికి తీసిపోని ఈ ట్రైన్‌కు 'టీ-ఫ్లైట్'గా నామకరణం చేశారు. దీనికి చక్రాలు ఉండవు. ఎలక్ట్రో మ్యాగ్నెటిక్ శక్తితో ట్రాక్‌పై గాలిలో తేలియాడుతూ నడుస్తుంది. దీంతో పట్టాలు, చక్రాలమధ్య ఘర్షణ అనే సమస్యే ఉండకపోవడంతో లక్షిత వేగాన్ని రైలు సులభంగా అందుకోగలదు.

బీజేపీ డబుల్ గేమ్!

- ఏపీలో ఎన్నికల పొత్తులపై సాగతీత
- టీడీపీ, జనసేన నేతల ఉక్కిరిబిక్కిరి
- మలి జాబితా మరింత ఆలస్యం
- మరోవైపు ఆశావహులకు కాషాయపార్టీ గాలం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష పార్టీలతో బీజేపీ డబుల్ గేమ్ ఆడుతోంది. వారం, పది రోజుల్లో ఎన్నికల షెడ్యూలు విడుదలకు రంగం సిద్ధమవుతుండగా, ఏపీలో తన ఎన్నికల ఎత్తుగడ ఏంటో తేల్చకుండా బీజేపీ నాటకాలాడుతోంది. అధికారంలో ఉన్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గత ఐదేళ్ల నుంచి కేంద్రంలోని మోదీ సర్కారుకు పూర్తి సహకారమందిస్తూ వస్తోంది. పార్లమెంటులో ఏ బిల్లు పెట్టినా, కేంద్ర ప్రభుత్వం ఎటువంటి వివాదస్పద నిర్ణయం తీసుకున్నా జై అంటోంది. అలాగే ప్రతిపక్ష పార్టీగా ఉన్న టీడీపీ కూడా అలాగే సహకరిస్తోంది. విచిత్రమేమిటంటే ఈ రెండు పార్టీలు ఎన్డీఏ కూటమిలో లేవు. జనసేన పార్టీ ఒక్కటే ఆ కూటమిలో ఉంది. అయినప్పటికీ బీజేపీతో సంబంధం లేకుండానే టీడీపీతో కల్సి ఎన్నికల్లో పోటీ చేయనున్నట్లు జనసేన అధినేత పవన్ కల్యాణ్ ముందుగానే ప్రకటన చేశారు. ఆ సందర్భంగా తమతో బీజేపీ కూడా కల్సి వస్తుందని, మూడు పార్టీలు కల్సి పోటీ చేయనున్నట్లు పవన్ కల్యాణ్ తెలిపారు. మెజార్టీ రాష్ట్ర బీజేపీ నేతలు కూడా టీడీపీ,జనసేనతో కల్సి ఎన్నికలకు వెళ్లాలని ప్రయత్నిస్తున్నారు. జాతీయ నేతలకు కూడా అదే అభిప్రాయాన్ని చెప్పారు. అయితే బీజేపీలో అంతా తామై చక్రం తిప్పుతున్న ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షాలు మాత్రం ఇప్పటివరకు దానిపై రాష్ట్ర నేతలకు స్పష్టత ఇవ్వ లేదు. దీంతో అసలు పొత్తులుంటాయో,లేదో అర్థంగాని పరిస్థితుల్లో టీడీపీ, జనసేన పార్టీతో పాటు బీజేపీ శ్రేణులు కూడా తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. కేంద్ర బీజేపీ నేతలు వైసీపీకి మేలు చేసేందుకు వ్యూహాత్మకంగానే పొత్తులపై స్పష్టత ఇవ్వడం లేదని టీడీపీ, జనసేన నేతల్లో చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో పార్టీ శ్రేణుల్లో నెలకొన్న నైరాశ్యాన్ని తొలగించి, ఉత్తేజాన్ని నింపేందుకు చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు 99 మందితో... వచ్చే ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల తొలి జాబితాను విడుదల చేశారు. ఆ రోజు బీజేపీతో పొత్తు ఉంటుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేస్తూ, అందుకోసమే మిగిలిన సీట్లకు అభ్యర్థులను ప్రకటించడం లేదని చెప్పారు. బీజేపీ పోటీ చేయాలనుకునే నియోజకవర్గాలను కూడా ఖాళీగా ఉంచామని వివరణ ఇచ్చారు. సాధ్యమైనంత త్వరగా బీజేపీతో పొత్తు విషయం తేల్చుకుని మలి జాబితా విడుదల చేయడానికి టీడీపీ, జనసేన సిద్ధమవుతున్నాయి. అయితే బీజేపీతో పొత్తు విషయం తేలకుండానే టీడీపీ, జనసేన తొలి జాబితా విడుదల చేయడాన్ని వైసీపీకి అనుకూలంగా వ్యవహరించే కొందరు బీజేపీ నేతలు ఆ అంశాన్ని వివాదస్పదం చేశారు. టీడీపీ, జనసేన అధినేతల నిర్ణయాన్ని తప్పుబడుతూ ఢిల్లీ పెద్దల దృష్టిని ఆకర్షించేందుకు ప్రయత్నించారు. ఎన్డీఏ కూటమిలో భాగస్వామిగా ఉండి, కనీస సమాచారం ఇవ్వకుండా టీడీపీతో ఎన్నికల పొత్తు ఉంటుందని రాజమహేంద్రవరం జైలు వద్ద పవన్ కళ్యాణ్ ప్రకటించడం, తర్వాత తొలి జాబితా విడుదల చేయడం రెండూ తప్పేనని బీజేపీలో వైసీపీ అనుకూల నేతలు వాదిస్తుండగా, రాష్ట్రంలో ఒకశాతం ఓటింగ్ కూడా లేని పరిస్థితుల్లో టీడీపీ, జనసేనతో కల్సి పోటీ చేయడమే మనకు ఏకైక పరిష్కారమని మరో వర్గం వాస్తవాలు వెల్లడిస్తూ పొత్తు కోసం గట్టి పట్టు పడుతోంది.

ఈ భిన్న వాదనలను వింటూ వస్తున్న మోదీ, అమిత్ షాలు టీడీపీ, జనసేన పార్టీలతో ఎన్నికల పొత్తు వ్యవహారంపై రాష్ట్ర బీజేపీ నేతల అభిప్రాయాలను జిల్లాల వారీగా సేకరించాలని సూచించినట్లు తెల్సింది. దీనిలో భాగంగా బీజేపీ కేంద్ర నాయకులు శివప్రకాష్ మూడు రోజుల పాటు ఏపీ నేతలతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి, టీడీపీ, జనసేన పొత్తుపై కమలనాథుల అభిప్రాయాలను సేకరిస్తున్నారు. పొత్తు వల్ల లాభమా ?నష్టమా ? అనే అంశంపై కూడా వారి అభిప్రాయాన్ని కోరుతున్నారు. మరోప్రక్క అవసరమైతే సింగిల్‌గా ఎన్నికల బరిలో నిలిచేందుకు ఆశావాహుల నుండి దరఖాస్తులు స్వీకరించే కార్యక్రమాన్ని సైతం వేగవంతంగా చేపడుతున్నారు. శనివారం విజయవాడ బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ముఖ్యనేతల సమావేశానికి హాజరైన సీఎం రమేష్, ఆదినారాయణ రెడ్డిలు అనంతరం మీడియాతో మాట్లాడుతూ మరో మూడు రోజుల్లో పొత్తులపై స్పష్టత వస్తుందని చెప్పారు. అలాగే పొత్తులపై పార్టీ నిర్ణయమే తమకు శిరోధార్యమని కూడా స్పష్టం చేశారు. ప్రతి నియోజకవర్గానికి ముగ్గురు పేర్లను సేకరించి అధిష్ఠానానికి లిస్టు పంపేందుకు కసరత్తు నిర్వహిస్తున్నారు. ఇంకోవైపు ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి రెండురోజుల్లో ప్రధాని నరేంద్రమోదీని కలవడానికి వెళుతున్నారని, ఆమేరకు అపాయింట్‌మెంట్ కూడా ఖరారైందని వైసీపీ నేతలు చెపుతున్నారు. సీఎం జగన్ అభ్యర్థుల ఎంపిక, సిద్ధం సభలతో నిత్యం బిజీగా గడుపుతుండగా... అకస్మాత్తుగా ఢిల్లీ పర్యటన ఖరారు కావడం రాజకీయవర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ పరిణామాలన్నింటినీ పరిశీలిస్తుంటే టీడీపీ, జనసేన పార్టీలతో బీజేపీ పొత్తు ఖరారు అనుమానస్పదంగానే ఉందని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటుండగా... టీడీపీ, జనసేన మలి జాబితా విడుదల మరింత ఆలస్యమయ్యే పరిస్థితి కనపడుతోంది.

దీనివల్ల ఆయా నియోజకవర్గాలు పొత్తుల్లో భాగంగా ఏ పార్టీకి కేటాయిస్తారో తేల్చుకోలేని పరిస్థితుల్లో మూడు పార్టీల ఆశావహులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. బీజేపీ మాత్రం పొత్తులపై ఎటూ తేల్చకుండా రాష్ట్రంలో ఏ పార్టీ గెల్చినా తమకు అనుకూలంగా మలుచుకునే వ్యూహాన్ని అమలు చేసేలా, పొత్తు పెట్టుకోవల్సి వస్తే ఎంపీ సీట్లు ఎక్కువగా డిమాండ్ చేసే వ్యూహంలో ఉందని విశ్లేషకులు పేర్కొంటున్నారు.

వారణాసి నుంచే మోదీ

- 195 మందితో బీజేపీ తొలి జాబితా
- లోక్‌సభ అభ్యర్థుల ఖరారు
- తెలంగాణలో 9 స్థానాలకు అభ్యర్థుల ఎంపిక

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి బీజేపీ తన మొదటి జాబితాను శనివారం విడుదల చేసింది. మొదటి విడతగా 195 మంది అభ్యర్థులతో జాబితా ప్రకటించింది. ఎన్నికల షెడ్యూలు వెలువడకుండానే మొదటి విడత అభ్యర్థులను ఖరారు చేసింది. ప్రధాని నరేంద్ర మోదీ వరుసగా మూడోసారి ఉత్తరప్రదేశ్‌లోని వారణాసి నుంచి బరిలో దిగుతుండగా... హోంశాఖ మంత్రి అమిత్ షా గుజరాత్‌లోని గాంధీనగర్ నుంచి మరోసారి పోటీలో నిలిచారు. తొలి జాబితాలో ప్రధాని మోదీ సహా 34 మంది కేంద్రమంత్రులకు చోటుదక్కింది. ఢిల్లీలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో పార్టీ నేతలు వినోద్ తవడే తదితరులు వివరాలు వెల్లడించారు. మోదీ సారథ్యంలో బీజేపీ కేంద్ర ఎన్నికల కమిటీ (సీఈసీ) 16 రాష్ట్రాల్లోని అభ్యర్థిత్వాలపై సుదీర్ఘ చర్చలు జరిపిన తర్వాత ఈ జాబితా వెల్లడైంది. రాష్ట్రాలవారీగా చూస్తే పశ్చిమబెంగాల్ నుంచి 27మంది అభ్యర్థులను, మధ్యప్రదేశ్- 24, గుజరాత్- 15, రాజస్థాన్- 15, కేరళ- 12, తెలంగాణ- 9, జార్ఖండ్- 11, ఛత్తీస్‌గఢ్- 12, ఢిల్లీ- 5, జమ్మూకశ్మీర్- 2, ఉత్తరాఖండ్- 3, అరుణాచల్ ప్రదేశ్- 2, గోవా, త్రిపుర, అండమాన్ నికోబార్, డమన్ అండ్ డీవ్ నుంచి ఒక్కొక్కరి చొప్పున అభ్యర్థులను బీజేపీ ఖరారు చేసింది. తొలి జాబితాలో 28 మంది మహిళలు, యువతకు 47 స్థానాలు, ఎస్సీలకు 27, ఎస్టీలకు 18 స్థానాలు కేటాయించినట్లు వినోద్ తవడే తెలిపారు. తొలి జాబితాలో 57

- మిగతా 2 లో

బీజేపీ, వైసీపీ, టీడీపీలకు
బుద్ధిచెప్పండి

- మోదీ, అమిత్‌షాతో వ్యవస్థలు ధ్వంసం
- సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

విశాలాంధ్ర బ్యూరో-కర్నూలు: ఏపీలో ఒకే ఓటుతో బీజేపీ, దానికి కొమ్ముకాస్తున్న వైసీపీ, టీడీపీ, జనసేనలకు బుద్ధిచెప్పాలని, సైకిల్, ఫ్యాన్, కమలం, గ్లాసులను ఊరిబయట పడవేయాలని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ సీపీఐ శ్రేణులకు పిలుపునిచ్చారు. స్థానిక దేవీ ఫంక్షన్ హాలులో సీపీఐ కర్నూలు, నంద్యాల ఉమ్మడి జిల్లాల సర్వసభ్య సమావేశం పార్టీ కర్నూలు, నంద్యాల జిల్లాల కార్యదర్శులు బి.గిడ్డయ్య, ఎస్.రంగనాయుడు అధ్యక్షతన శనివారం జరిగింది. నారాయణ మాట్లాడుతూ కేంద్రంలో మోదీ - అమిత్‌షా వ్యవస్థలను తమ గుప్పెట్లో పెట్టుకున్నారని విమర్శించారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించే వారిని ఈడీ, సీబీఐ కేసులతో ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. బీజేపీ రాష్ట్రంలో సొంతగా ఒక్క సీటు గెలిచే పరిస్థితి లేదని, అయినా వైసీపీ, టీడీపీ ఆ పార్టీకి లొంగిపోయాయని చెప్పారు. ఢిల్లీలో రైతులు ఆందోళన చేస్తుంటే కనీసం పట్టించుకోలేదని

- మిగతా 2 లో

టీడీపీలోకి వేమిరెడ్డి, వసంత, లావు

- మరికొందరు వైసీపీ స్థానిక ప్రజాప్రతినిధుల చేరిక
- పార్టీ కండువాలు కప్పి స్వాగతించిన చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వైసీపీ నుంచి టీడీపీలోకి వలసలు కొనసాగుతూనే ఉన్నాయి. నెల్లూరు జిల్లా వైసీపీ అధ్యక్షులు, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి టీడీపీ అధినేత చంద్రబాబు సమక్షంలో శనివారం ఆ పార్టీలో చేరారు. ఆయనతోపాటు వేమిరెడ్డి సతీమణి ప్రశాంతిరెడ్డి, నెల్లూరు డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్, మరికొందరు స్థానిక ప్రజాప్రతినిధులు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువాలు కప్పి చంద్రబాబు స్వాగతించారు. రాష్ట్ర అభివృద్ధిని కాంక్షించి టీడీపీలో చేరడం శుభపరిణామని వారిని అభినందించారు. ఎంపీ వేమిరెడ్డి మాట్లాడుతూ ప్రజలకు ఎల్లప్పుడూ సేవ చేస్తూనే ఉంటానని, మరింత విస్తృతస్థాయిలో సేవ చేయాలనే తలంపుతోనే రాజకీయాల వైపు అడుగేశానని తెలిపారు. టీడీపీలో చేరడం సంతోషంగా ఉందన్నారు. ఇక మైలవరం వైసీపీ ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ కూడా శనివారం ఉదయం హైదరాబాద్‌లోని చంద్రబాబు నివాసానికి వెళ్లి టీడీపీలో చేరారు. చంద్రబాబు ఆయనకు పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. వసంత కృష్ణప్రసాద్‌తో పాటు మైలవరం నియోజకవర్గానికి చెందిన ఒక ఎంపీపీ, ఇద్దరు మండల పరిషత్ ఉపాధ్యక్షులు, 12 మంది సర్పంచ్‌లు, ఆరుగురు ఎంపీటీసీ సభ్యులు, ఏడుగురు సొసైటీ అధ్యక్షులు, ఇద్దరు మండల పార్టీ అధ్యక్షులు, నలుగురు కౌన్సిలర్లు టీడీపీలో చేరారు. కృష్ణ ప్రసాద్ మీడియాతో మాట్లాడుతూ సంక్షేమం... అభివృద్ధి... ఈ రెండింటినీ ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని, ఆ సత్తా చంద్రబాబుకే ఉందన్న నమ్మకంతో టీడీపీలో చేరానన్నారు. ఏపీ ప్రగతి మార్గంలో ముందుకు వెళ్లాలని, పరిశ్రమలు రావాలని, యువతకు ఉద్యో కల్పన జరగాలని, ఇవన్నీ చంద్రబాబు వల్లే సాధ్యమని, అందుకే టీడీపీలో చేరానని కృష్ణ ప్రసాద్ వివరించారు.

టీడీపీలోకి 'లావు'

దాచేపల్లి: పల్నాడు జిల్లా గురజాల నియోజకవర్గంలోని దాచేపల్లిలో ఏర్పాటు చేసిన 'రా.. కదలిరా' సభలో వైసీపీకి చెందిన నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఆయనతో పాటు వినుకొండ మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు టీడీపీలో చేరారు. వారికి చంద్రబాబు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అప్పటికప్పుడే లావు శ్రీకృష్ణదేవరాయలును నరసరావుపేట పార్లమెంట్ అభ్యర్థిగా చంద్రబాబు ప్రకటించారు. ఈ సందర్భంగా లావు మాట్లాడుతూ ...

- మిగతా 2 లో

డిమాండ్లు నెరవేరే వరకు ఆందోళన

- స్పష్టం చేసిన రైతు నాయకులు
- 'ఢిల్లీ చలో'పై నేడు తదుపరి కార్యాచరణ

న్యూఢిల్లీ: పంటల కనీస మద్దతు ధరకు చట్ట బద్ధత సహా ఇతర డిమాండ్లు నెరవేరే వరకు 'ఢిల్లీ చలో' ఆందోళన కొనసాగుతుందని... శంభు, ఖానౌరీ సరిహద్దుల్లో రైతుల మోర్చాలను మరింత పటిష్ఠం చేస్తామని రైతు నాయకులు స్పష్టం చేశారు. పంజాబ్-హర్యానా సరిహద్దు శంభూ వద్ద రైతు నాయకులు మంజీత్ సింగ్ రాయ్, జస్వీందర్ సింగ్ లాంగోవాల్ మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ... ఖనౌరీలో హర్యానా భద్రతా సిబ్బందితో జరిగిన ఘర్షణలో మరణించిన రైతు కోసం ప్రార్థనలు చేసిన తర్వాత మార్చి 3న 'ఢిల్లీ చలో' ఆందోళనపై తమ తదుపరి కార్యాచరణను

- మిగతా 2 లో

ఇదీ లోకం!

మీ గురించి బాగా తెల్సుసుకుంటాను, ఈ సారి ఏపార్టీలోకి జంపింగ్ చేసి టికెట్టు సంపాదించాడు అని అడుగుతోంది!

తారస్థాయికి ఫాసిజం

వయనాడ్‌లో ఎన్నికల ప్రచారం ప్రారంభించిన సీపీఐ అభ్యర్థి అనీ రాజా

వయనాడ్ (కేరళ) : దేశంలో ఫాసిజం తారస్థాయికి చేరిందని, అటువంటి దుష్ట శక్తులను ఓడించేందుకు రానున్న ఎన్నికలే చివరి అవకాశమని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) నేత, వయనాడ్ లోక్‌సభ నియోజకవర్గ అభ్యర్థి అనీ రాజా అన్నారు. ప్రస్తుత రాహుల్ గాంధీ అభ్యర్థిత్వంపై కాంగ్రెస్ సందిగ్ధతతో ఉన్నప్పటికీ, అనీ రాజా వయనాడ్ లోక్‌సభ నియోజకవర్గంలో తన ప్రచారాన్ని ప్రారంభించారు. కమ్యూనిస్టు పార్టీ శ్రేణులు, నియోజకవర్గ ప్రజలు ఎర్రజెండాలు చేబూని అనీ రాజాకు అభ్యర్థిత్వానికి మద్దతుగా ఈ ప్రచారంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. సుల్తాన్ బతేరి, కల్పేటలో రోడ్ షోలకు ముందు మీడియాతో మాట్లాడిన అనీ రాజా... దేశంలో ఫాసిజం తీవ్రస్థాయికి చేరుకుందని, అటువంటి శక్తులపై పోరాటం కొనసాగిస్తామన్నారు. ఫాసిస్టు

- మిగతా 2 లో

ఇంటికెళ్లడానికి జగన్ 'సిద్ధం'

చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరిన వేమిరెడ్డి దంపతులు

సైకిల్ సునామీలో ఫ్యాన్ రెక్కలు విరగడం ఖాయమని, జగన్ ఇంటికెళ్లడానికి 'సిద్ధం'గా ఉండాలని టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు అన్నారు. నెల్లూరు జిల్లాలో వైసీపీ కీలక నేత, రాజ్యసభ మాజీ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆయన సతీమణి ప్రశాంతి రెడ్డి శనివారం తెలుగుదేశం పార్టీలో చేరారు. వారిద్దరికీ పసుపు కండువా వేసి చంద్రబాబు స్వాగతం పలికారు.

2లో

ఇజ్రాయిల్ చర్య అత్యంత క్రూరం

• అరబ్ లీగ్ ఖండన • గాజాలో కాల్పుల విరమణకు పిలుపు

కైరో: గాజాలో ఇజ్రాయిల్ మానవత్వాన్ని మర్చిపోయి యుద్ధనేరాలకు పాల్పడిందని అరబ్ లీగ్ సెక్రటరీ జనరల్ అహ్మద్ అబౌల్ ఘెయిట్ తీవ్రంగా విమర్శించారు. గాజాలో నివసిస్తున్న 2.3 మిలియన్ల పలస్తీనియన్ల ఆకలిపై బెంజమిన్ నెతన్యాహు ప్రభుత్వం క్రూరమైన యుద్ధం చేస్తోందన్నారు. గాజాలో కొద్దిరోజుల క్రితం ఆహారం కోసం వచ్చిన ప్రజలపై ఇజ్రాయిల్ సేనలు దాడులకు పాల్పడటాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. వందమందికి పైగా పౌరులప్రాణాలు తీసిన, వందలాదిమంది గాయపడటానికి కారణమైన ఈ నరమేధం 'అనాగరికమైన అత్యంత క్రూరమైన చర్య' గా ఆయన అభివర్ణించారు. ఇజ్రాయిల్ మానవత్వాన్ని మర్చిపోయిందనడానికి ఈ సంఘటన నిదర్శనం గా నిలుస్తుందన్నారు. వేలాదిమందిని ఆకలి నుంచి లేదా బాంబు దాడుల నుంచి రక్షించడానికి వెంటనే కాల్పుల విరమణ పాటించాలని ఆయన స్పష్టం చేశారు. నిత్యం జరుగుతున్న నరమేధాన్ని నియంత్రించడానికి, అంతర్జాతీయ చట్టాలకు లోబడి ఉండటానికి ఇజ్రాయిల్‌పై ఒత్తిడి తీసుకురావాలని అంతర్జాతీయ సమాజానికి ఆయన పిలుపునిచ్చారు. ప్రపంచ దేశాలతో పాటు సౌదీ అరేబియా, ఒమన్, ఖతార్, కువైట్, ఈజిప్ట్ , యెమెన్ సహా వివిధ దేశాలు గాజాలో ఇజ్రాయిల్ మారణహోమం సృష్టించడాన్ని తీవ్రంగా ఖండించాయి.

ఆహార పొట్లాలను జార విడుస్తాం: బైడెన్

ఆకలితో అల్లాడుతున్న గాజావాసులను ఆదుకునేందుకు మిలిటరీ విమానాల ద్వారా ఆహార పొట్లాలను గాజాలోకి జారవిడుస్తామని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ మీడియాకు వెల్లడించారు.'ఈ క్లిష్ట పరిస్థితుల్లో గాజాకు మానవతా సాయం ఎంతో అవసరం. అందించేందుకు అమెరికా సిద్ధంగా ఉంది' అని బైడెన్ పేర్కొన్నారు. సముద్ర మార్గాన భారీగా సహాయం అందించేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు. ఈ ఆహార పంపిణీ నిరంతర ప్రక్రియగా సాగుతుందని వైట్‌హౌస్ ప్రతినిధి ఒకరు తెలిపారు. జోర్డాన్, ఫ్రాన్స్ సహా ఇతర దేశాలు ఇప్పటికే గాజాలోకి ఆహార పొట్లాలను జారవిడిచాయి. కాగా మానవతా సాయం ఫలాలు అందరికీ అందాలంటే గాజా-ఈజిప్ట్ సరిహద్దులోని రఫా చెక్‌పోస్టు తెరుచుకుంటేనే అది జరుగుతుందని.. లేదంటే ఈ చర్య అంతగా ప్రభావం చూపకపోవచ్చని మరొక అమెరికా అధికారి అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ సంక్షోభాన్ని నివారించాలంటే రోజుకు 500 ఫుడ్ ట్రక్కులు గాజాలోకి ప్రవేశించాల్సి ఉంటుంది. కానీ జనవరిలో రోజుకు 150, ఫిబ్రవరిలో 97 ట్రక్కులు మాత్రమే గాజాలోకి ప్రవేశించాయి.

హాంకాంగ్ చట్టాలపై అమెరికా వ్యాఖ్యలు సరికాదు: చైనా

బీజింగ్: హాంకాంగ్ చట్టాలపై ఇటీవల అమెరికా ప్రకటనలను చైనా ఖండించింది. అలాగే దేశ అంతర్గత వ్యవహారాల్లో వాషింగ్టన్ జోక్యాన్ని తిరస్కరించింది. "జాతీయ భద్రతను పరిరక్షించడానికి లొసుగులను సరిచేసి ప్రాథమిక చట్టంలోని ఆర్టికల్ 23పై చట్టాన్ని పూర్తి చేయడం హాంకాంగ్ ప్రత్యేక పరిపాలనా ప్రాంతం (హెచ్‌కేఎస్‌ఏఆర్) ప్రభుత్వ రాజ్యాంగ బాధ్యత. దీర్ఘకాలంలో ఒక దేశం, రెండు వ్యవస్థల హేతుబద్ధ అమలును సాధించాల్సి ఉంటుంది" అని విదేశాంగ మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. ఆర్టికల్ 23 గురించి అమెరికా ఆందోళన వ్యక్తపర్చడంపై విదేశాంగ ప్రతినిధి మావో నింగ్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇది నివాసితుల హక్కులు, స్వేచ్ఛను పరిరక్షణ సమయంలో జాతీయ భద్రతకు అపాయం కలిగించే కొంతమంది నేరస్థులను లక్ష్యంగా చేసుకుందని తెలిపారు. ఈ నియమం కచ్చితంగా అంతర్జాతీయ చట్టాలు, అన్ని దేశాలు , ప్రాంతాలలో సాధారణ పద్ధతులకు అనుగుణంగా ఉంటుందన్నారు. మరోవైపు దేశ రహస్యాలు, బాహ్య జోక్యమనేది ఆయా దేశాల సాధారణ అభ్యాసాల ప్రకారం నిర్వచించబడిందని...అందువల్ల చట్టం చట్టబద్ధమైనది, నిందలకు అతీతమైనదని ఆమె స్పష్టం చేశారు.

ముంబై పేలుళ్ల సూత్రధారి అజామ్ ఛీమా మృతి

ఇస్లామాబాద్: ముంబై బాంబు పేలుళ్ల (26/11) ప్రధాన సూత్రధారి, లష్కరే తోయిబా సీనియర్ కమాండర్ అజామ్ ఛీమా మృతి చెందినట్లు తెలిసింది. పాకిస్థాన్‌లోని ఫైసలాబాద్‌లో గుండెపోటుతో ఆయన మరణించినట్లు నిఘా వర్గాలు వెల్లడించాయి. ఆయన అంత్యక్రియలు ఫైసలాబాద్‌లోని మల్కన్‌వాలాలో పూర్తయినట్లు సమాచారం. 15 ఏళ్ల క్రితం అంటే 2008 నవంబర్ 26న పాకిస్థాన్ కేంద్రంగా పనిచేసే లష్కరే తోయిబా ముఠాకు చెందిన 10 మంది ఉగ్రవాదులు ముంబైలో మారణహెూమానికి పాల్పడిన సంగతి తెలిసిందే. కొలాబా సముద్ర తీరం వెంబడి దక్షిణ ముంబైలోకి ప్రవేశించిన ఈ ముఠా తాజ్ మహల్ ప్యాలెస్ హెూటల్ సహా అనేక ప్రాంతాల్లో విచక్షణారహితంగా దాడులు జరిపారు. ఈ దాడుల్లో 166 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ దాడికి అజామ్ ఛీమా కీలక సూత్రధారిగా గుర్తించారు. దాడుల్లో పాల్గొన్న ఉగ్రవాదులకు అజామ్ శిక్షణ ఇచ్చినట్లు అమెరికా నిఘా వర్గాలు వెల్లడించాయి. దీంతో అతని పేరును మోస్ట్ వాంటెడ్ టెర్రరిస్ట్ జాబితాలో చేర్చింది. 26/11 పేలుళ్ల ఘటన మాత్రమే కాకుండా ఇతర బాంబు పేలుళ్లకు కూడా అజామ్ సూత్రధారిగా వ్యవహరించారు. 2006లో ముంబై రైళ్లలో జరిగిన బాంబు పేలుడు వెనుక అతని హస్తం ఉందని అప్పట్లో తేల్చారు. ఈ పేలుళ్లలో 188 మంది ప్రాణాలు కోల్పోగా.. 800 మంది దాకా తీవ్రంగా గాయపడ్డారు.

అమెరికాలో వేడెక్కిన రాజకీయం

వాషింగ్టన్: అమెరికాలో ఈ ఏడాది అధ్యక్ష ఎన్నికలు జరగనున్న క్రమంలో రాజకీయం వేడెక్కుతోంది. మెక్సికోతో సరిహద్దు వివాదం అంతకంతకూ రాజుకుంటోంది. దేశంలోకి అక్రమంగా వలస వచ్చిన వ్యక్తి చేతిలో లేకెన్ రిలే(22) అనే నర్సింగ్ విద్యార్థిని ఇటీవల హత్యకు గురైంది. దీనిపై రిపబ్లికన్ పార్టీ అధ్యక్ష అభ్యర్థిత్వ రేసులో ముందున్న దేశ మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా స్పందించారు. ఇటీవల టెక్సాస్‌లోని సరిహద్దుకు వెళ్లిన ఆయన అక్కడ చేసిన ప్రసంగంలో అధ్యక్షుడు బైడెన్‌పై విమర్శలు గుప్పించారు. దేశంలోకి అక్రమ వలసదారుల ప్రవేశం అధికమవడానికి బైడెన్ చేతగానితనమే కారణమని మండిపడ్డారు. రిలే తల్లిదండ్రులతో ట్రంప్ ఫోన్‌లో మాట్లాడారు. రిలేను తాను ఎన్నటికి మరచిపోలేనని, ఆమె హత్య అంశాన్ని అధ్యక్షుడు బైడెన్ పట్టించుకోలేదన్నారు. ఇదే విషయమై రిపబ్లికన్ అధ్యక్ష అభ్యర్థిత్వ రేసు నుంచి ఇప్పటికే తప్పుకున్న మరో నేత వివేక్‌రామస్వామి కూడా ఘాటుగా స్పందించారు. బైడెన్ జార్జ్ ఫ్లాయిడ్ పోలీసింగ్ యాక్ట్ బిల్లు పాస్ చేయడానికి బుదులు లేకెన్ రిలే సెక్యూర్ ద బోర్డర్ బిల్లు పాస్ చేయాల్సిందని, దీని ద్వారా అక్రమ వలసదారులను వెనక్కి పంపి పోలీసులకు భారాన్ని తగ్గించవచ్చని తెలిపారు. కాగా, లేకెన్ రిలే మార్నింగ్ వాక్‌కు వెళ్లినపుడు దుండగుడు ఆమెపై దాడి చేసి కిడ్నాప్ చేసి తీవ్రంగా గాయపరిచి హత్య చేశాడు. ఈ దారుణ ఘటన అమెరికాలో ప్రస్తుతం రాజకీయ దుమారం రేపుతోంది. ఈ ఏడాది నవంబర్‌లో జరగనున్న అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో భాగంగా పార్టీల అధ్యక్షఅభ్యర్థులను నిర్ణయించే ప్రైమరీ ఎలక్షన్స్ ఇప్పటికే ప్రారంభమైన సంగతి తెలిసిందే.

బీజేపీ, వైసీపీ, టీడీపీలకు బుద్ధిచెప్పండి

(మొదటిపేజీ తరువాయి)

మండిపడ్డారు. రాముడు, కృష్ణుడు తప్ప బీజేపీ నేతలకు ప్రజలు, రైతులు పట్టడం లేదన్నారు. పాలకుల అండతో మణిపూర్‌లో గిరిజనులు, దళితులను ఊచకోత కోస్తున్నారని ఆరోపించారు. మైనింగ్‌ను దోచుకోవడానికి మణిపూర్‌లో హింసను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు అవినీతి చేసిందని చెబుతున్న బీజేపీ ప్రభుత్వం...తాను అధికారంలోకి వచ్చిన ఈ పదేళ్లలో పదిలక్షల కోట్ల రూపాయలు బ్యాంకులకు ఎగ్గొట్టి 29 మంది దేశం విడిచి పారిపోయారని విమర్శించారు. అందులో ఎక్కువమంది గుజరాతీయులేనన్నారు. ఇక్కడ దోచుకున్న సొమ్ముతో వారు విదేశాలలో విలాసవంతమైన జీవనం గడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వారంతా మోదీ దత్తపుత్రులు...దోపిడీ దొంగలన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత అత్యంత అవినీతి ప్రధాని మోదీయేనని ఆరోపించారు. అవినీతిపరులను, దొంగలను మోదీ ప్రభుత్వం కాపాడుతోందన్నారు. బీజేపీ నేతలను దేశద్రోహులుగా అభివర్ణించారు. టీడీపీ-వైసీపీ నేతలు ఢిల్లీలో తెలుగువాడి ఆత్మగౌరవాన్ని తాకట్టుపెట్టారని నారాయణ ఆరోపించారు. బీజేపీ ప్రభుత్వం ఏపీకి ఒక్కరూపాయి ఇవ్వలేదన్నారు. రాజధాని, పోలవరం జాతీయ ప్రాజెక్టుకు నిధులు, ప్రత్యేక హోదా ఇవ్వకుండా ఏపీ ప్రజలను మోసం చేసిందని, తెలుగు ప్రజలకు ప్రథమ శత్రువు బీజేపీయేన్నారు. వైఎస్ఆర్ కుమారుడని ప్రజలు జగన్‌కు అధికారం ఇస్తే...బీజేపీకి దాసోహం అంటున్నారని మండిపడ్డారు. రాయలసీమకు ఎన్టీ రామారావు, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మాత్రమే న్యాయం చేశారని, చంద్రబాబునాయుడు, జగన్‌మోహన్‌రెడ్డి రాయలసీమ ద్రోహులని విరుచుకుపడ్డారు. 11 ఈడీ కేసుల్లో పదేళ్లు బెయిల్‌పై ఉన్న ముఖ్యమంత్రి జగన్ మాత్రమేనన్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు లొంగిపోయిన కారణంగానే జగన్ ఇంత సుదీర్ఘకాలం బెయిల్‌పై బయట ఉన్నారని ఆరోపించారు. తన తండ్రి హంతకులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్న వివేకానందరెడ్డి కుమార్తె సునీతపై వైసీపీ శ్రేణులు అనుచిత వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు. జగన్ ప్రభుత్వంపై సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్ దండయాత్ర చేస్తున్నాయని చెప్పారు. ఎన్‌డీఏకు మద్దతిస్తున్న పార్టీలన్నింటినీ ఓడించాలని నారాయణ పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికలలో సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్ బలపరచిన ఇండియా కూటమికి ఓటువేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ మోదీ హయాంలో దేశం అప్పులపాలైందని విమర్శించారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత దేశానికి 56 లక్షల కోట్లు అప్పు ఉండేదని, నేడు అది రూ.172 లక్షల కోట్లకు చేరిందన్నారు. మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వంటగ్యాస్, పెట్రోల్, డీజిల్, నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోయాయన్నారు. అన్నివర్గాల ప్రజలపై మోయలేని భారం పడిందన్నారు. రాముడు ఆయుధంగా ఓట్ల పొందడానికి మోదీ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. సోషలిస్టు స్థాపన ధ్యేయంగా కమ్యూనిస్టులు పోరాటం చేస్తున్నారన్నారు. కర్నూలు జిల్లాలో పెత్తందారులు, ఫ్యాక్షనిస్టులకు వ్యతిరేకంగా పోరాటం చేసిన చరిత్ర సీపీఐకి ఉందని, ఆ పోరాటంలో 20 మందికి పైగా కామ్రేడ్‌లు అశువులు బాశారని గుర్తుచేశారు. పేదలకు సాగుభూముల కోసం, నివాసస్థలాల కోసం పోరాటం చేసి సాధించిన చరిత్ర కమ్యూనిస్టు పార్టీకి ఉందన్నారు. సీపీఐ రాష్ట్రకార్యదర్శి వర్గ సభ్యుడు పి.రామచంద్రయ్య మాట్లాడుతూ వైసీపీ, టీడీపీ ప్రలోభాలకు మోసపోవద్దన్నారు. సీపీఐ రాష్ట్రకార్యవర్గ సభ్యులు కె.రామాంజనేయులు, ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్‌యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జే.లలితమ్మ తదితరులు మాట్లాడారు. సీపీఐ సీనియర్ నాయకులు పి.భీమలింగప్ప, రాష్ట్రకార్యవర్గ సభ్యుడు ఆవులశేఖర్, కర్నూలు జిల్లా సహాయకార్యదర్శులు ఎస్ఎన్ రసూల్, ఎస్.మునెప్ప, నంద్యాల జిల్లా సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్, ఉమ్మడి జిల్లాల కార్యవర్గసభ్యులు, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, ప్రజాసంఘాల నాయకులు, విద్యార్థి, యువజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

డిమాండ్లు నెరవేరేవరకు ఆందోళన

(మొదటిపేజీ తరువాయి)

ప్రకటిస్తామని స్పష్టం చేశారు. తమ డిమాండ్లకు మద్దతుగా దబ్వాలీలో నిరసన చేపడతామన్నారు. ఒక ప్రశ్నకు సమాధానమిస్తూ... శాంతియుతంగా నిరసనలు చేస్తున్న రైతులపై కేంద్రం, హర్యానా ప్రభుత్వాలు అణచివేత పద్ధతులను ప్రయోగిస్తున్నాయన్నారు. బాష్పవాయువు ప్రయోగించడం లేదా తేలికపాటి లాఠీఛార్జిని ప్రయోగించడమే కాదు... వారు విషపూరిత వాయువులను ఉపయోగించడాన్ని తాము చూశామన్నారు. "మేము శుభకరన్‌ను ఎలా కోల్పోయామో అందరికీ తెలుసు" అని అన్నారు. 'ప్రజాస్వామ్యంలో తూటాలు పేల్చడం సమంజసమేనా? మా ఆందోళన కొనసాగుతుంది. ఇది విజయపథంలో దూసుకుపోతుంది. అదే సమయంలో ఒక విషయం స్పష్టంగా ఉంది, బుల్లెట్ల నుంచి మన పిల్లలను రక్షించాలి' అని ఆయన అన్నారు. అంతకుముందు, మరో రైతు నాయకుడు సర్వన్ సింగ్ పంధేర్ కేంద్ర ప్రభుత్వంపై తీవ్రంగా విరుచుకుపడ్డారు. రైతు సమస్యల్ని గాలికొదిలి రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో గెలుపొందడంపైనే అధికార బీజేపీ దృష్టి సారిస్తోందని మండిపడ్డారు. తమ డిమాండ్లు నెరవేరే వరకు రైతుల ఆందోళన కొనసాగుతుందని, వెనక్కు తగ్గే ప్రశ్నే లేదని పంధేర్ స్పష్టం చేశారు. మార్చి 3న బల్లోహ్‌లో సంయుక్త కిసాన్ మోర్చా, కిసాన్ మజ్దూర్ మోర్చా అధ్వర్యంలో శుభకరన్ సింగ్‌కు నివాళులు అర్పించే సమావేశాన్ని నిర్వహించనున్నట్లు పంధేర్ తెలిపారు. పంజాబ్, హర్యానా, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్ నుండి రైతులు పెద్ద సంఖ్యలో హాజరవుతారని పేర్కొన్నారు.

టీడీపీలోకి వేమిరెడ్డి, వసంత, లావు

(మొదటిపేజీ తరువాయి)

ప్రతిఒక్కరు కష్టపడి పనిచేసి తెలుగుదేశం-జనసేన కూటమి విజయానికి కృషి చేయాలని కోరారు. గడచిన ఐదేళ్లలో పల్నాడు ప్రాంత అభివృద్ధికి కృషి చేశానని గర్వంగా చెప్పుకుంటానన్నారు. మాచర్ల-వినుకొండ ప్రాంత ప్రజలకు ఎంతగానో ఉపయోగపడనున్న వరికేపూడిశెల ప్రాజెక్టుకు అటవీ అనుమతులను తీసుకు రాగలిగానని తెలిపారు. రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం మూడు మెడికల్ కళాశాల మంజూరు చేస్తే అందులో ఒకటి పల్నాడు ప్రాంతానికి తీసుకు వచ్చామన్నారు.

ఇంటికెళ్లడానికి జగన్ 'సిద్ధం'

విశాలాంధ్ర బ్యూరో-నెల్లూరు: సైకిల్ సునామీలో ఫ్యాన్ రెక్కలు విరగడం ఖాయమని, జగన్ ఇంటికెళ్లడానికి 'సిద్ధం'గా ఉండాలని టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు అన్నారు. నెల్లూరు జిల్లాలో వైసీపీ కీలక నేత, రాజ్యసభ మాజీ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆయన సతీమణి ప్రశాంతి రెడ్డి శనివారం తెలుగుదేశం పార్టీలో చేరారు. వారిద్దరికీ పసుపు కండువా వేసి చంద్రబాబు స్వాగతం పలికారు. వైసీపీకి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఇటీవల రాజీనామా చేశారు. నెల్లూరులోని వీపీఆర్ కన్వెన్షన్ హాలులో శనివారం జరిగిన కార్యక్రమంలో వేమిరెడ్డి దంపతులతో పాటు డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, కేతంరెడ్డి వినోద్ రెడ్డి, వందలాది మంది వైసీపీ నేతలు, కార్యకర్తలు టీడీపీలో చేరారు. వారిని ఉద్దేశించి చంద్రబాబు ప్రసంగిస్తూ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి రాకతో నెల్లూరు జిల్లాలో వైసీపీ ఖాళీ కాబోతుందని, ఇప్పటికే 90 శాతం ఖాళీ అయిందని, ఎన్నికల నోటిఫికేషన్ రాగానే మిగిలిన 10 శాతం కూడా ఖాళీ అవుతుందని తెలిపారు. వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి లాంటి వ్యక్తులు రాజకీయాలకు గౌరవం తెచ్చేవారని, అందుకే తానే నెల్లూరు వచ్చి ఆయనను పార్టీలోకి ఆహ్వానించానన్నారు. వేమిరెడ్డి రాకతో వైసీపీ ఖాళీ కావడం ఖాయమన్నారు. రాష్ట్ర రాజకీయాల్లో సింహపురి రాజకీయం ప్రత్యేకమని, ఇక్కడి నేతలు ఆత్మగౌరవంతో ఉంటారని వెల్లడించారు. జగన్ వేధింపులు భరించలేక జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి, ఆనం రామనారాయణరెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి వైసీపీని వీడారని అన్నారు. రాష్ట్రాన్ని నాశనం చేసిన జగన్‌ను ఇంటికి పంపించాలని పిలుపునిచ్చారు. రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం-జనసేన కూటమి విజయం తథ్యమని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్‌పై చంద్రబాబు వ్యంగ్య బాణాలు సంధించారు. మొన్నటి వరకూ ఒకాయన ఎగిరెగిరి పడ్డారని, కన్నూమిన్నూ కానరాకుండా వ్యవహరించాడని వ్యాఖ్యానించారు. బదిలీల్లో ఒక్క తన్ను తన్నితే ఎగిరి పల్నాడులో పడ్డాడని, ఆయనకు అక్కడ బుల్లెట్ దిగడం... అక్కడి నుంచి చెన్నైకి పారిపోవడం ఖాయమని చంద్రబాబు అన్నారు. అలాగే నెల్లూరు పార్లమెంటుకు నెల్లూరులో ఎక్కడా అభ్యర్థి లేకపోవడంతో విజయసాయిరెడ్డిని తీసుకొచ్చి ఇక్కడ అభ్యర్థిగా ప్రకటించారని, అయితే నెల్లూరు జిల్లా ప్రజలు కచ్చితంగా విజయసాయిరెడ్డిని తిరుగుటపాలో పంపిస్తారన్నారు. 45 సంవత్సరాల రాజకీయ జీవితంలో 9 ఏళ్లు ముఖ్యమంత్రిగా, 15 ఏళ్లు ప్రతిపక్ష నాయకుడిగా ఉన్నానని తెలిపారు. అయితే ఐదు సంవత్సరాలలో ఈ సైకో ముఖ్యమంత్రి పెట్టిన బాధలు అంతా ఇంతా కాదని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక మాజీ ముఖ్యమంత్రిగా తానే ఇంత బాధ పడితే సామాన్య ప్రజలు ఎంత బాధపడ్డారో తనకు అర్థమవుతోందన్నారు. అందుకే ఈ సైకో ముఖ్యమంత్రిని సాగనంపేందుకు జనసేన-టీడీపీ కలసి చేస్తున్న పోరాటానికి అన్ని వర్గాల ప్రజలు చేయూతనివ్వాలని ఆయన కోరారు.

ఈ కార్యక్రమంలో వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, మాజీ మంత్రులు పొంగూరు నారాయణ, సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, ఆనం రామనారాయణ రెడ్డి, శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి, నెల్లూరు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు అబ్దుల్ అజీజ్, శాసన మండలి సభ్యులు, మాజీ కార్పొరేటర్లు, ప్రస్తుత కార్పొరేటర్లు, టీడీపీ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

తారస్థాయికి ఫాసిజం

(మొదటిపేజీ తరువాయి)

శక్తులను ఓడించేందుకు రానున్న ఎన్నికలే చివరి అవకాశమని, దీనిని ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. సీబీఐ, ఈడీ, ఐటీ వంటి ప్రభుత్వ సంస్థలను ఫాసిస్ట్ శక్తులు దుర్వినియోగం చేస్తూ తమ రాజకీయ శత్రువులను భయపెడుతున్నాయని ఆమె విమర్శించారు. ఒకే కూటమి (ఇండియా కూటమి) కి చెందిన ఇద్దరు అభ్యర్థుల మధ్య పోటీ సారూప్యతపై అడిగిన ప్రశ్నకు శ్రీమతి రాజా సమాధానమిస్తూ, దేశం పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థను అనుసరిస్తున్నందున, పార్లమెంటులో ప్రాతినిధ్యం వహించడం ప్రతిపక్షానికి ఉన్న ఒక ప్రత్యేక హక్కు అని అనీ రాజా తెలిపారు. వామపక్ష ప్రజాస్వామ్య ఫ్రంట్ (ఎల్‌డీఎఫ్), యునైటెడ్ డెమొక్రటిక్ ఫ్రంట్ (యూడీఎఫ్) మధ్య రాజకీయ పోరాటమని, ఇది 'ఇండియా కూటమి' ఏర్పాటు సమయంలో నిర్ణయించడం జరిగిందని ఆమె అన్నారు. కేరళ రాజకీయాలు దేశంలోని ఇతర ప్రాంతాల కంటే చాలా భిన్నంగా ఉన్నాయని తెలిపారు. ఎన్నికల్లో ఆమె విజయావకాశాలపై మాట్లాడుతూ... 'నేను పోటీ చేసి గెలవడానికి వచ్చాను' అని నొక్కి చెప్పారు. తాను అధికారంలోకి వస్తే మానవ-జంతు సంఘర్షణలను తగ్గించేందుకు సమర్థవంతమైన చర్యలు తీసుకుంటానని అన్నారు. ఈ నియోజకవర్గంలో పోటీ చేయవద్దని సీపీఐ జాతీయ నాయకులు ఇప్పటికే రాహుల్ గాంధీని కోరారని, అయితే ఆయన పోటీ చేస్తే దానిని కాంగ్రెస్ పార్టీ నిర్ణయంగా పరిగణిస్తామని అనీ రాజా తెలిపారు. ఈ సందర్భంగా పూకోడ్‌లోని వెటర్నరీ అండ్ యానిమల్ సైన్సెస్ కళాశాల విద్యార్థి సిద్ధార్థ్ మృతిపై ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిందితులను త్వరలో అరెస్టు చేస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు.

వారణాసి నుంచే మోదీ

(మొదటిపేజీ తరువాయి)

న్యూఢిల్లీ లోకసభ స్థానం నుంచి పోటీ చేస్తున్న బన్సూరీ స్వరాజ్

మంది ఓబీసీలు బరిలో ఉండగా, 34 మంది మంత్రులు పోటీ చేస్తున్నట్లు చెప్పారు. కాగా గుజరాత్ నుంచి 15 స్థానాలకు బీజేపీ అభ్యర్థులను ప్రకటించింది. అయితే కేంద్ర హోం మంత్రి అమిత్ షాను గాంధీనగర్ నుంచి, కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయను పోర్‌బందర్ నుంచి బరిలోకి దింపింది. కేరళలోని త్రిసూర్ లోక్‌సభ స్థానం నుంచి సినీ నటుడు సురేశ్ గోపి, తిరువనంతపురం నుంచి కేంద్రమంత్రి రాజీవ్ చంద్రశేఖర్ బరిలో నిలవగా...యూపీలోని లక్నో స్థానం నుంచి రాజనాథ్ సింగ్, అమేథీ నుంచి స్మృతీ ఇరానీ మరోసారి పోటీ చేయనున్నారు.

తెలంగాణలో అభ్యర్థులు వీరే...

- కరీంనగర్ - బండి సంజయ్‌కుమార్
- నిజామాబాద్- ధర్మపురి అరవింద్
- జహీరాబాద్- బీబీ పాటిల్
- మల్కాజ్‌గిరి- ఈటల రాజేందర్
- సికింద్రాబాద్- కిషన్ రెడ్డి
- హైదరాబాద్- డాక్టర్ మాధవీ లత
- చేవెళ్ల - కొండా విశ్వేశ్వర్ రెడ్డి
- నాగర్ కర్నూలు- పి.భారత్
- భువనగిరి- బూర నర్సయ్య గౌడ్

బౌద్ధం నుంచే సంప్రదాయాలు

విశాలాంధ్ర-విశాఖ: మనం ఆచరిస్తున్న సంప్రదాయాల్లో అనేకం బౌద్ధం నుంచి వచ్చినవేనని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం, పంచశీల ఫౌండేషన్ ట్రస్ట్ సంయుక్త అధ్వర్యంలో ప్రొఫెసర్ కేఎస్.చలం రచించిన 'బౌద్ధ విజ్ఞానం- లౌకిక జీవనం' పుస్తకావిష్కరణ సభ శనివారం విశాఖలోని పౌర గ్రంథాలయంలో జరిగింది. ఈ సందర్భంగా సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ యోగా, ధ్యానం అప్పట్లోనే ఉన్నాయన్నారు. బోధి వృక్షం కింద బుద్ధుడు ధ్యానం చేశాడన్నారు. సనాతన ధర్మాన్ని ఈ ఆధునిక కాలంలో ఆచరించటం సాధ్యం కాదన్నారు. సనాతన ధర్మం గురించి చెబుతున్న వాళ్లే దాన్ని పాటించడం లేదని అన్నారు. మానవులు ఒక అడుగు ముందుకు వేస్తే మూఢత్వంతో రెండు అడుగులు వెనక్కి వేస్తున్నారన్నారు. యూపీఎస్సీ పూర్వ సభ్యులు ఆచార్య కేఎస్.చలం మాట్లాడుతూ బుద్ధుని జీవితంతో పెనవేసుకున్న ఈ ప్రాంతంలో బౌద్ధ విజ్ఞాన కేంద్రాన్ని నెలకొల్పాల్సిన అవసరం ఉందన్నారు. బౌద్ధం పై పరిశోధనల కోసం బుద్ధ విజ్ఞాన కేంద్రం ఎంతో ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు. అనేక పుస్తకాలు, పరిశోధనా గ్రంథాలను పరిశీలించి ఈ పుస్తకాన్ని వెలుగులోకి తెచ్చామన్నారు. బౌద్ధం అనేది జీవన విధానంగా, ఒక సామాజిక ఉద్యమంగా రూపొందాలని... దేశంలో సాంస్కృతిక చైతన్యం రావాలని ఆశించే వాళ్లలో తానొకడినని అన్నారు. పుస్తకాన్ని ఆవిష్కరించిన బిఖు రాజధమ్మా (మయన్మార్) మాట్లాడుతూ నాది అనే స్వార్థాన్ని వీడాలన్నారు. ప్రపంచ వ్యాప్తంగా బౌద్ధం విస్తరించిందని తెలిపారు.

ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రొఫెసర్ వీ వెంకటరావు మాట్లాడుతూ బౌద్ధ మతానికి ఈ పుస్తకం ఒక నిఘంటువులా పని చేస్తుందన్నారు. బౌద్ధ సాహిత్యంలోని అనేక అంశాలు ఈ గ్రంథంలో ఉన్నాయన్నారు. సమాజంలో హెచ్చుతగ్గులు ఉన్న తరుణంలో బౌద్ధ సిద్ధాంతం వెలుగులోకి వచ్చిందని అభిప్రాయపడ్డారు. మాజీ వీసీ ముత్యాల నాయుడు మాట్లాడుతూ అనేక లోతైన పరిశోధనలు చేసి ఈ గ్రంథాన్ని మలిచారని తెలిపారు. బౌద్ధ విజ్ఞానం - లౌకిక జీవనం పుస్తకాన్ని ఆకాశవాణి వ్యాఖ్యాత కూర్మాన శ్రీదేవి విశ్లేషించారు. ప్రముఖ రచయిత, ఆచార్య చందు సుబ్బారావు మాట్లాడుతూ ఈ దేశ సంస్కృతి, సాంప్రదాయాలు ఎంతో భిన్నమైనవని... ఎంతో సహనాన్ని నేర్పాయని అన్నారు. డాక్టర్ మాటూరి శ్రీనివాస్, బుద్ధ భూమి ఎడిటోరియల్ సభ్యులు, అరసం ప్రధాన కార్యదర్శి ఉప్పల అప్పలరాజు, ఎస్ హనుమంతరావు, పి.శ్యాంసుందర్, డాక్టర్ పా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఓట్ల దొంగలున్నారు జాగ్రత్త

నిమ్మగడ్డ రమేశ్ కుమార్

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ఆంధ్ర ప్రదేశ్‌లో ఓట్ల దొంగలున్నారని, ప్రతి ఓటరు తమ ఓటు కాపాడుకోవాలని సిటిజన్స్ ఫర్ డెమొక్రసీ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఎన్నికల మాజీ అధికారి డాక్టర్ నిమ్మగడ్డ రమేశ్ కుమార్ పిలుపునిచ్చారు. గుంటూరులోని పెన్షనర్ల అసోసియేషన్ హాల్‌లో శనివారం సాయంత్రం 'ఓటు వేద్దాం-ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేద్దాం' అనే అంశంపై కళాజాత కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి సిటిజన్స్ ఫర్ డెమొక్రసీ సంయుక్త కార్యదర్శి వల్లంరెడ్డి లక్ష్మణ రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నిమ్మగడ్డ రమేశ్ కుమార్ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ రాకముందే రాజకీయ పార్టీల నేతలు ఓటర్లకు చీరలు, కుక్కర్లు, డబ్బులు పంచుతుంటే ఎన్నికల కమిషన్ ప్రేక్షక పాత్ర పోషిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం కేంద్ర ఎన్నికల కమిషన్‌కు నివేదికలు కూడా పంపడం లేదని విమర్శించారు. తిరుపతి లోక్‌సభ ఉప ఎన్నికల్లో ఫొటోలు మార్ఫింగ్ చేసి 35 వేల దొంగ ఓట్లను వినియోగించారని స్పష్టం చేశారు. ఇటువంటి పరిస్థితి భారతదేశంలో ఏనాడు జరగలేదన్నారు. ప్రజల్లో నిశ్శబ్ద విప్లవం రావాలని, రాష్ట్ర అభివృద్ధిని, సుపరిపాలనకు, ఉపాధి కల్పనకు తోడ్పడే నేతలను ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు. వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ భారతదేశంలోకెల్లా అత్యంత ఎన్నికల వ్యయం ఆంధ్ర ప్రదేశ్‌లో జరగబోతుందని, ప్రజాస్వామ్యం ధనస్వామ్యంగా మారుతుందని ఆరోపించారు. అధికార యంత్రాంగం, అధికార పార్టీ కనుసన్నల్లో అక్రమాలకు పాల్పడుతోందన్నారు. ప్రజా సాంస్కృతి వేదిక ఆర్.రాజేష్ నేతృత్వంలో కళాకారుల బృందం ఆటపాట మాటలతో ఓటర్లను చైతన్యం గావించే కార్యక్రమాలు నిర్వహించారు. సభికులను ఆలోచింపజేశారు. ఈ కార్యక్రమంలో మానవతా సంస్థ ఛైర్మన్ పావులూరి రమేష్, పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు డి.వెంకటేశ్వర్లు, ప్రైవేటు విద్యాసంస్థల నేత మేకల రవీంద్రబాబు, ప్రోగ్రెసివ్ ఫోరం అధ్యక్షులు పి.మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

శాశ్వతంగా ఎన్‌డీఏలోనే ఉంటా

మోదీ సాక్షిగా నితీశ్ హామీ

పాట్నా : ఇకపై కూటమి మారబోయేది లేదని బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ అన్నారు. తాను ఎన్‌డీఏలో ఉంటానని ప్రధాని మోదీ సాక్షిగా ఆయన హామీ ఇచ్చారు. ఔరంగాబాద్‌లో శనివారం జరిగిన బహిరంగ సభలో మోదీతో పాటు పాల్గొన్న నితీశ్ ఈ వ్యాఖ్యలు చేశారు. 'గతంలో కూటమి (ఇండియా కూటమిని ఉద్దేశిస్తూ) కి ఆ పేరు పెట్టేందుకు నిరాకరించా. అయినప్పటికీ వారు దాన్నే ఖరారు చేశారు. ఈ కారణాలతో తిరిగి ఎన్‌డీఏ గూటికి చేరా. ఇప్పటికీ సీట్ల సర్దుబాటు అంశం కొలిక్కిరాలేదు. గతంలో ఎన్నోసార్లు ప్రధాని ఇక్కడికి వచ్చారు. ఈసారి మీతో కలిసి ఉన్నందుకు నేనెంతో అదృష్టవంతుడిని. శాశ్వతంగా కూటమి మారకుండా... మీతోనే కలిసి నడుస్తా. బీహార్ అభివృద్ధికి కృషి చేస్తా' అని నితీశ్ అన్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రచారాన్ని ముమ్మరం చేసిన ప్రధాని ఆయా రాష్ట్రాల్లో పర్యటిస్తున్నారు. శనివారం బీహార్‌కు చేరుకున్న ఆయన రూ.21,400 కోట్ల ప్రాజెక్టులను ప్రారంభించారు. మరికొన్నింటికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసేందుకు 'వంశ పాలకులు' భయపడుతున్నారని, అందుకే పార్లమెంటులో అడుగుపెట్టేందుకు రాజ్యసభ దారులు వెతుకుతున్నారని విపక్షాలను ఉద్దేశించి ఎద్దేవా చేశారు. వంశ పాలనలో మునిగిపోయి, ప్రజల మనసుల్లో భయాందోళనలు సృష్టించిన వారిని ఎన్‌డీఏ కూటమి కట్టడి చేసిందని, రాష్ట్రంలో 'కాంగ్రెస్-ఆర్‌జేడీ దోస్తీని ఉద్దేశించి అన్నారు. బీహార్‌లో అభివృద్ధి, చట్టబద్ధమైన పాలన, మహిళలకు భద్రత తన 'గ్యారెంటీ' అని చెప్పారు. మాజీ ముఖ్యమంత్రి కర్పూరీ ఠాకూర్‌కు 'భారత రత్న' లభించడం మొత్తం బీహార్‌కు దక్కిన గౌరవమని పేర్కొన్నారు.

అమెరికాలో నృత్య కళాకారుడు కాల్చివేతపై స్పందించిన భారత కాన్సులేట్

న్యూఢిల్లీ : అమెరికాలో కోల్‌కతాకు చెందిన నృత్య కళాకారుడిని దుండగులు కాల్చిచంపిన ఘటనపై చికాగోలోని భారత కాన్సులేట్ స్పందించింది.

ఈవెనింగ్ వాక్‌కు వెళ్లిన భారత నృత్య కళాకారుడు అమర్‌నాథ్ ఘోష్ మృతిపై దర్యాప్తును వేగవంతం చేయాలని భారత కాన్సులేట్ సెయింట్ లూయిస్ పోలీసులను కోరింది. మిసోరిలో గుర్తుతెలియని వ్యక్తి ఘోష్‌ను కాల్చిచంపిన ఘటనలో బాధిత కుటుంబ సభ్యులకు, స్నేహితులకు భారత కాన్సులేట్ ప్రగాఢ సానుభూతి తెలిపింది. ఈ ఘటనపై ఫోరెన్సిక్, దర్యాప్తును తాము పర్యవేక్షిస్తున్నామని, కావాల్సిన సాయం అందిస్తామని చికాగోలోని భారత కాన్సులేట్ సోషల్ మీడియా వేదికగా భరోసా ఇచ్చింది. ఈ కేసు దర్యాప్తు విషయంలో సెయింట్ లూయిస్ పోలీసులు, యూనివర్సిటీ అధికారులను అప్రమత్తం చేసినట్లు పేర్కొంది.

నిర్వాసితులను వెలుగొండలో ముంచుతారా?

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్రకాశం జిల్లా వెలుగొండ ప్రాజెక్టు పరిధిలోని 11 గ్రామాల్లో ఉన్న ఎనిమిది వేల కుటుంబాలకు పునరావాసం కల్పించకుండానే ప్రాజెక్టును జాతికి అంకితం చేయబో తున్నట్లు ప్రకటించడం హాస్యాస్పదమని, ఎన్నికల కోసమే అసంపూర్ణంగా ఉన్న ఈ ప్రాజెక్టును ప్రారం భించనున్నారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు శనివారం ఓ ప్రకటనలో విమర్శించారు. నిర్వాసితులకు పునరావాసం కల్పించకుండా వెలుగొండలో ముంచుతారా అని ప్రశ్నించారు. ఫీడర్ కెనాల్ పూర్తికాలేదని, వదలడానికి శ్రీశైలంలో నీళ్లు లేవని వివరించారు. ఇది కేవలం ఎన్నికల స్టంట్ తప్ప మరొకటి కాదనీ, ప్రకాశం, కడప, నెల్లూరు జిల్లాల ప్రజలను మోసగించడాన్ని తీవ్రంగా ఖండించారు. ప్రకాశం జిల్లా ప్రజల కలల పంటగా ఉన్న వెలుగొండ ప్రాజెక్టు 40 ఏళ్లుగా సాగుతూనే ఉందన్నారు. పదే పదే గడువులు పెట్టి, పూర్తి చేయకుండా గత టీడీపీ, ప్రస్తుత వైసీపీ ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరించాయని తెలిపారు. జగన్ ప్రభుత్వం నాలుగేళ్లుగా ప్రాజెక్టు పూర్తయిందని ఊరిస్తూనే ఉందనీ, నిధులు ఇవ్వకపోవడం, పునరావాసం పూర్తిచేయకపోవడంతో ఇది దీర్ఘకాలం పెండింగ్‌లో ఉందని పేర్కొన్నారు. ఎన్నికలప్పుడు మాయమాటలు చెప్పి పాలకులు తప్పించుకుంటు న్నారని, ఇప్పటికైనా పూర్తిస్థాయి నిధులు కేటాయించి వచ్చే ఖరీఫ్ నాటికి ప్రజలకు నీళ్లు అందుబాటులోకి తేవాలని, ఈలోగా పునరావాసం పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

పేదలకు వరం ఇందిరమ్మ అభయం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పేద కుటుంబాలకు వరం ఇందిరమ్మ అభయం అని, దేశంలోనే తొలి సారిగా ఈ పథకాన్ని కాంగ్రెస్ అమలు చేస్తోందని ఆ పార్టీ సీనియర్ నేత ఎన్.తులసిరెడ్డి చెప్పారు. విజయవాడ ఆంధ్రరత్న భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రతి పేద కుటుంబ మహిళకు రూ.ఐదు వేల చొప్పున ఇస్తామని, దీని ద్వారా మహిళలకు భరోసా ఇవ్వగలమని పేర్కొన్నారు. నాడు ఏపీకి ప్రత్యేక హోదా ఐదేళ్లు అని యూపీఏ ప్రభుత్వ ప్రధాని మన్‌మోహన్‌సిగ్ సభలో ప్రకటిస్తే, అప్పటి ప్రతిపక్షాలైన బీజేపీ, దాని కూటమి పదేళ్లు కావాలని అడిగారని గుర్తుచేశారు. హోదా అమలులో మోదీ ప్రభుత్వం ప్రజలను మోసగిం చిందని మండిపడ్డారు. ఢిల్లీ సమావేశంలో సునీతా రెడ్డి మాట్లాడుతూ, తన అన్నకు ఓట్లు వేయవద్దని, హంతకులకు పాలించే అర్హత లేదని ఆమె మాట్లాడారని గుర్తుచేశారు. కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్ మాట్లాడుతూ, తిరుపతిలో నిర్వహించిన ప్రత్యేక హోదా డిక్లరేషన్ భారీ బహిరంగ సభ విజయవంతమైందన్నారు. కొలను కొండ శివాజీ, విజయవాడ నగర అధ్యక్షుడు నరహరిశెట్టి నరసింహారావు, ఎస్సీ సెల్ చైర్మన్ సాకే శంకర్ పాల్గొన్నారు.

బీజేపీ ఓటమే ధ్యేయంగా పనిచేయాలి

ముప్పాళ్ల నాగేశ్వరరావు

విశాలాంధ్ర-డోన్: బీజేపీ ఓటమే ధ్యేయంగా 'ఇండియా కూటమి' పని చేయాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు. శనివారం నంద్యాల జిల్లా డోన్ పట్టణ సీపీఐ కార్యాలయంలో పార్టీ మండల కార్యదర్శి పులి శేఖర్ అధ్యక్షతన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముప్పాళ్ల మాట్లాడుతూ దేశంలో ఎన్నికల హడావిడి మొదలైంద న్నారు. బీజేపీ మరోసారి అధికారంలోకి వస్తుందని ఆ పార్టీ నాయకులు చెబుతుండటం విడ్డూరంగా ఉందన్నారు. రూపాయి మార్కెట్ విలువ ఎందుకు పడిపోయిందో బీజేపీ నేతలు చెప్పాలన్నారు. 2014 సంవత్సరంలో డాలర్ విలువ 58 రూపాయలు ఉండగా... ఇప్పుడు 83 రూపాయల అయ్యిందన్నారు. దీంతో దేశ ఆర్థిక వ్యవస్థ కుదేలయిందన్నారు. దేశాన్ని అప్పుల్లో, ఆర్థికంగా కుంగదీసిన ఘనత మోదీకే దక్కిందన్నారు. గతంలో గ్యాస్ సిలిండర్ ధర రూ.450 ఉన్నప్పుడు బీజేపీ నేతలు ఢిల్లీలో రోడ్డెక్కి పెద్ద ఆందోళన చేశారన్నారు. ఇప్పుడు గ్యాస్ సిలిండర్ ధర 1,150 రూపాయలైనప్పుడు సీపీఐ ధర్నాలు చేస్తే రూ.912 చేశారన్నారు. పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడం వల్ల 120 నిత్యావసర వస్తువుల ధరలు పరోక్షంగా పెరిగాయని విమర్శించారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను జీఎస్‌టీ పరిధిలోకి తీసుకురావాలన్నారు. 2014 సంవత్సరానికి ముందు బీజేపీ తాము అధికారంలోకి రాగానే రెండు కోట్ల ఉద్యోగాలు, ప్రతి ఇంటికి రూ.15 లక్షలు అందిస్తామని ప్రకటించిందన్నారు. తీరా అధికారంలోకి రాగానే అవన్నీ మరిచిపోయిందని తెలిపారు. తాజాగా రాముని పేరు చెప్పి అయోధ్య నిర్మించామని రాజకీయం చేయడం సరికాదన్నారు. కమ్యూనిస్టు పార్టీకి అన్ని మతాలు సమానమేనని అని వెల్లడించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ ఢిల్లీకి వెళ్లి బీజేపీ భజన చేస్తుండగా, రాష్ట్ర ఆర్థిక మంత్రి ఢిల్లీలో అప్పుల భజన చేస్తుండటంపై ముప్పాళ్ల మండిపడ్డారు. రాష్ట్రంలో పత్రికా స్వేచ్ఛకు సంకెళ్లు వేసిన చరిత్ర ఈ ప్రభుత్వానికి దక్కిందన్నారు. డోన్ ఎమ్మెల్యే బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి నియోజకవర్గంలో ఇంటింటికీ నీరు ఇస్తామని చెప్పి... ఇప్పటివరకు ఇవ్వలేదన్నారు. పాతబడిన కూరగాయల మార్కెట్, ప్రభుత్వాస్పత్రి, గెస్ట్ హౌస్ కట్టినంత మాత్రాన అభివృద్ధి కాదన్నారు. గ్రామాల్లో కూడా సీసీ రోడ్లు వేసినప్పుడు, తాగునీరు అందించినప్పుడే అభివృద్ధి అన్నారు. టీడీపీ, జనసేన రెండూ కలిసి బీజేపీ పొత్తు కోసం వెంపర్లాడుతున్నాయని విమర్శించారు. కేసీఆర్ అహంకారపూరిత వాగ్దానాలతోనే తెలంగాణలో ఓడిపోయారని అన్నారు. జగన్ బటన్ నొక్కడం తప్ప, ప్రత్యేక హోదా, ప్యాకేజీ, స్టీల్ ప్లాంట్ గురించి మాట్లాడం లేదన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడు మాట్లాడుతూ ఈ నెల 4న నంద్యాల జిల్లా బనగానపల్లికి ఆస్పత్రి ప్రారంభోత్సవం సందర్భంగా సీఎం జగన్ రానున్నరన్నారు. అయితే సెలవు రోజును పని దినంగా... పని దినాన్ని సెలవు రోజుగా ప్రకటించి సర్క్యులర్ ఇవ్వడం ఏమిటని డీఈవో సుధాకర్ రెడ్డిపై మండిపడ్డారు. వైసీపీ ప్రభుత్వంలో ఐపీఎస్, ఐఏఎస్‌లు ఉద్యోగాలకు రాజీనామా చేసి ఎమ్మెల్యేగా, ఎంపీలుగా పోటీ చేస్తున్నారని. డీఈవో సుధాకర్ రెడ్డికి వైసీపీ ప్రభుత్వంపై ప్రేమ ఉంటే వెంటనే రాజీనామా చేసి పార్టీలో చేరాలని సూచించారు. నంద్యాల జిల్లాలో 29 మండలాలు ఉండగా... 18 మండలాల్లో కరువు ఉందని అధికారులే అంచనా వేశారని అన్నారు. అయితే కేవలం ఆరు మండలాలనే కరువు ప్రాంతాలుగా ప్రకటించి ప్రభుత్వం చేతులు దులుపుకుందన్నారు. దీంతో ఈ ప్రాంతంలో రైతులు ఇతర ప్రాంతాలకు వలస వెళు తున్నారని తెలిపారు. డోన్ నియోజకవర్గంలో ఆర్థిక మంత్రి బుగ్గన అభివృద్ధి పనులు పూర్తి కాకుండానే ప్రారంభోత్సవాలు చేస్తున్నారని విమర్శించారు. త్వరలో ప్రారంభోత్సవాలు చేసిన ప్రాంతాల్లో పర్యటించి ప్రశ్నిస్తామన్నారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మోట రాముడు, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు రణత్ యాదవ్ ఉన్నారు.

ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు తప్పనిసరి

- నేడు పల్స్‌పోలియో
- కరువు మండలాల్లో ఉపాధి హామీ పనులు
- తాగునీటి కొరత లేకుండా చర్యలు
- సమీక్షలో సీఎస్ జవహర్‌రెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా ఆదివారం నిర్వహించనున్న పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) డాక్టర్ కె.ఎస్. జవహర్‌రెడ్డి... కలెక్టర్లు, వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. విజయవాడలోని తన క్యాంపు కార్యాలయం నుంచి శనివారం ఆయన మూడో విడత భూముల రీసర్వే, ఈనామ్, అసైన్డ్ భూములు, ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్, కరువు మండలాల్లో ఉపాధి హామీ పనులు, తాగునీరు, మైక్రో స్మాల్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ (ఎంఎస్ఎంఈ) క్లస్టర్లు, పరిశ్రమలకు భూముల కేటాయింపు, పప్పు దినుసులు, ఆయిల్ సీడ్స్ సేకరణ, జగనన్న ఆరోగ్య సురక్ష, ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ, పల్స్ పోలియో తదితర కార్యక్రమాలపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సీఎస్ మాట్లాడుతూ, ఆదివారం రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించే జాతీయ ఇమ్యునైజేషన్ డే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలో ఐదేళ్లలోపు వయస్సు గల 53,35,519 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేసేందుకు 37,465 పోలియో బూత్‌లను, 1,693 మొబైల్ టీంలను, 1,087 ట్రాన్సిట్ టీంలను ఏర్పాటు చేశామన్నారు. బూత్‌ల వారీగా పోలియో చుక్కలు వేశాక, ఇంకా ఎవరైనా మిగిలి ఉంటే గ్రామీణ ప్రాంతాల్లో ఈ నెల నాలుగు, ఐదు తేదీల్లోను, పట్టణ ప్రాంతాల్లో నాలుగు, ఐదు, ఆరు తేదీల్లో ఇంటింటికి వెళ్లి పోలియో చుక్కలు వేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మురికివాడలు, సంచార జాతులు నివసించే ప్రాంతాలు, ఇటుక బట్టీలు, నిర్మాణ పనులు జరిగే ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. రైల్వేస్టేషన్లు, బస్‌స్టేషన్లు ఇతర రద్దీ ప్రాంతాల్లో మొబైల్ బృందాల ద్వారా పోలియో చుక్కలు వేయించాలన్నారు. వైద్యారోగ్యశాఖతో పాటు విద్యా, స్త్రీ శిశు సంక్షేమ, మున్సిపల్, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఆర్టీసీ తదితర శాఖల విభాగాలు సమన్వయంతో పని చేసి పల్స్ పోలియోను విజయవంతం చేయాలన్నారు.

కరువు మండలాల్లో ఉపాధి పనులు, తాగునీటి పరిస్థితులపై సీఎస్ మాట్లాడుతూ, జాతీయ ఉపాధి హామీ పథకం కింద 100 రోజులు పని దినాలను తప్పని సరిగా కల్పించాలని కలెక్టర్లను ఆదేశించారు. ఎక్కడా తాగునీటి ఇబ్బంది రాకుండా ముందస్తు జాగ్రత్త లు తీసుకోవాలన్నారు. తాగునీరు, ఉపాధికి రాబోయే మూడు మాసాలు అత్యంత కీలకమన్నారు. తాగునీటికి ఇబ్బందులు ఉన్న ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాకు తగిన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని చెప్పారు. పప్పు దినుసులు, ఆయిల్ సీడ్స్ సేకరణపై మాట్లాడుతూ, కనీసం మద్దతు ధరకు రైతుల నుంచి మినుములు, పెసలు, వేరుశెనగ తదితర పంటలు కొనుగోలుకు చర్యలు తీసుకోవాలన్నారు. రైతులకు ఎరువులు కొరత లేకుండా చూడాలని ధరలను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.

పరిశ్రమలు, ఏంఎస్ఎంఈ క్లస్టర్లకు భూముల కేటాయింపు అంశంపై మాట్లాడుతూ, వివిధ పరిశ్రమలు, కంపెనీలు సకాలంలో ఏర్పాటు అయ్యేందుకు భూములు కేటాయింపు చేపట్టాలన్నారు. మూడో విడత భూముల రీసర్వే, ఈనామ్, అసైన్డ్ భూములు, ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్, జగనన్న ఆరోగ్య సురక్షపై కలెక్టర్లతో ఆయన సమీక్షించారు. రాష్ట్ర సర్వే అండ్ రీసెటిల్మెంట్ శాఖ కమిషనర్ సిద్ధార్థ జైన్, స్టాంప్‌లు, రిజిస్ట్రేషన్ శాఖ ఐజీ రామకృష్ణ, వైద్య ఆరోగ్యం కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ జె.నివాస్, విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ కూర్మనాథ్, సీసీఎల్ఏ జి.సాయి ప్రసాద్, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్, సహకార శాఖ కమిషనర్ బాబు, పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్ హాజరయ్యారు.

'కరపాటి' ఆశయసాధనకు కృషి

అంతిమయాత్రలో ప్రముఖుల నివాళి

విశాలాంధ్ర-మచిలీపట్నం: కార్మిక సంఘాల బలోపేతానికి కరపాటి సత్యనారాయణ చేసిన కృషి మరువలేనిదని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.సుబ్బారాయుడు అన్నారు. స్థానిక ఓగిసు పేటలో శనివారం కరపాటి పార్థివ దేహాన్ని సందర్శించి, ఎర్రజెండా కప్పి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సుబ్బారాయుడు మాట్లాడుతూ, కార్యదీక్ష, పట్టుదలతో కార్మికుల సమస్యలు తన సమస్యలుగా భావించి పరిష్కారం దిశగా పయనించిన మహోన్నతుడు అన్నారు. పోరాట పటిమ, అనునిత్యం కష్టపడే తత్వం కలిగిన వ్యక్తి అని కొనియాడారు. కరపాటి ఆశయ సాధన కోసం కలిసికట్టుగా ఉండాలని, సంఘాన్ని బలపరుచుకుంటూ ముందుకు సాగాలని అన్నారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర డిప్యూటీ ప్రధాన కార్యదర్శి బందెల రవికుమార్ మాట్లాడుతూ, సమస్యల పరిష్కారం కోసం నిత్య కృషీవలుడుగా సత్యనారాయణ చేసిన సేవలు ఎన్నటికీ మర్చిపోలేమని పేర్కొన్నారు. సీపీఐ నేత మోదుమూడి రామారావు మాట్లాడుతూ, నిరంతరం మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారానికి పోరాడుతూనే రేల్లి కుల పెద్దగా ఉంటూ కులం కట్టుబాట్లులో వచ్చిన సమస్యలను వెంటఉండి పరిష్కరించే వారని అన్నారు. సత్యనారాయణ కుటుంబానికి అండగా ఉంటామన్నారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ట్రెజరర్ తాడికొండ వాసు, కె.చంద్రరావు, రాజేష్, బి. శివశంకర్, బి.ఆంజనేయులు, ఎర్రంశెట్టి ఈశ్వరరావు, తాడిపర్తి రామకృష్ణ, ఒడుగు రత్నకుమారి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం పురవీధుల గుండా కరపాటి అంతిమ యాత్ర కొనసాగింది. సీపీఐ కృష్ణాజిల్లా సీనియర్ నేత నార్ల వెంకటేశ్వరరావు, సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్, నియోజకవర్గ కార్యదర్శి లింగం ఫిలిప్ తదితరులు కరపాటి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

సమస్యలు పరిష్కరించండి

- కలెక్టరేట్ వద్ద సర్పంచ్‌ల ధర్నా
- దారిమళ్లించిన నిధులు జమ చేయాలంటూ నినాదాలు
- బారికేడ్లు తొలగించి కలెక్టర్‌ను కలిసేందుకు యత్నం
- అడ్డుకున్న పోలీసులు... ఉద్రిక్తత

విశాలాంధ్రబ్యూరో-ఏలూరు: పంచాయతీల్లో తాము ఎదుర్కొంటున్న అనేక సమస్యలను తక్షణమే పరిష్కరించాలంటూ పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర అధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్ ఆధ్వ ర్యంలో సర్పంచ్‌లు శనివారం స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. కేంద్రం విడుదల చేసిన ఆర్థిక సంఘం నిధులను వెంటనే పంచాయతీలకు జమ చేయాలని, సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థను పంచాయతీల పరిధిలోకి తేవాలని, ఉపాధి హామీ నిధులను నేరుగా పంచాయతీ ఖాతాలకు జమచేయాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం వైవీబీతో పాటు సర్పంచ్‌లంతా కలెక్టర్‌కు వినతిపత్రం అంద జేసేందుకు ప్రయత్నించగా పోలీసులు లోపలికి అనుమతించలేదు. కేవలం ఇద్దరిని మాత్రమే అనుమతిస్తామని చెప్పడంతో వారు ఆగ్రహంతో బారికేడ్లు తొలగించడానికి ప్రయత్నించగా పోలీ సులు, సర్పంచ్‌ల నడుమ కొద్దిసేపు పెనుగులాట జరిగింది. ఒక్కసారిగా బారికేడ్లు తొలగించి కలెక్టర్ కార్యాలయం వైపునకు దూసుకువెళ్తుండగా పోలీసులు కలెక్టరేట్ గేట్‌కు తాళం వేయడంతో సర్పంచ్‌లు ఆగ్రహం వ్యక్తం చేశారు. బయటనుంచే నినాదాలు చేశారు.

రాష్ట్రంలో పోలీస్ రాజ్యం: వైవీబీ

వైవీబీ మాట్లాడుతూ, తాము శాంతియుతంగా తమ సమస్యలను కలెక్టర్‌కు విన్నవించేందుకు వెళు ంటే పోలీసులు ఎందుకు అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. మేం టెర్రరిస్టులమా, లేదంటే పాకిస్తాన్ నుంచి వచ్చామా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో పోలీసు రాజ్యం నడుస్తుందని, ప్రశ్నించే వారిపై దాడులకు తెగబడుతున్నారని ఆరోపిం చారు. సంక్షేమ పథకాల పేరుతో పంచాయతీ నిధులు పక్కదారి మళ్లించారన్నారు. తమ అధి కారాలు, విధులను నిర్వీర్యం చేశారన్నారు. మూడేళ్లుగా వివిధ దశల్లో పోరాటాలు చేస్తున్నా ముఖ్యమంత్రి జగన్‌కు చీమకుట్టినట్టు లేదని ధ్వజ మెత్తారు. పంచాయతీ నిధులు దొడ్డిదారిన స్వాహా చేస్తుంటే సర్పంచ్‌లు ఉత్సవ విగ్రహాలుగా మిగిలి పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో అభివృద్ధి చేయలేని అసమర్థులుగా మారారన్నారు. రాబోయే ఎన్నికల్లో జగన్ ప్రభుత్వం తిరిగి అధికారం చేపడితే పల్లెలు శిథిలమైపోయి, ప్రజ లకు దుర్భర దారిద్య పరిస్థితులు ఏర్పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. మనల్ని మనం కాపాడుకోవడానికి జగన్‌ను చిత్తుచిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. 'జగన్ ఓడితేనే మన మనుగడ' అనే నినాదంతో అన్ని పార్టీలకు సంబం ధించిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లు చిత్తశుద్ధితో తమతమ గ్రామాల్లో వైసీపీని ఓడించడానికి కలిసి కట్టుగా పనిచేయాలన్నారు. అనంతరం కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్‌కు వినతిపత్రం అందజేశారు. ఏపీ పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిర్రు ప్రతాపరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వై.వినోద్ రాజు, చిత్తూరు జిల్లా పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షుడు చుక్క ధనుంజయ యాదవ్, సర్పంచుల సంఘం గౌరవ సలహాదారులు పిల్లి సత్తిరాజు, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు పాలడుగు లక్ష్మణరావు, జిల్లా పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షుడు కదలి గోపాలరావు పాల్గొన్నారు.

ఎల్ఓటీలో ఆర్టీసీకి డిజిటల్ టెక్నాలజీ సభ అవార్డు



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఎల్ఓటీ) విభాగంలో 2024 సంవత్సరానికి గాను ఏపీఎస్ ఆర్టీసీకి డిజిటల్ టెక్నాలజీ సభ అవార్డు లభించింది. జాతీయ స్థాయిలో వివిధ సంస్థలతో పోటీపడి ఈ అవార్డును కైవసం చేసుకుంది. ఈ-యాప్ ద్వారా నగదు రహిత లావాదేవీలు, కాగిత రహిత టికెట్ల జారీ సౌలభ్యాన్ని ఆర్టీసీ ప్రవేశపెట్టింది. బస్సుల్లో డిజిటల్ టికెట్లు జారీ చేయడం, సంస్థ అన్ని బస్సుల్లో ట్రాకింగ్ పద్ధతిని ఏర్పాటు చేయడం ద్వారా ఈ అవార్డును కైవసం చేసుకుంది. కలకత్తా నగరంలో శనివారం ఒబెరాయ్ హోటల్‌లో జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ద్వారకా తిరుమలరావు తరపున చీఫ్ ఇంజినీర్ (ఐటీ) వి.సుధాకర్, డిప్యూటీ చీఫ్ ఇంజినీర్ వై.శ్రీనివాసరావు అవార్డును అందుకున్నారు.

విశాఖ పోర్టు నూతనధ్యాయం

- ఆర్థిక సంవత్సరం ముగియకుండానే 73.78 మెట్రిక్ టన్నుల సరుకు రవాణా
- 90 ఏళ్ల చరిత్రలో ఇది రికార్డు

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: విశాఖపట్నం పోర్టు అథారిటీ సరుకు రవాణాలో నూతన అధ్యాయాన్ని లిఖించింది. ఇప్పటి వరకు సరుకు రావాణలో పోర్టు సాధించిన రికార్డులను తిరగరాసి నూతన రికార్డును నెలకొల్పే దిశగా పరుగులు పెడుతోంది. 2023-24 ఆర్థిక సంవత్సరం ముగియకుండానే పోర్టు ఈ ఏడాది 73.78 మిలియన్ మెట్రిక్ టన్నుల సరుకును రవాణా చేసి గత ఏడాది సాధించిన అత్యధిక సరుకు రికార్డును అధిగమించింది. 1933లో నెలకొల్పిన పోర్టు ఈ ఏడాదికి 90 ఏళ్లు పూర్తి చేసుకుంది. 73.73 మిలియన్ మెట్రిక్ టన్నుల సరుకు రవాణానే ఇప్పటి వరకూ పోర్టు చరిత్రలో అత్యధిక సరుకు రవాణాగా రికార్డుల్లో ఉండేది. అయితే ఈ ఏడాది ఈ నెల రెండు నాటికే పోర్టు ఆ రికార్డును తిరగరాసి 73.78 మిలియన్ మెట్రిక్ టన్నుల సరుకును రవాణా చేసింది. విశాఖపట్నం పోర్టు చైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు సమర్థవం తమైన నాయకత్వంలో డిప్యూటీ చైర్మన్, విభాగాధిపతుల సమన్వయం కారణంగా పోర్టు ఈ ఘనతను సాధించింది. దీంతో చైర్మన్ సంతృప్తిని వ్యక్తం చేస్తూ అత్యధిక సరుకు రవాణా రికార్డును నెలకొల్పడంపై ఆయన ట్రాఫిక్ మేనేజర్ బి.రత్నశేఖర్‌రావును ఆయన టీం సభ్యుల ను ప్రత్యేకంగా అభినందించారు. ఈ ఏడాది పోర్టు 80 మిలియన్ మెట్రిక్‌టన్నుల రికార్డును నెలకొల్పాలని ఈ సందర్భంగా చైర్మన్ ఆకాంక్షించారు. వివరాలను పోర్టు కార్యదర్శి టి.వేణుగోపాల్ వెల్లడించారు.

ఎన్నికల మేనిఫెస్టోల్లో

జర్నలిస్టుల సమస్యలు చేర్చండి

సీపీఐ, సీపీఎం నేతలకు ఏపీయూడబ్ల్యూజే వినతి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ఒక సమగ్ర విధానాన్ని రూపొందించాలని, అందుకోసం జర్నలిస్ట్ మేనిఫెస్టో అమలు చేయాలని ఆంధ్ర ప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ నేతలు శనివారం సీపీఐ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శులు కె.రామకృష్ణ, వి.శ్రీనివాసరావును కలిసి విజ్ఞప్తి చేశారు. ఆ మేరకు ఏపీయూడబ్ల్యూజే రూపొందించిన 15 అంశాలతో కూడిన 'జర్నలిస్ట్ మేనిఫెస్టో'ను వారికి అందజేశారు. అక్రెడిటేషన్ నిబంధనలను సరళతరం చేయాలని, గతంలో ఉన్న హెల్త్ కార్డుల పథకాన్ని పటిష్ఠంగా అమలు చేయాలని, ప్రమాద బీమా పథకం తిరిగి ప్రవేశ పెట్టాలని, ఇళ్ల స్థలాల జీవోను మార్చి సీనియారిటీ ప్రాతిపదికన నామ మాత్రపు ధరకు స్థలాలు ఇవ్వాలని, గతంలో ఉన్న ప్రొఫెషనల్ కమిటీలను తిరిగి ఏర్పాటు చేయాలని, సంక్షేమ నిధిని పునరుద్ధరించాలని, ప్రెస్ అకాడమీకి నిధులు ఇచ్చి పని చేయించాలని, రైల్వే ప్రయాణ రాయితీని కొనసాగించాలని, పాత్రికేయులకు పింఛను ఇవ్వాలని, ఉత్తమ జర్నలిస్టుల అవార్డులను తిరిగి ప్రారంభించాలని యూనియన్ నేతలు కోరారు. రాజకీయ పార్టీలన్నీ తమ ఎన్నికల ప్రణాళికల్లో జర్నలిస్ట్ మేనిఫెస్టోను కూడా ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చందు జనార్ధన్, కార్యవర్గ సభ్యులు చావా రవి, సామ్నా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ రమణారెడ్డి, ఐజేయూ కౌన్సిల్ సభ్యుడు షేక్ బాబు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు దారం వెంకటేశ్వరరావు, విజయవాడ ప్రెస్ క్లబ్ కార్యదర్శి డి.నాగరాజు, రఘు తదితరులు పాల్గొన్నారు.

GREATER VISAKHAPATNAM MUNICIPAL CORPORATION

NOTICE INVITING TENDER (NIT) REQUEST FOR PROPOSAL (RFP)

GVMC desires to invite RFP for "Content Creation about Publishing of Information of Municipal Corporation Activities through Online and Offline Communications". The details can be downloaded from website of **www.apeprocurement.gov.in.**

1. Tender Notice No:06/2023-24/CE(GVMC)/SE(P-I)/EE(PD-II)/Dt:02.03-2024
2. Download starting date: 02/03/2024 @ 8.00 PM 3. Download ending date: 07/03/2024 @ 3:00 PM
4. Last date of submission of bids: 07/03/2024@ 4:00 PM

For more details contact: E-mail: eepd2_gvmc@yahoo.co.in
Mobile No. 8501949467

For Commissioner

సంపాదకీయం

సాయానికి సమయమిది!

పలస్తీనియన్ల పరిస్థితి దారుణంగా మారింది. వారి ఆకలికేకలు, ఆర్తనాదాలు సగం ప్రపంచానికి వినపడటం లేదు. అగ్రరాజ్యం అమెరికా పెద్దన్న పాత్ర అడ్డదారులు తొక్కడంతో భారత్ వంటి ప్రజాస్వామ్య దేశాలకూ గాజా పౌరుల ఆవేదన పట్టడం లేదు. చారిత్రకంగా పలస్తీనియన్లకు భారత్ గొప్ప మద్దతుదారు. కానీ బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అమెరికా పాదరక్షలపై కన్నీటిని జమ చేసుకోవడానికే ప్రభుత్వం వద్ద సమయం సరిపోవడం లేదు. 'అంకుల్ శామ్' మాయలో పడిన మోదీ సర్కారుకు అభేద్యమైన, అద్వితీయమైన అలనాటి విదేశాంగ విధానం ఏనాటికైనా వంటపడుతుందని ఆశించడం పొరపాటే అవుతుందేమో! ఇలాంటి సంక్లిష్ట సమయంలో పలస్తీనియన్లకు భారత్ అండగా ఉండిఉంటే ఒక గొప్ప సానుకూల పరిణామం సంభవించి ఉండేదేమో!... కానీ ఇటీవల ఆకలితో ఆహారపొట్లాలకోసం చేయిచాస్తున్న వందలాది మందిని ఇజ్రాయిల్ నిర్దాక్షిణ్యంగా ఊచకోత కోసిన ఘటనను యావత్ ప్రపంచం ఖండించినప్పటికీ, భారత్ నుంచి ఉలుకూపలుకూ లేదు. ఈ ఉదంతం పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నట్లు భారత విదేశాంగ శాఖ ఒక ప్రకటన విడుదలచేసి చేతులు దులుపుకుంది. దీనికి బాధ్యులైన ఇజ్రాయిల్‌ను గానీ, ఇజ్రాయిల్ సైన్యాన్ని గానీ, వాటికి మద్దతునిస్తున్న అమెరికాను గానీ నిలదీయడానికి ఎందుకు భయపడుతున్నదో తెలియనిదికాదు. పలస్తీనియన్లను చంపేందుకు ఇజ్రాయిల్‌కు లైసెన్స్ ఇచ్చింది అమెరికాయేనన్న విషయం సర్వవిదితం. ఈ విషయాన్ని ఐక్యరాజ్యసమితికి చెందిన మూడు సంస్థలు ప్రపంచ ఆహార కార్యక్రమం (డబ్ల్యుఎఫ్‌పీ), మానవతా వ్యవహారాల సమన్వయ కార్యాలయం (ఓసీహెచ్ఏ), ఆహార, వ్యవసాయక సంస్థ (ఎఫ్ఏఓ) సైతం అమెరికాను దుమ్మెత్తిపోశాయి. ఇజ్రాయిల్-హమాస్ యుద్ధం కారణంగా గాజాలో పౌరుల పరిస్థితి దయనీయంగా మారింది. చిన్నారులు తీవ్ర పోషకాహారం లోపంతో బాధపడుతున్నారని ఐరాస ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఆహార కొరత ఏర్పడి రోజుల తరబడి పస్తులు ఉంటున్నారు. ఆకలికి తాళలేక పశువుల దాణానే ఆహారంగా తీసుకోవాల్సిన పరిస్థితి నెలకొనడం బాధాకరం. ఈ సంక్షోభాన్ని నివారించాలంటే రోజుకు 500 ఆహార ట్రక్కులు గాజాలోకి ప్రవేశించాల్సి ఉంటుంది. కానీ, జనవరిలో రోజుకు 150.. ఫిబ్రవరిలో 97 ట్రక్కులు మాత్రమే గాజాలోకి ప్రవేశించాయి. అరకొరగా వచ్చిన ట్రక్కులపై పౌరులు ఆకలితో ఎగబడటం వేదన కలిగిస్తోంది. అలా ట్రక్కులపై గుమిగూడిన జనాన్ని ఇజ్రాయిల్ 'మేడిన్ అమెరికా' తుపాకులు వికటాట్టహాసంతో విరుచుకుపడి రక్తపాతం సృష్టించడం హేయమైన చర్య.

ఆహార పొట్లాల కోసం అర్రులుజాస్తూ ట్రక్కు శబ్దం విన్పిస్తే చాలు..హాహాకారాలతో పౌరులు పరుగులు తీస్తున్న దృశ్యాలు కన్నీరు తెప్పిస్తున్నాయి. అమెరికా ప్రేరేపిత ఇజ్రాయిల్ దాడులు మొదలై ఐదారునెలలు గడుస్తున్నాయి. ఇజ్రాయిల్ మొండివైఖరి శాంతిప్రక్రియను ముందుకు సాగనీయడం లేదు. ఫలితంగా మారణహోమం కొనసాగుతోంది. ఐక్యరాజ్యసమితి భద్రతామండలికి అందిన నివేదిక ప్రకారం, 30,000 మందికిపైగా పలస్తీనియన్లు ప్రాణాలు కోల్పోయారు. గాజాలో మొత్తం 22 లక్షల మంది పలస్తీనియన్లకు గాను ఇప్పటికే దాదాపు 17 లక్షల మంది ఇతర ప్రాంతాలకు శరణార్థులుగా తరలి పోయారు. మిగిలిన 5 లక్షల మంది తీవ్ర దుర్భిక్షాన్ని ఎదుర్కొంటున్నారు. ఆరేళ్లలోపు పిల్లల్లో పౌష్టికాహారం లోపించి, బక్కచిక్కి డొక్కలతో రెండు రొట్టెముక్కల కోసం అలమటిస్తున్నారు. ఇజ్రాయిల్ విచక్షణారహిత దాడుల వల్ల యావత్ ప్రజా పంపిణీ వ్యవస్థ ధ్వంసమైపోయింది. ఆసుపత్రులు, ఐరాస సహాయక శిబిరాలపైనా క్షిపణులు పడుతున్నాయి. వైద్యారోగ్య రంగానికి చెందిన మౌలిక వసతులన్నీ దెబ్బతిన్నాయి. ఇంతజరిగినా, ఇజ్రాయిల్ దాడులు భేషుగ్గా ఉన్నాయని అమెరికన్ ప్రతినిధి రాబర్ట్‌వుడ్ చేసిన వ్యాఖ్యలు కంపరం పుట్టిస్తున్నాయి. ఐక్యరాజ్యసమితి సహాయక చర్యల సంస్థ (యూఎన్ఆర్‌డబ్ల్యుఏ)ను గాజాకు అనుమతించాలని చైనా, రష్యాతో సహా వివిధ ప్రపంచ దేశాలు చేసిన విన్నపాన్ని ఇజ్రాయిల్ తోసిపుచ్చి, నరమేధం సృష్టిస్తున్న తీరు గాజాను నరకప్రాయం చేసింది. చపాతీ కోసం చేయిచాచిన 112 మందిని ఇజ్రాయిల్ అమానుషంగా పొట్టనబెట్టుకున్న ఉదంతం ఆ దేశ కఠినత్వాన్ని, కర్కశత్వాన్ని మరోసారి ప్రపంచానికి పరిచయం చేసింది. చాలా దేశాలు ఇక్కడ చనిపోయిన వారి సంఖ్యనే చూస్తున్నాయి. నిజానికి ఈ దాడుల్లో లక్షలమంది క్షతగాత్రులై, కాళ్లుచేతులూ పోగొట్టుకొని జీవితంపై ఆశలు చేజారి, అవిటవాళ్లయ్యారు. వారి బాధలు మనకు ప్రత్యక్షంగా కన్పించని మరో కోణం. సగం అవయవాలు కోల్పోయి నేటికీ వేలాదిమంది బతుకీడుస్తున్న వైనం దిగ్భ్రాంతి కలిగిస్తోంది. గాయపడినవారికి కటికనేలపైనే వైద్యం చేయాల్సిన దౌర్భాగ్య స్థితి నెలకొన్నది. రష్యా, చైనా, సౌదీ అరేబియా, టర్కీ కొలంబియా, స్పెయిన్, ఇటలీ, ఫ్రాన్స్, యూరోపియన్ యూనియన్‌లోని ఇంకొన్ని దేశాలు ఇజ్రాయిల్ మారణహోమాన్ని ఖండిస్తున్నా, భారత ప్రభుత్వం నోరుమెదపకపోవడం శోచనీయం. ఆకలితో అల్లాడుతున్న గాజావాసులను ఆదుకుంటామని, విమానాల ద్వారా ఆహార ప్యాకెట్లను గాజాలోకి జారవిడుస్తామని అమెరికా అధ్యక్షుడు బైడెన్ తాజాగా మీడియాకు వెల్లడించి, విస్మయం కలిగించారు. ఇది కంటితుడుపు చర్యేనని తెలుసు. మధ్యప్రాచ్యంలో తరచూ రక్తపుటేరులు పారిస్తున్న అమెరికా ఇప్పుడు సాయం పేరుతో ఎముకలేని చేయిని ప్రపంచానికి చూపించాలని ప్రయత్నించడం అసహజమేమీ కాదు. మానవతా సాయం ఫలాలు అందరికీ అందాలంటే గాజా-ఈజిప్ట్ సరిహద్దులోని రఫా చెక్‌పోస్టు తెరుచుకుంటేనే అది జరుగుతుందని.. లేదంటే ఈ చర్య అంతగా ప్రభావం చూపకపోవచ్చని మరొక అమెరికన్ అధికారి మెలికపెట్టారు. ఏదేమైనప్పటికీ, మధ్యప్రాచ్యంలో శాంతిగీతిక ఆలపించాల్సిన సమయం ఆసన్నమైంది. ఈ క్లిష్ట పరిస్థితుల్లో గాజాకు మానవతా సాయం ఎంతో అవసరం. జోర్డాన్, ఫ్రాన్స్ సహా ఇతర దేశాలు ఇప్పటికే గాజాలోకి ఆహార పొట్లాలను జారవిడిచాయి. అనేక దేశాలు కోరుతున్నట్లుగా ఊచకోత ఘటనపై విచారణ జరిపించి, ఘోరమైన అంతర్జాతీయ నేరానికి పాల్పడిన ఇజ్రాయిల్‌ను బోనులో నిలబెట్టాలి. అమెరికాకు మోకరిల్లడం మానేసి భారత ప్రభుత్వం కూడా గాజాకు చేయూతనివ్వాలి. ఇజ్రాయిల్ యుద్ధంపై అమెరికాకు వంతపాడే వైఖరిని మోదీ సర్కారు విడనాడాలి. దక్షిణాఫ్రికా, బ్రెజిల్, అరబ్ వంటి దేశాలతో సమన్వయం చేసుకొని గాజాలో తక్షణ, శాశ్వత కాల్పుల విరమణ కోసం తగు యత్నాలు చేపట్టాల్సిన సమయమిది.

మోదీ నీతిబాహ్య రాజకీయాలు!

కుట్రలు, కుతంత్రాలు, డబ్బు సంచులు, వేధింపులతో ప్రజాస్వామ్యాన్ని హననం చేసి, దేశంలో వున్న రాష్ట్ర ప్రభుత్వాలను కూల్చడం, తమకు మద్దతు ఇచ్చే విధంగా బీజేపీ నీతి బాహ్య రాజకీయాలు చేస్తోంది. ప్రజాస్వామ్యంలో ఎవరైనా ప్రజల వద్దకు వెళ్లి వారి మద్దతు పొంది అధికారంలోకి రావడం సహజం. కానీ అందుకు భిన్నంగా రాజకీయ ప్రత్యర్థులను భయపెట్టి తమ పంచన చేరేలా చేయడం, లొంగకపోతే అణచివేసేందుకు దర్యాప్తు సంస్థలను ప్రయోగించడం, జైలులో పెట్టడం బీజేపీ పాలనలో అలవాటుగా మారింది. తమకు మద్దతు ఇచ్చిన వారు లక్షల కోట్లు దోచుకున్నా, విదేశాలకు పారిపోయినా వారి జోలికి వెళ్లరు. క్రిమినల్ నేరాలకు పాల్పడినవారి జోలికి వెళ్లని దర్యాప్తు సంస్థలు ముఖ్యమంత్రిగా ఉన్న హేమంత్ సోరేన్‌ను వెంటాడి వేధించారు. హేమంత్ సోరేన్ కన్నా తీవ్రమైన నేరాలున్న నేతలే బీజేపీ పెద్దల ఆశీస్సులతో అస్సాం సహా వివిధ రాష్ట్రాల్లో రాజ్యమేలుతున్నారు. ఎవరు నేరంచేసినా శిక్షించాల్సిందే, కానీ ప్రధాని మోదీ హయాంలో దర్యాప్తు సంస్థల తీరు దారుణంగా ఉంది. ప్రివెన్షన్ ఆఫ్ మనీలాండరింగ్ యాక్ట్ కింద ఈడి 5,500 కేసులు నమోదుచేస్తే నేరారోపణ రేటు 23 శాతమే. వాటిలో 25 కోర్టులో ఉన్నాయి. వారిలో రాజకీయ నేతలెవరూ లేరు. ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో మంత్రులను జైలులో పెట్టడం, సీఎంకు సమన్లు పంపడం, బీజేపీలో చేరాలంటూ ఒత్తిడి చేశారని, ఎమ్మెల్యేల కొనుగోలుకు కుట్ర పన్నారని కేజ్రీవాల్ ఆరోపణలు కేంద్రం వేధింపులను తేటతెల్లం చేస్తున్నాయి. పార్టీలను చీల్చడం, సీఎంలను మార్చడం, వీలైతే సీఎం కుర్చీలో కూర్చోవడం, లేకపోతే రిమోట్ ప్రభుత్వాలను నడపడం, దర్యాప్తు సంస్థలతో దాడులు చేయించడం, అక్రమ కేసులు పెట్టడం రివాజుగా మారింది.

ఆర్థిక నేరాల కేసులను సత్వర విచారణ జరిపి ఏడాదిలోగా తీర్పు వెలువరించాలని కోరతానని 2014 ఎన్నికల ప్రచార సభల్లో చెప్పిన మోదీ అందుకు తీసుకున్న చర్యలు మాత్రం లేవు. తండ్రి అధికారాన్ని అడ్డం పెట్టుకొని పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడిన కేసుల్లో 16 నెలలు పాటు జైలు ఊచలు లెక్కించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి బెయిల్ వచ్చి 11 ఏళ్లు అవుతుంది. జగన్‌పై సీబీఐ నమోదు చేసిన కేసులు ఇంత వరకు 3045 సార్లు వాయిదా పడ్డాయి. తీవ్రమైన అభియోగాలు మోపారు. అవి రుజువు అయితే ఏడేళ్లు, వాన్ పిక్ కేసుల్లో అయితే యావజ్జీవ కారాగార శిక్షపడే అవకాశం వున్నా నేర, న్యాయ వ్యవస్థను వెక్కిరిస్తూ అధికారం చెలాయించడం బహుశ భూ మండలంలో సాధ్యపడని విడ్డూరం. ఎంతటి శక్తి మంతులైనా అవినీతిపరుల్ని అంత తేలిగ్గా వదిలి పెట్టవద్దని ఆ మధ్య సివీసీ (కేంద్ర విజిలెన్స్ కమిషన్) ఏర్పాటు చేసిన నిఘా అవగాహన వారోత్సవాల్లో ప్రధాని మోదీ పిలుపు ఇచ్చారు.

2014 ఎన్నికల్లో మీకు స్వర్ణాంధ్రా కావాలా, స్కామాంధ్రా కావాలా అంటూ ఆంధ్రప్రదేశ్ ప్రజల్ని ప్రశ్నించిన నరేంద్ర మోదీ నేడు దేశంలో అత్యంత ఆర్థిక నేరస్థుడు జగన్‌పై వున్న కేసులు ఏళ్ల తరబడి విచారణ ఎందుకు కొనసాగుతున్నాయో, వీరికి కేంద్రం ఎందుకు అండగా నిలుస్తున్నదో ప్రజలకు సమాధానం చెప్పగలరా? ఆర్థిక నేరగాళ్ల బారినపడి భారతదేశం పెద్ద ఎత్తున దోపిడీకి గురైందన్న మోదీ అధికారంలోకి వచ్చి అవినీతికి పాల్పడి, జాతి సంపదను దోచుకున్న వారిపై తీసుకొన్న చర్యలేమిటి? అవినీతిపరుల కేసులను ఫాస్ట్ ట్రాక్ కోర్టులను పెట్టి ఏడాదిలోపు విచారణ పూర్తి చేయించి అవినీతి పరులు చట్టసభలో వుండాలో, జైళ్లలో ఉండాలో తేలుస్తామని హామీ ఇచ్చి పదేళ్లు అవుతుంది. సీబీఐ ప్రాథమిక విచారణలో నిగ్గుతేల్చిన రూ.43 వేల దోపిడీ కేసులో పదేళ్లుగా కేవలం బెయిల్‌పై వున్న వ్యక్తి అయిదేళ్లుగా వాయిదాలకు కోర్టులకు వెళ్లకుండా తప్పించుకు తిరుగుతూ రాష్ట్రాన్ని పాలిస్తుంటే కేంద్రం, దర్యాప్తు సంస్థలు చోద్యం చూస్తున్నాయి. జేబు దొంగల్ని జైల్లో పెట్టే చట్టాలు వున్నాయి. కానీ దేశాన్ని, రాష్ట్రాన్ని దోచుకున్న వారిపై మాత్రం చర్యలుండవు. లక్షలాది మంది అమాయకులు జైళ్లలో విచారణ ఖైదీలుగా మగ్గుతుంటే వేలకోట్ల ప్రజాధనం దోచుకున్న ఆర్థిక నేరగాళ్లు నీతులు వల్లిస్తూ శాసన నిర్మాతలుగా వెలిగిపోతున్నారు.

ఆర్థిక నేరగాడుగా పేరు మోసిన, వివిధ కేసుల్లో నిందితుడుగా న్యాయస్థానాల చుట్టూ తిరిగిన జగన్ పరిపాలకుడుగా, ప్రజాధనానికి రక్షకులుగా బాధ్యతలు నిర్వర్తించడం భారతావనిలోనే సాధ్యం. ఆర్థిక నేరస్థుల అంతుచూడటం ఏమో కానీ మోదీ పాలనలో ఆర్థిక నేరస్థులు అపూర్వ వైభవంతో వెలిగిపోతున్నారు. చట్టం ముందు అందరూ సమానమే అని చెప్పుకోవడానికే తప్ప ఆచరణలో ఎక్కడ అమలు అవుతోంది? న్యాయస్థానాల ఆదేశాల మేరకు విచారణ జరుగుతున్న కేసుల్లో కూడా సత్వరం దోషులకు శిక్షలు పడతాయనుకునే వీలులేకుండా పోయింది. ప్రభుత్వ సహకారంతో వేలకోట్ల ప్రజాధనాన్ని లూటీ చేసిన వారిపై విచారణ జరిగే తీరు ఇదేనా? ఇంతటి తీవ్రమైన కేసుల విచారణలో మరో సామాన్యుడు వుంటే కేసు విచారణ ఇలానే సాగేదా ? వేలకోట్ల ప్రజాధనం దోపిడీ చేసిన జగన్ పట్ల కేంద్రప్రభుత్వం, సీబీఐ ఉదాసీనంగా వ్యవహరించడంలో ఆంతర్యం ఏమిటి? ఆర్థిక నేరస్థులను సహించేది లేదన్న మోదీ విస్పష్ట హెచ్చరిక పసలేనిదిగా మిగిలిపోయింది.

నీరుకొండ ప్రసాద్
ఫోన్:9849625610

అంతిమ లక్ష్యం ఫాసిస్టు శక్తులను ఓడించడమే

ఒక వేపు ఇండియా కూటమిలో భాగస్వామ్య పక్షాలైన కాంగ్రెస్ కు ఆమ్ ఆద్మీ పార్టీకి, ఉత్తరప్రదేశ్ లో సమాజ్‌వాదీ పార్టీకి కాంగ్రెస్‌కు మధ్య సీట్ల సర్దుబాటు జరుగుతుండగా మరో వేపు ఇండియా భాగస్వామ్య పక్షాలే పరస్పరం పోటీ పడే పరిస్థితులు కొన్ని చోట్ల కనిపిస్తున్నాయి. రాహుల్ గాంధీ ప్రాతినిధ్యం వహిస్తున్న కేరళలోని వాయనాడ్ నియోజకవర్గం నుంచే సీపీఐ అభ్యర్థిగా అనీ రాజా పోటీ చేయాలని నిర్ణయించుకున్నారు. కాంగ్రెస్ ఇంకా తమ అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది. రాహుల్ గాంధీ వాయనాడ్ నుంచి పోటీ చేయడాన్ని ఉభయ కమ్యూనిస్టు పార్టీలు ఇదివరకే అభ్యంతర పెట్టాయి. దీనివల్ల బీజేపీని ఎదిరించడంలో ఇబ్బందులు ఎదురవుతాయని కమ్యూనిస్టు పార్టీలు భావిస్తున్నాయి.

బీజేపీతో పోరాడాలో, ఇండియా భాగస్వామ్యపక్షాలైన కమ్యూనిస్టులతో పోరాడాలో కాంగ్రెస్ నిర్ణయించుకోవాలని అనీ రాజా "ది వైర్" కు ఇచ్చిన ఇంటర్వ్యూలో అభిప్రాయ పడ్డారు. కాంగ్రెస్ ఈ విషయాన్ని అర్థం చేసుకుంటుందన్న ఆశాభావాన్ని ఆమె వ్యక్తం చేశారు. "వాయనాడ్ నుంచి పోటీ చేయాలో లేదో కాంగ్రెసే నిర్ణయించుకోవాలి. అది వారి విశిష్టాధికారం. కాంగ్రెస్ ఒక స్వతంత్ర పార్టీ. మాదీ ఒక స్వతంత్ర పార్టీ అని ఆమె చెప్పారు. మేం మా అభ్యర్థులను ప్రకటించాం. ఫాసిస్టు శక్తులను ఎదిరించాలంటే మేం ముందు పీఠిన ఉండి పోరాడాలి అని ఆమె అన్నారు. కేంద్రంలో మిత్ర పక్షాలు కావాలో లేదో, లేదా కేరళలో మిత్ర పక్షాలతోనే పోరాడుతారో కాంగ్రెస్ నిర్ణయించుకోవాలని ఆమె అన్నారు. ఫాసిస్టులను ఓడించడానికి కాంగ్రెస్ ఇతరులను పోటీ చేయనిస్తుందా లేదా తమ అగ్ర నాయకులను తీసుకొచ్చి పోటీ పెట్టుందో నిర్ధారించుకోవాలన్నారు. అనీ రాజా నాలుగు దశాబ్దాల నుంచి పార్టీ కార్యకలాపాల్లో నిమగ్నమై ఉన్నారు. ప్రస్తుతం ఆమె భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యు) జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. ఆమె ఎన్నికలలో పోటీ చేయడం ఇదే మొదటి సారి. ఇండియా ఐక్య సంఘటన సామరస్యంగా సీట్లు సర్దుబాటు చేసుకోగలిగితే సానుకూలమైన ఫలితాలు వస్తాయని ఆమె చెప్పారు. ఆమెతో ఇంటర్వ్యూలోని ప్రధానాంశాలు:

వాయనాడ్ నుంచి పోటీ ద్వారా మీరు మొదటి సారి ఎన్నికల బరిలోకి దిగుతున్నారు. ఈ కొత్త పాత్ర ఎలా ఉంటుంది? మీ బాధ్యతలు ఎలా ఉంటాయి.

గత 40-45 సంవత్సరాల నుంచి పార్టీ నాకు సంస్థాగత బాధ్యతలు అప్పగించింది. దేశంలోని మహిళలను సంఘటితం చేయమని చెప్పింది. ఇప్పుడు కొత్త బాధ్యత అప్పగించింది. క్రమశిక్షణ గల కార్యకర్తగా ఈ బాధ్యతా నిర్వర్తిస్తాను. ఇది నేను చేసిన పనికి ఓ గుర్తింపు. కేరళలో మహిళా నాయకులు చాలా మందే ఉన్నారు. కానీ పార్టీ నన్ను ఎంపిక చేసింది. ఇది నాకు గర్వ కారణం.

రాహుల్ గాంధీ వాయనాడ్ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. సీపీఐ, సీపీఐఎం కాంగ్రెస్‌తో పాటు ఇండియా ఐక్య సంఘటనలో భాగస్వామ్య పక్షాలుగా ఉన్నాయి. మీ పార్టీ మొదట అభ్యర్థులను ప్రకటించింది. అంటే రాహుల్ గాంధీని మరో నియోజకవర్గం చూసుకోవాలన్న సందేశమా ఇది?

దేశంలో పరిస్థితి చాలా భయంకరంగా ఉంది. తీవ్రమైన సవాళ్లు ఎదురవుతున్నాయి. బీజేపీ-ఆర్.ఎస్.ఎస్. నాయకత్వంలోని ఫాసిస్టు శక్తులు ప్రజాస్వామ్య మూల స్తంభాలన్నింటినీ బలహీన పరుస్తున్నాయి. పరిస్థితి ఎలా మారుతుందో తెలియదు. ఈ దేశ లక్షణాలనే మార్చేస్తున్నారు. మళ్లీ ఎన్నికలు జరుగుతాయో లేదో తెలియదు. ఇలాంటి స్థితిలో దేశంలో ప్రజాస్వామ్యాన్ని, సెక్యులరిజాన్ని పరిరక్షించడానికి కంకణబద్ధమైన పార్టీలన్నీ ఏకం కావడానికి ప్రయత్నించాలి.

కేరళలో పోటీ ఎప్పుడూ ఎల్.డి.ఎఫ్.కు, యు.డి.ఎఫ్.కు మధ్య ఉంది. 2019 ఎన్నికలలో రాహుల్ గాంధీ సీపీఐ అభ్యర్థిని ఓడించారు. అంటే కాంగ్రెస్ పార్టీ ఏం కోరుకుంటోంది? ఫాసిస్టు శక్తులను నిరోధించడానికి మరిన్ని మిత్ర పక్షాలు కావాలనుకుంటోందా? లేక కమ్యూనిస్టులను ఓడించాలనుకుంటోందా? ఈ ప్రశ్నకు జవాబు చెప్పాల్సింది కాంగ్రెసే.

ఒక సీటు ఇక్కడ, మరో సీటు మరోచోట వస్తే మాకు పెద్దగా ఒరిగేదేమీ లేదు. మా స్థాయిలో మేం పోరాడడానికి శక్తి మేరకు పోరాడతాం. ఎంతటి త్యాగానికైనా వెనుకాడం. మమ్మల్ని ఎవరూ కొనలేరు. ఎవరూ కేంద్ర దర్యాప్తు సంస్థలను ప్రయోగించి బెదిరించలేరు. ఇదే వామపక్ష సిద్ధాంత బలిమి. కేంద్ర స్థాయిలో ఇలాంటి మిత్ర పక్షాలు కావాలో లేక వామపక్ష శక్తులను ఓడిస్తారో ఆ పార్టీయే నిర్ణయించుకోవాలి. హిమాచల్ ప్రదేశ్ లో ఏం జరుగుతోందో చూడండి. ఇలాంటి విషయాలను పట్టించుకోవాలి తప్ప వామపక్ష శక్తులను ఓడించడం మీద దృష్టి పెట్టడం కాదు.

రాహుల్ గాంధీ వాయనాడ్ నుంచి పోటీ చేయకూడదని, దీనివల్ల బీజేపీ వ్యతిరేక పోరాటం బలహీన పడుతుందని ఇంతకు ముందే సీపీఐ, సీపీఎం చెప్పాయి. అప్పుడే రాహుల్ గాంధీ వాయనాడ్ నుంచి కాకుండా మరో చోటినుంచి పోటీ చేసి ఉండాల్సిందా?

ఈ విషయం తేల్చుకోవాల్సింది కాంగ్రెసే. వారిది ఒక స్వతంత్ర పార్టీ. మాది మరో స్వతంత్ర పార్టీ. మేం మా అభ్యర్థులను ప్రకటించాం. ఫాసిస్టు శక్తులను ఎదిరించడానికి ముందుంటాం. నిర్ణయించుకోవలసింది కాంగ్రెసే.

ఇండియా ఐక్య సంఘటనలో నుంచే బహుళ అభ్యర్థులు ఉంటే ఇది ఇండియా ఐక్య సంఘటన సమైక్యతను దెబ్బ తీయదా! దీనివల్ల అసంతృప్తి పెరుగుతుంది కదా?

ఇండియా ఐక్య సంఘటన ఏర్పడుతున్నప్పుడు, దీని గురించి సంవాదాలు, చర్చలు జరుగుతున్నప్పుడు రెండు విషయాలు స్పష్టంగా ఉండాలనుకున్నాం. మొదటిది రాష్ట్ర స్థాయిలో ఉన్న పరిస్థితిని బట్టి ఈ ఐక్య సంఘటన ఏర్పాడాలి. రెండోది, కేరళలో ఎల్.డి.ఎఫ్., యు.డి.ఎఫ్. రెండూ పోటీ పడతాయి అని ముందు నుంచీ అనుకున్నారు. ముందు నుంచి ఇది స్పష్టంగానే ఉంది. అలాంటప్పుడు కేరళలో ఇతరులను పోటీ చేయనిస్తారో లేక తమ పార్టీ అగ్ర నాయకులను దిగుమతి చేస్తారో కాంగ్రెసే తేల్చుకోవాలి.

ఇండియా ఐక్య సంఘటనలో సీట్ల సర్దుబాటులో అవాంతరాలు ఎదురవుతున్నయి. బీహార్ లో జె.డి. (యు) ఐక్య సంఘటనలోంచి వెళ్లి పోయింది. బెంగాల్ లో తృణమూల్ పార్టీ కాంగ్రెస్ తో సర్దుబాట్లు చేసుకోకుండా ఒంటరిగా పోటీ చేయాలని నిర్ణయించుకుంది. పంజాబ్‌లో కాంగ్రెస్‌తో సర్దుబాట్లకు ఆమ్‌ఆద్మీ పార్టీ సిద్ధంగా లేదు. కేరళలో కూడా అలాంటి పరిస్థితే ఉండబోతోందా?

ఇవన్నీ స్వతంత్రమైన పార్టీలు. ఏ పార్టీ సిద్ధాంతాలు వాటికున్నాయి. వివిధ అంశలు, సమస్యలపై ఏ పార్టీకి ఉండే అభిప్రాయాలు వాటికి ఉన్నాయి. కొన్ని అంశాలలో భిన్నమైన ఆలోచనా ధోరణి ఉండొచ్చు. చర్చలు, సంవాదాలు, సంభాషణల ద్వారా వీటిని పరిష్కరించుకోవచ్చు. ఇప్పుడు జరుగుతున్నది అదే. ఇంతకు ముందు ఇండియా భాగస్వామ్య పక్షాల మధ్య ఐక్యత సాధ్యం కాదనుకునే వారు. అది ఇప్పుడు గత చరిత్ర. ఇప్పుడు పొత్తులు ఏర్పడుతున్నాయి. రానున్న రోజుల్లో సామరస్యంగా వివాదాలు పరిష్కారం అవుతాయనుకుంటున్నాం.

వచ్చే ఎన్నికలలో ఇండియా ఐక్య సంఘటన అవకాశాలు ఎలా ఉంటాయనుకుంటున్నారు?

ప్రజలకు నచ్చ చెప్పగలం అనుకుంటున్నాం. మోదీ ప్రభుత్వం చెప్తున్న దానికీ, వాస్తవ పరిస్థితికి పోలికే లేదు. అభివృద్ధి, ఆర్థిక పురోగతి పేరుతో ప్రజల్ను మోసగిస్తున్నారు. కుల అంతరువులు లేవని ప్రధాని మోదీ అంటున్నారు. ఆ రకంగా కుల వివక్షను చాప కింద తోసేయాలనుకుంటున్నారు. ఉన్నది మహిళలు, యువత, రైతులు అనే కులాలేనంటున్నారు. వారు అడుగుతున్నది చిన్న కోరిక. కానీ రైతుల విషయంలో ఏం చేస్తున్నారో చూడండి. ప్రభుత్వం తాను ఇచ్చిన వాగ్దానానికి కట్టుబడి ఉండడం లేదు. కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించే ఉద్దేశమే ఈ ప్రభుత్వానికి లేదు. మోదీ యువశక్తి గురించి మాట్లాడుతారు. కానీ ఉపాధి సంగతేమిటి? తమ సామాజిక మాధ్యమాల కోసం వేలు, లక్షల మందిని నియమిస్తున్నారు. మరి ప్రభుత్వోద్యోగాల మాటేమిటి? అన్ని ప్రభుత్వ రంగ వ్యవస్థలను ప్రైవేటీకరిస్తున్నారు. దళితులు, గిరిజనులు ప్రభుత్వ రంగంలోకి అడుగు పెట్టే అవకాశాలు సన్నగిల్లేట్టు చేస్తున్నారు. ఇవన్నీ వాస్తవాలే. ఈ వాస్తవం చెప్పడానికి ఇండియా ఐక్య సంఘటన పక్షాలు ప్రజల దగ్గరకు వెళ్తే ప్రజలు తమ బాధలూ చెప్పుకుంటారు.

సామరస్యపూర్వకంగా సర్దుబాట్లు కుదిరితే మేం ప్రజల దగ్గరకు వెళ్తే తప్పకుండా ఫలితాలు మాకు అనుకూలంగా ఉంటాయనుకుంటున్నాం అని అనీ రాజా ఆ ఇంటర్వ్యూలో చెప్పారు.

ప్రజాకోర్టులో నిలబడాల్సిన ప్రభుత్వం

డాక్టర్ దేవరాజు మహారాజు

మాజీ ఈజిప్టు అధ్యక్షుడు అన్వర్ సాదత్‌ను ఎందుకు చంపావని అడిగాడు జడ్జి హంతకుణ్ణి.
అతను సెక్యులర్-అని అన్నాడు హంతకుడు
సెక్యులర్ అంటే ఏమిటీ - అడిగాడు జడ్జి
ఏమో! నాకు తెలియదు- అన్నాడు హంతకుడు.

మన భారతదేశంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వ సమాధానం కూడా ఇలాగే ఉంటుంది. వారికి సెక్యులర్ అంటే అర్థంకాదు. కానీ, ఎవరైనా ఆ మాట ఉచ్ఛరిస్తే చాలు వారిపైకి ఈడీ, సీబీఐ, ఎన్ఐఏ వంటి ప్రభుత్వ సంస్థలన్నింటినీ ఉసిగొల్పుతుంది. దేశవ్యాప్తంగా లెక్కలేనంత మందిపై ఎంక్వయిరీలు వేశారు...కదా? వేస్తున్నారు..కదా; కొండను తవ్వి ఎలకను కూడా పట్టలేదే? ప్రజాసంక్షేమ ప్రభుత్వం కావాలనుకుంటే, ఇదేమిటీ? ప్రజాసంక్షోభ ప్రభుత్వం దాపురించిందీ - అనిప్రజలు వాపోతున్నారు. ఈజిప్టు రచయిత నగిబ్ మహపౌజ్‌ను కత్తితో పొడిచి చంపిన కేసులో జడ్జి హంతకుణ్ణి అడిగాడు. నగిబ్ మహపౌజ్‌ను కత్తితో పొడిచి, ఎందుకు చంపావ్? అతను 'ద చిల్డ్రన్ ఆఫ్ అవర్ నైబర్ హుడ్' అని రాసాడు కాబట్టి చంపాను. ఓ నువ్వా నవల చదివావా? జడ్జి అడిగాడు. లేదు- అన్నాడు హంతకుడు.ఇదికూడా అధికారంలో ఉన్న భారత ప్రభుత్వానికి సరిపోతుంది. ఆరో తరగతి కూడా చదవని ఆర్ఎస్ఎస్ మేధావి ప్రభుత్వాధినేత అయితే, రచయితల్ని, జర్నలిస్టులని, సనాతన ధర్మసంస్థ ద్వారా చంపించడం ఒక్కటే మార్గం అని అనుకుంటాడు. గౌరీ లంకేశ్, కల్బుర్గీ, పన్సారే, డా.దభోల్కర్‌లే కాదు...వరవరరావు, ప్రొ.సాయిబాబా వగైరా వగైరా ఎంతమంది పేర్లయినా చెప్పుకోవచ్చు. వీరు ప్రభుత్వాన్ని పడగొట్టే పనులు చేశారా? జన చైతన్యానికి రచనలు చేసేవారిని ప్రధాని హత్యకు పథకాలు రచించారని జైల్లో వేస్తారా? లేదా చంపిస్తారా? గుజరాత్, మణిపూర్ మారణకాండలు జరిపించడం మీకింకా చాలలేదా? ఏమైతేనేం చరిత్రలో నిలిచిపోయే పనులే చేశారు సామీ! ఖాళీ మెదళ్లే లొడలొడమని ఎక్కువ శబ్దం చేస్తాయి మిత్రోం-ఈజిప్టు రచయిత ఫరాజ్‌ఫరాను చంపిన మరో హంతకుణ్ణి జడ్జి ఇలా ప్రశ్నించారు.

ఫరాజ్‌ను ఎందుకు హత్య చేశావ్?
ఎందుకంటే, అతను నమ్మకద్రోహి-అన్నాడు హంతకుడు
అతను నమ్మకద్రోహి అని నీకు ఎలా తెలుసూ? జడ్జి
అతను రాసిన పుస్తకాల వల్ల! హంతకుడన్నాడు.
అయితే, అతను రాసిన పుస్తకాలు ఏవేవీ చదివావూ-జడ్జి
నేనేదీ చదవలేదు-అన్నాడు హంతకుడు
ఏం? ఎందుకు? జడ్జి అడిగాడు.
ఎందుకంటే, నాకు చదవడం, రాయడం రాదు!

రచయిత అరుంధతీరాయ్‌ని కూడా ఈ ప్రభుత్వం వదిలిపెట్టలేదు. పుస్తకాలు చదివే అలవాటే ఉంటే, ఈ దేశ పాలకులు ఇంత మూర్ఖంగా ఎందుకు ప్రవర్తిస్తారూ? దేశ నాయకుడే కాదు, ఆయన అనుచరగణంలోని ఎవ్వరైనా సరే, అరుంధతీ రాయ్ రచనలో ఒక పేజీ చదివి అర్థం చెప్పగలిగితే ఈ దేశ ప్రజలు తమ చెప్పులతో తామే కొట్టుకుంటారు. చెప్పలేకపోతే దేశ ప్రజల చెప్పు దెబ్బలు

ఎవరికి తగలాలీ? జ్ఞానం వల్ల విద్వేషం ఎప్పుడూ ప్రచారం కాదు. అది అజ్ఞానం వల్ల, మూర్ఖత్వం వల్లనే ప్రచారమవుతుంది. పైన హంతకులు చెప్పిన సమాధానాల వల్ల మనకు ఈ విషయం రూఢిగా తెలుస్తూ ఉంది. తెల్లజుట్టూ, తెల్లగడ్డం ఉన్నవాళ్లను చూసి వాళ్లేదో పెద్దలని అనవసరంగా, అర్హతలేని గౌరవం ఇవ్వగూడదని ధమ్మపథం చెప్పింది. "తల నెరిసినంత మాత్రాన ఎవరూ పెద్దలు కారు. వారు జీవితాన్ని వ్యర్థంగా గడిపేసిన వృద్ధులు మాత్రమే! సత్య ధర్మాలూ, అహింస, ఆత్మనిగ్రహం, ఇంద్రియ నిగ్రహం ఎవరిలో నెలవై ఉంటాయో, మాలిన్యాలను విసర్జించి నిర్మలుడై నిలిచిన వాడే పెద్ద" -ధమ్మపథం(కలాను సుత్త-అంగుత్తర నికాయలో (వాల్యూమ్ 188-193)మీరు విన్నవన్నీ నమ్మకండి అని కూడా అన్నాడు బుద్ధుడు. సనాతనధర్మం పేరు చెప్పి డబ్బులు దండుకుంటున్న 'శివశక్తి' ముఠా ఈ మధ్య బైటపడింది. "సనాతన ధర్మ సంస్థాపనార్థాయ! పాశాండ మత నిర్మూలనార్థాయ" అంటూ 2029 సెప్టెంబరులో వార్షికనిధి పేరుతో కొందరు జనం వెంటపడ్డారు. శివాజీ బొమ్మ చూపి ఓ దొంగబాబా మహారాష్ట్రలో విరాళాలు సేకరించాడు. అందుకే ప్రతిదాన్ని పరీక్షించడం, నిజాల నిగ్గుతేల్చుకోవడం ప్రజలు అలవర్చుకోవాలి. ఎవరి మాటలకో ప్రభావితులై డబ్బులు వదిలించుకోవడంగానీ, ఓట్లేయడం గానీ, అమ్ముడు పోవడం గానీ చేయగూడదు. దేవీ నవరాత్రుల సమయంలో ఒకాయన దేవీస్తోత్రం రాసి, చిన్న పుస్తకం ప్రచురించాడట. దాని ధర ఇరవై రూపాయలట. కానీ, ఐదు వందల రూపాయలు ఫోన్ పే మీద విరాళం పంపితే ఆ దేవీ ఆశీర్వాదంతో, కవిగారి అభినందనలతో పుస్తకం పంపిస్తారట! వెంటనే డబ్బులు పంపాలని శుభాకాంక్షలతో అందరికీ మెసేజెస్ పంపి, దాబుగా బిచ్చమెత్తాడు. మనుషుల్ని మోసం చేయడానికి, బోల్తా కొట్టించడానికి కొత్తకొత్త పద్ధతులు కనిపెడు తున్నారు. వినాయకుడు పేరుతో విరాళాలు, శివశక్తి పేరుతో విరాళాలు, దేవీ నవరాత్రుల పేరుతో విరాళాలు. సిగ్గూ, శరమూ, ఆత్మాభిమానం, వదిలేస్తే డబ్బులు సంపాదించుకోవడానికి మార్గాలు సులభమౌతాయి. బతికినంతకాలం ధన్ ధన్ (హిందీలో ధనం) అని ఎంతగా అంగలార్చినా, కన్ను మూయగానే 'నిధన్' (మరణించారు) అనే ప్రకటిస్తారు. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఏం చేసిందీ? కూలినాలి చేసుకునేవారితో కూడా బ్యాంక్ ఎకౌంట్‌లు తెరిపించింది. వారికి జరిగిన మేలేమిటి? ఆ డబ్బంతా తీసుకుపోయి కార్పొరేట్లకు మేలు చేశారే తప్ప, సామాన్యులకు ఒనగూరిన మేలేమీ లేదు. కార్పొరేట్లకు పెద్దమొత్తంలో అప్పులు రద్దు చేశారు తప్పిస్తే, పేదలకు, మధ్యతరగతి వారి అప్పులేమైనా రద్దుచేశారా? హిందువులు, హిందువులనీ ఈ దేశం హిందువులదనీ ఈ ప్రభుత్వం డప్పుకొట్టుకుంటోంది కదా? అసలు ఈ దేశంలో హిందువులకు జరిగిన మేలేమిటో ఆలోచించి ఒక్కటి గుర్తుచేసుకోండి చూద్దాం! హిందువులంతా బంధువులే కదా? ఇల్లు అద్దెకు కావాలని ఎవరైనా వెళ్లి అడిగితే వారి కులం, గోత్రం, పూర్వా పరాలు అడిగిఅడిగి హింసిస్తారెందుకూ? ఈ ప్రధాని నోట్లు రద్దుచేసినప్పుడు బ్యాంకుల ముందు క్యూలల్లో హిందువులు చావకుండా ఉన్నారా? విదేశాల నుండి నల్లడబ్బు తెప్పించి దేశంలోని ప్రతి పౌరుడి ఖాతాలో పదిహేను లక్షలు వేస్తానన్నఈ దేశ ప్రధాని, కనీసం హిందువుల ఖాతాల్లోన్నయినా వేయాలి కదా? ఏవీ మరీ? ఎవరికీ ఏ ఉపయోగం జరగనప్పుడు హిందూ అనే పదం మాటిమాటికీ వల్లెవేయడం ఎందుకూ? ఒకప్పుడు పారసీ డిక్షనరీలలో వాళ్లు రాసుకున్నదాన్నే నేటి పాలకులు నిజంచేసి చూపుతున్నట్లుగా ఉంది! హిందూ మతం మీద మా వివేకానందుడు అమెరికాలో గొప్పగా ఉపన్యసించి వచ్చాడని చెప్పుకుంటారుకదా? మరి ఆయనే ఆనాటి దేశపరిస్థితిని చూసి ఏమన్నాడో చూడండి-" అస్పృశ్యులనబడే ప్రజలను ఈనాటి అధ్వాన్నస్థితికి దిగజార్చిన వారెవరూ? ఎవరు దీనికి బాధ్యులు? దీనికి ఆంగ్లేయులు మాత్రం బాధ్యులు కారు. అనేక పారమార్థిక, వ్యవహారిక సిద్ధాంతాలను కనిపెట్టిన హిందూమతంలోని కుటిలులే ఇందుకు కారకులు" అన్న స్వామి వివేకానంద 'దేశాన్ని పునర్నిర్మించండి' అని పిలుపునిచ్చాడు (స్వామి వివేకానంద పేజీ:16 రామకృష్ణ మఠం ప్రచురణ) అంతేకాదు సైన్స్‌లాగా మతాలు కూడా మారుతూ ఉండాలని కూడా చెప్పాడు. ఈ దొంగ రాజకీయ మతపెద్దలు ఇలాంటి విషయాలు బైటకు రానీయరు. చదువులేని అజ్ఞానులు కొంతమంది, చదువుకున్న మూర్ఖులు మరికొంతమంది కలిసి నడుపుతున్న ఈ ప్రభుత్వంలోని 'పెద్దలు' 1916లో బనారస్‌లోని సెంట్రల్ హిందూ కాలేజి, బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ కలిసి ప్రచురించిన 'యాన్ ఎలిమెంటరీ టెక్స్: హిందు రెలీజియన్ అండ్ ఎథీక్స్' తప్పకుండా చదవాలి. సనాతన ధర్మం గురించి మాట్లాడే సంప్రదాయ వాదులు ఆ గ్రంథం చదివాకే నోరు విప్పాలి! అప్పుడు వారు రాసిపెట్టిన దానికీ, ఇప్పుడు వీరు మాట్లాడుతున్న దానికీ వ్యత్యాసం ఏమిటో స్పష్టంగా తెలుసుకోవాలి! ఎవరి ముఖాన్ని వారు అద్దంలో చూసుకో మంటున్నాం అంతే. ఇంకా వేరేసాక్ష్యాలెందుకూ? ప్రస్తుతం అధికారంలోఉన్న పాలకులకు భారత తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ అంటే గిట్టదు. ఎందుకంటే ఒకరకమైన న్యూనతాభావం. అల్లకల్లోలంగాఉన్న ఆనాటి దేశాన్ని ఆయన తన వివేకంతో, దార్శనికతతో ప్రగతిశీల దృక్పథంతో ముందుకు నడిపారు. ఇప్పటి ఈ ప్రభుత్వం ఏం చేసిందీ? స్థిరంగా ఉన్న దేశాన్ని అస్థిరపరిచింది. సామాన్యుడి బతుకు బజారుపాలు చేసి, కార్పొరేట్లకు భజనచేస్తూ, తన్మ యత్వంలో తేలిపోతోంది. దీన్నే దేశభక్తిగా భావించాలని దేశప్రజలకుఉద్బోధిస్తోంది. దేశం ఎంత వెనక్కిపోతోందో చూసుకుందామన్న స్పృహకూడా లేదు. వైజ్ఞానిక దార్శనికుడు,నిరీశ్వరవాది, రచయిత, పరిపాలనాదక్షుడు అయిన పండిట్ నెహ్రూకు సంబంధించిన వార్త-ఆయన వ్యక్తిత్వాన్ని తెలియ జేస్తోంది. ఇది 1954 ఏప్రిల్ 12 ఆంధ్రపత్రిక డైలీ ప్రచురించిన వార్త- "అహ్మదాబాదు, ఏప్రిల్ 10 అహ్మదాబాదు వస్త్రపారిశ్రామిక పరిశోధనా కేంద్రం భవనానికి నెహ్రూజీ ప్రారంభోత్సవానికి వచ్చినప్పుడు పురోహితుడు మంత్ర పఠనం మొదలు పెట్టాడు. నెహ్రూజీ సౌమ్యంగా ఆపమని సైగ చేశాడు. తెలివిలేని పురోహితుడు విషయం గ్రహించకుండా శ్లోకాలు పఠిస్తూ, నెహ్రూకు తిలకం దిద్దాలని ప్రయత్నించాడు. ఆయన చికాకు పడి "ఈ గోల నేను భరించలేను. ఏమిటిదంతా నాన్సెన్స్ అంటూ అడ్డుగాఉన్న పురోహితుణ్ణి పక్కకునెట్టి చరచరా భవనంలోకి నడిచి వెళ్లిపోయాడు. "దేశం వైజ్ఞానికంగా ముందుకు పోవాలనుకునేవారి చర్యలు ఏ విధంగా ఉండాలో...ఆయన ఆనాడే చేసి చూపించారు.

కేంద్రసాహిత్య అవార్డు విజేత, జీవశాస్త్రవేత్త

నేడు కేంద్ర మంత్రివర్గ సమావేశం

న్యూఢిల్లీ : ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆదివారం కేంద్ర మంత్రి మండలి సమావేశానికి అధ్యక్షత వహిస్తారు. ఇది తన ప్రభుత్వ రెండవ టర్మ్‌లో చివరి కసరత్తు కావచ్చు. కీలకమైన విధానాలు, పాలనా అంశాలను చర్చించడానికి ప్రధాని ఎప్పటికప్పుడు మంత్రి మండలి సమావేశాలను నిర్వహిస్తున్నారు. అయితే ఏప్రిల్-మేలో జరగనున్న లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా ఆదివారం జరిగే ఈ సమావేశానికి రాజకీయ ప్రాధాన్యత సంతరించుకుంది. ఎన్నికల సంఘం మరో రెండు వారాల్లో ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించే అవకాశం ఉంది. ఇక్కడి చాణక్యపురి డిప్లమాటిక్ ఎన్‌క్లేవ్‌లోని సుష్మా స్వరాజ్ భవన్‌లో ఈ సమావేశం జరగనుంది.

బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ ఈ కసరత్తులో చర్చించాల్సిన ముఖ్యాంశాలలో ఒకటి ప్రభుత్వ పనితీరు, పథకాలు ముఖ్యాంశాలుగా ఉండవచ్చు. కాగా, లోక్‌సభ ఎన్నికల నిర్వహణకు వివిధ రాష్ట్రాల సన్నద్ధతపై ఎన్నికల సంఘం సమీక్ష ప్రారంభించింది. 2014లో ఎన్నికల సంఘం తొమ్మిది దశల లోక్‌సభ ఎన్నికలకు మార్చి 5న షెడ్యూల్‌ను ప్రకటించింది. మే 16న ఫలితాలను ప్రకటించింది. 2019లో ఎన్నికల సంఘం మార్చి 10న ఏడు దశల లోక్‌సభ ఎన్నికలను ప్రకటించింది. మే 23న ఫలితాలను వెల్లడించింది.

మూడు రోజుల్లో క్షమాపణ చెప్పాలి

కాంగ్రెస్‌కు గడ్కరి లీగల్ నోటీసు

న్యూఢిల్లీ: కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సీనియర్ నేత జైరామ్ రమేష్‌కు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరి శనివారం లీగల్ నోటీసు పంపారు. తన ఇంటర్వ్యూను వక్రీకరిస్తూ 19 సెకన్ల వీడియోను 'ఎక్స్'లో ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పోస్ట్ చేసినందుకు ఈ లీగల్ నోటీసులు ఇచ్చారు. మూడు రోజుల్లోగా క్షమాపణ చెప్పాలని నోటీసులో డిమాండ్ చేశారు. గందరగోళం, సంచలనం సృష్టించడంతో పాటు బీజేపీ నేతగా తన ప్రతిష్ఠను దిగజార్చే ఉద్దేశంతోనే ఈ క్లిప్‌ను షేర్ చేశారని గడ్కరి ఆరోపించారు. ఇంటర్వ్యూలో తాను చెప్పిన అంశాలకున్న ప్రాధాన్యతను వక్రీకరించి, పార్టీలో విభేదాల సృష్టికి ప్రయత్నించినట్టు తప్పుపట్టారు. గడ్కరి తరపున ఆయన న్యాయవాది బాలేందు శేఖర్ ఈ నోటీసు పంపారు. 'నా క్లయింట్ ఇంటర్వ్యూను వక్రీకరించి, కొన్ని ఎంపిక చేసిన క్లిప్పింగ్స్‌తో వీడియోను పోస్ట్ చేశారు. ఇది ఉద్దేశపూర్వకంగానే జరిగింది. నా క్లయింట్ భారత ప్రభుత్వంలో కేబినెట్ మంత్రిగా ఉన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ డైనమిక్ పాలనకు అద్దం పడుతున్న కేబినెట్‌లో మంత్రిగా గడ్కరి ఉన్నారు. ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధి పనులను ఆయన తరచూ ప్రచారం చేస్తుంటారు. ఆ క్రమంలోనే ఆన్‌లైన్ ప్లాట్‌ఫాం 'ది లల్లాన్‌టాప్'లో ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ ఇంటర్వ్యూ ఇప్పటికీ అందుబాటులోనే ఉంది. బీజేపీలో భాగంగా, దశాబ్దాలు అవిశ్రాంత సేవలతో దేశ ప్రజల మన్ననలను నా క్లయింట్ అందుకొంటున్నారు. 2024 మార్చి 1వ తేదీన మీరు పోస్ట్ చేసిన వీడియో, అందులోని వక్రీకరణలను చూసి ఆయన దిగ్భ్రాంతికి గురయ్యారు. 19 సెకన్ల వీడియో కేవలం స్వార్థ ప్రయోజనాలను ఆశించి, గందరగోళం, సంచలనం సృష్టించేందుకు, ప్రజల్లో గడ్కరి ప్రతిష్ఠ దెబ్బతీసేందు ఉద్దేశించినట్టుగా ఉంది. మోదీ నాయకత్వంలో లోక్‌సభ ఎన్నికలకు వెళ్తున్న వేళ బీజేపీలో విభేదాలు సృష్టించేందుకు ఉద్దేశించినట్టుగా కనిపిస్తోంది' అని బాలేందు శేఖర్ ఆ నోటీసులో పేర్కొన్నారు. నోటీసు అందిన 24 గంటల్లోగా కాంగ్రెస్ పార్టీ తమ సోషల్ మీడియా హ్యాండిల్ నుంచి వీడియోను తొలగించాలని, మూడు రోజుల్లోగా గడ్కరికి క్షమాపణ చెప్పాలని ఆ నోటీసు డిమాండ్ చేసింది. అలా చేయని పక్షంలో తన క్లయింట్ సివిల్, క్రిమినల్ చర్యలకు వెళ్లక తప్పదని హెచ్చరించింది.

సీఏఏ అమలు తప్పదా?

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం త్వరలో పౌరసత్వ సవరణ చట్టం అమలు చేయబోతోందనే ఊహాగానాలు సోషల్ మీడియాలో చక్కెర్లు కొడుతున్నాయి. దీనికి కారణం కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్ కార్లకు ఉన్న నంబర్ ప్లేట్లు. ఢిల్లీలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో జరిగిన బీజేపీ ఎన్నికల సంఘం సమావేశానికి హాజరైన అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్ కారు నంబరు ప్లేట్లపై ఉన్న సంఖ్యల మధ్యలో సీఏఏ అని ఉండడంతో ప్రభుత్వం త్వరలో ఈ చట్టాన్ని అమలు చేయబోతున్నట్లు సంకేతాలు ఇస్తోందా అనే ప్రశ్నలు ప్రజల్లో రేకెత్తుతున్నాయి. లోక్‌సభ ఎన్నికలకు ముందే 2019లో రూపొందించిన పౌరసత్వ సవరణ చట్టాన్ని అమలు చేస్తామని అమిత్ షా కొద్ది రోజుల క్రితం చెప్పారు. ఈ విషయంపై ఆయన మాట్లాడుతూ ముస్లిం సోదరులను తప్పుదారి పట్టిస్తూ, సీఏఏకు వ్యతిరేకంగా రెచ్చగొడుతున్నారని మండిపడ్డారు. పాకిసాంథన్, అఫ్గానిస్తాన్, బంగ్లాదేశ్‌లలో హింసను ఎదుర్కొని భారతదేశానికి వచ్చిన వారికి పౌరసత్వం ఇవ్వడానికి మాత్రమే సీఏఏ అమలవుతోందని, ఇది ఎవరి భారత పౌరసత్వాన్ని లాక్కోవడానికి కాదని తెలిపారు.

ముంబైలో పాక్ ఓడ నిలిపివేత

ముంబై: పాకిస్థాన్ అణు, బాలిస్టిక్ క్షిపణుల తయారీకి వినియోగించే సరకు ఉందన్న అనుమానంతో చైనా నుంచి కరాచీ వెళుతున్న ఓడను ముంబైలోని న్హావాషెవా పోర్ట్‌లో భారత భద్రతా సంస్థలు శనివారం నిలిపేశాయి. కస్టమ్స్ అధికారులు, ఇంటెలిజెన్స్ వర్గాలు తెలిపిన వివరాల ప్రకారం జనవరి 23న కరాచీ నుంచి ఆ ఓడ బయల్దేరింది. తాజాగా అది ముంబై ఓడరేవుకు వచ్చింది. అధికారులకు అనుమానం వచ్చి ఓడను తనిఖీ చేశారు. అందులో కంప్యూటర్ న్యూమరికల్ కంట్రోల్ యంత్రానికి సంబంధించిన సరకు ఉండటాన్ని గుర్తించారు. సీఎన్సీ యంత్రాలను కంప్యూటర్ ద్వారా నియంత్రిస్తారు. పాక్‌కి సరఫరా అవుతున్న సరకు దాయాది దేశం అణు కార్యక్రమాల కోసం ఉపయోగపడుతుందని నిపుణులు అంటున్నారు. పాకిస్థాన్ క్షిపణి అభివృద్ధి కార్యక్రమానికి కీలకమైన భాగాలను తయారు చేయడానికి ఈ పరికరాలు ఉపయోగపడతాయి. సీఎన్సీ మిషన్‌ని ఉత్తర కొరియా అణు కార్యక్రమాల్లో వినియోగిస్తోంది. అధికారులు పకడ్బందీ నిఘాతో, భారీ కార్గోను తనిఖీ చేసి దాయాది కుట్రలపై భారత రక్షణ అధికారులను అప్రమత్తం చేశారు. ఆ తరువాత సరకు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. పాకిస్థాన్, చైనా రెండూ అంతర్జాతీయ ఒప్పందాలకు కట్టుబడి ఉన్నట్లు పేర్కొన్నప్పటికీ అణు ఒప్పందాలకు విరుద్ధంగా కార్యకలాపాలు కొనసాగించడంపై ప్రపంచ దేశాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

హర్యానాలో అమానుషం

ఫరీదాబాద్: నవజాత శిశువు మరణం హర్యానాలో కలకలం సృష్టించింది. మగ శిశువు ప్రహరీ గ్రిల్స్‌పై పడి ప్రాణాలు కోల్పోయింది. ఈ దారుణ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... అక్రోండా గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తి నవజాత శిశవును ఓ భవనం ప్రహరీ గ్రిల్స్‌పై పడేశాడు. గ్రిల్స్‌లో చిక్కుకున్న ఆ శిశువు ప్రాణాలు కోల్పోయింది. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని ఫరీదాబాద్‌లోని బాద్షాఖాన్ సివిల్ ఆసుపత్రికి తరలించారు. ఉద్దేశపూర్వకంగా చంపారా, బతికుండగానే గ్రిల్‌పై పడేశారా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. నేరస్థుల ఆచూకీ కనుక్కోవడానికి పోలీసులు సీసీటీవీ ఫుటేజీలు పరిశీలిస్తున్నారు. తల్లిదండ్రులే దోషులని స్థానికులు ఆరోపిస్తున్నారు. వారికి మరణశిక్ష విధించాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

బీజేపీ హయాంలో 1550 చట్టాల రద్దు

కేంద్ర న్యాయమంత్రి వెల్లడి

ఉజ్జయిని: ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న కాలం చెల్లిన చట్టాలను ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం రద్దు చేసిందని కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘవాల్ తెలిపారు. ఇప్పటివరకు అలాంటి 1,550కి పైగా చట్టాలను రద్దు చేసినట్లు శనివారం ఆయన పేర్కొన్నారు. మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినిలో జరిగిన ప్రాంతీయ పరిశ్రమల సదస్సు ముగింపు సెషన్‌కు ఆయన హాజరయ్యారు. ఈసందర్భంగా మాట్లాడుతూ... "ప్రజలను, వ్యాపారులను ఇబ్బంది పెట్టే అనవసర చట్టాలను మోదీ ప్రభుత్వం రద్దు చేసింది. ఒకప్పుడు కార్మికులను వ్యాధుల నుంచి రక్షించేందుకు పారిశ్రామిక యూనిట్లను వైట్‌వాష్ చేసే చట్టం ఉండేది. ప్రస్తుత పరిస్థితుల్లో అలాంటి చట్టాల వల్ల ఏం ప్రయోజనం లేదు. అందుకే వాటిని రద్దు చేశాం" అని తెలిపారు. ఇప్పటివరకు మొత్తంగా 1562 నిరుపయోగ చట్టాలను కేంద్రం రద్దు చేసింది. ఇక, పరిశ్రమ వర్గాల నుంచి వచ్చే డిమాండ్లపై చర్చించేందుకు ప్రత్యేకంగా కమర్షియల్ కోర్టులు, మధ్యవర్తిత్వ కేంద్రాలను ఏర్పాటుచేసినట్లు మేఘవాల్ గుర్తు చేశారు. కొన్ని నిబంధనల్లో మార్పులు చేసి మధ్యవర్తులకు చట్టపరమైన అధికారం కల్పించినట్లు పేర్కొన్నారు. ప్రజా జీవన విధానాన్ని సరళతరం చేసేలా 2014 నుంచి ఇప్పటివరకు దశలవారీగా కేంద్రం పలు చట్టాలను రద్దు చేస్తూ వస్తోంది. గతంలో మోదీ దీనిపై మాట్లాడుతూ.. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 1800 నిరుపయోగ చట్టాలను గుర్తించిందని తెలిపారు. ప్రజల జీవితానికి అడ్డంకిగా మారిన ఆ పనికిరాని చట్టాలకు మంగళం పలుకుతామన్నారు.

సంక్షోభం అంచునే హిమాచల్

- 9 మంది టచ్‌లో ఉన్నారన్న కాంగ్రెస్ అనర్హత ఎమ్మెల్యే
- 80 శాతం కలిసే ఉన్నామన్న సీఎం సుఖూ



సిమ్లా: హిమాచల్ ప్రదేశ్‌లో రాజకీయ సంక్షోభం సమసిపోలేదు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చివేసే కుట్రలకు కాషాయ బీజేపీ కుట్రలు కొనసాగిస్తోంది. మరింత మంది ఎమ్మెల్యేలను తమవైపు తిప్పుకునే ప్రయత్నాలు ముమ్మరం చేసింది. అందుకు అనర్హత వేటుపడిన కాంగ్రెస్ ఎమ్మెల్యే తాజాగా చేసిన వ్యాఖ్యలు మరింత బలం చేకూరుస్తున్నాయి. కనీసం తొమ్మిది మంది ఎమ్మెల్యేలు మాతో టచ్‌లో ఉన్నారని అనర్హత వేటు పడిన హిమాచల్ కాంగ్రెస్ ఎమ్మెల్యే ఒకరు శనివారం తెలిపారు. రాజ్యసభ ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్ చేసి, అసెంబ్లీకి అనర్హత వేటు పడిన ఆరుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలలో ఒకరైన రాజిందర్ రాణా... కొందరు తిరుగుబాటు శాసనసభ్యులు తిరిగి రావాలని కోరుకుంటున్నారని ముఖ్యమంత్రి సుఖ్‌విందర్ సింగ్ సుఖూ చేసిన వాదనను ఆయన కొట్టిపారేశారు. సుఖూ తన ప్రకటనలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. 'ఎవరూ తిరిగి రావాలని కోరుకోరు. మరోవైపు, కనీసం తొమ్మిది మంది ఎమ్మెల్యేలు మాతో టచ్‌లో ఉన్నారు' అని రాణా పీటీఐకి చెప్పారు. ఇదిలాఉండగా 'కాంగ్రెస్‌లో 80 శాతం మంది కలిసి ఉన్నారు' అని సుఖూ పేర్కొన్నారు. మిగిలిన వారు 'చిన్న విషయాలపై' అసంతృప్తితో ఉన్నారని, అనర్హత వేటు పడిన ఆరుగురు ఎమ్మెల్యేలతో తాను చర్చలు జరిపానని, సమన్వయ కమిటీ ఏర్పాటు తర్వాత పరిస్థితులు చక్కబడతాయని ఆయన తెలిపారు. అయితే రాష్ట్రంలోని ఏకైక స్థానానికి జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్ గురించి రాణా మాట్లాడుతూ 'హిమాచల్ ప్రదేశ్, దాని ప్రజల గౌరవాన్ని నిలబెట్టడానికి మేము ఈ నిర్ణయం తీసుకున్నాము' అని చెప్పుకొచ్చారు. హిమాచల్ ప్రదేశ్ నుంచి రాజ్యసభకు ప్రాతినిధ్యం వహించే అభ్యర్థులెవరూ రాష్ట్రంలోని పార్టీ కార్యకర్తల నుంచి కాంగ్రెస్‌కు లేరా? ఆయన ప్రశ్నించారు. అభిషేక్ మను సింఘ్వికి బదులు సోనియా గాంధీ ఎన్నికల్లో పోటీ చేసి ఉంటే క్రాస్ ఓటింగ్ జరిగే అవకాశం ఉండా అని అడిగిన ప్రశ్నకు, రాణా మాట్లాడుతూ 'ఆమె దేశానికి చాలా కృషి చేశారు. కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ఉన్నారు. ఆమె ఇక్కడ నుంచి పోరాడి ఉంటే, అది వేరే విషయంగా ఉండేది' అని తెలిపారు. అనర్హత వేటు పడిన మరో కాంగ్రెస్ ఎమ్మెల్యే ఇందర్ దత్ లఖన్‌పాల్ పీటీఐతో మాట్లాడుతూ 'కొందరు ఇప్పుడు మమ్మల్ని తిరుగుబాటుదారులు లేదా దేశద్రోహులు అంటారు. కానీ మేము కాదు. మేము మా మనస్సాక్షిని అనుసరించాము. మా వ్యక్తిగత నిర్ణయం' అని అన్నారు. కాగా, హిమాచల్ ప్రదేశ్ ప్రభుత్వం కూలిపోవచ్చని బీజేపీ చేస్తున్న వాదన గురించి ముఖ్యమంత్రి సుఖూ మాట్లాడుతూ 'క్రాస్ ఓటింగ్ తర్వాత బీజేపీ ఉత్సాహంగా ఉంది. కానీ అలాంటి పరిస్థితి మళ్లీ తలెత్తదు' అని అన్నారు. రాబోయే లోక్‌సభ ఎన్నికల గురించి అడిగినప్పుడు, 'సమన్వయ కమిటీ ఏర్పాటు తర్వాత పరిస్థితి కచ్చితంగా మెరుగుపడుతుంది. మేము లోక్‌సభ ఎన్నికల్లో పూర్తి శక్తితో పోరాడుతాము. కాంగ్రెస్ పార్టీ 14 నెలల్లో రాష్ట్రంలో నిజాయితీ, పారదర్శకమైన పాలనను అందించింది' అని తెలిపారు.

మంత్రి విక్రమాదిత్య దారెటు?

హిమాచల్‌ప్రదేశ్ మంత్రి విక్రమాదిత్య సింగ్ కాంగ్రెస్‌కు పక్కలో బల్లెంలా మారారు. ఆయనతో ట్రబుల్ షూటర్ డీకే శివకుమార్ మాట్లాడి... రాజీనామా వెనక్కి తీసుకునేలా చేశారు. ఇప్పుడు సోషల్ మీడియా మాధ్యమం ఫేస్‌బుక్ బయోలో తన హోదాను విక్రమాదిత్య తొలగించారు. దీంతో విక్రమాదిత్య కాంగ్రెస్ పార్టీని వీడతారా..? మరో పార్టీలో చేరతారా..? లేదంటే సొంతంగా పార్టీ ఏర్పాటు చేస్తారా..? అనే సందేహాలు వస్తున్నాయి. ఫేస్‌బుక్ బయోలో విక్రమాదిత్య తన హోదాను తొలగించారు.

దీంతో ఆయన పార్టీ మారడం ఖాయమనే ఊహాగానాలు జోరుగా వినిపిస్తున్నాయి. విక్రమాదిత్య గురించి హిమాచల్ ప్రదేశ్ సీఎం సుఖ్వీందర్ సుఖు స్పందించారు. విక్రమాదిత్య పార్టీని వీడతారా లేదా అనే సమాచారం తనకు తెలియదని సుఖు సమాధానం ఇచ్చారు.

ఎన్నికలకు గంభీర్, జయంత్ దూరం

న్యూఢిల్లీ: రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో తాను పోటీ చేయాలనుకోవడం లేదని బీజేపీ ఎంపీ జయంత్ సిన్హా పేర్కొన్నారు. ప్రత్యక్ష ఎన్నికల బాధ్యతల నుంచి తనను తప్పించాలని పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డాను కోరారు. ఈ విషయాన్ని ఎక్స్ వేదికగా ప్రకటించారు. తూర్పు ఢిల్లీ ఎంపీ గౌతమ్ గంభీర్ తన నిర్ణయాన్ని ప్రకటించిన కాసేపటికే జయంత్ సిన్హా కూడా అదేతరహా ప్రకటన చేయడం గమనార్హం. రాబోయే సార్వత్రిక ఎన్నికలకు బీజేపీ తొలి జాబితాను ఇప్పటికే సిద్ధం చేసింది. ఈసారి కొందరు కొత్తవారికి టికెట్లు ఇవ్వాలని నిర్ణయించింది. కొందరు సిట్టింగులకు పార్టీ సంస్థాగత బాధ్యతలు అప్పగించాలని భావిస్తోంది. కొన్ని గంటల వ్యవధిలోనే ఝార్ఖండ్‌లోని మహజారీబాగ్ ఎంపీగా వ్యవహరిస్తున్న జయంత్ సైతం తాను పోటీకి దూరమని ప్రకటించారు. ఎన్నికల్లో పోటీ చేయనప్పటికీ పార్టీ వ్యవహారాల్లో పాల్గొంటానని స్పష్టంచేశారు. పర్యావరణ మార్పుల అంశంపై దృష్టి కేంద్రీకరించేందుకు సమయం వెచ్చిస్తానని తెలిపారు. పదేళ్ల పాటు హజారీబాగ్ ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించిన ప్రధాని మోదీకి, అమిత్ షాకు ధన్యవాదాలు తెలియజేశారు. జయంత్ సిన్హా కేంద్రమంత్రిగానూ సేవలందించారు.

రాజకీయాలకు గంభీర్ గుడ్‌బై

తనను రాజకీయ విధుల నుంచి తప్పించాలని బీజేపీ ఎంపీ, టీమిండియా మాజీ క్రికెటర్ గౌతమ్ గంభీర్ శనివారం జేపీ నడ్డాకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియాలో పోస్టు చేశారు. దీంతో గంభీర్ క్రియాశీల రాజకీయాలకు దూరం కానున్నట్లు తెలుస్తోంది. 'క్రికెట్‌కు సంబంధించిన బాధ్యతల నిమిత్తం...నన్ను రాజకీయ విధుల నుంచి తప్పించమని జేపీ నడ్డాను అభ్యర్థించాను. ప్రజలకు సేవ చేసుకునే అవకాశం కల్పించిన ప్రధాని మోదీకి కృతజ్ఞతలు. జై హింద్' అంటూ ఆయన పోస్టు పెట్టారు. ప్రస్తుతం ఈ పోస్ట్ వైరల్‌గా మారింది. గంభీర్ 2019లో బీజేపీలో చేరారు. తూర్పు ఢిల్లీ నియోజకవర్గం నుంచి ఆయన ఎంపీగా గెలిచారు. త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఆయనకు టికెట్ దక్కకపోవచ్చనే వార్తల నేపథ్యంలో గంభీర్ ఈ పోస్ట్ చేయడం చర్చనీయాంశంగా మారింది.

ఆప్ విమర్శ

తూర్పు ఢిల్లీ నుంచి గౌతమ్ గంభీర్ పోటీ నుంచి తప్పుకోవడంపై ఆమ్‌ఆద్మీ పార్టీ బీజేపీని నిందించింది. ప్రజల కోసం పనిచేయాలన్న తపన, వారి అర్హతలు చూడకుండా ఆ పార్టీ పోటీలో నిలుపుతోందని దుయ్యబట్టింది. ఆప్ సీనియర్ నేత అతిషి శనివారం విలేకరులతో మాట్లాడుతూ ఈ ఐదేళ్లలో తూర్పు ఢిల్లీ వాసులకు గంభీర్ చేసిందేమీ లేదని విమర్శించారు. ఆ పార్టీ ఎంపీలెవరూ నియోజకవర్గంలో అందుబాటులో ఉండడం లేదని ఆరోపించారు. ఆ పార్టీ ఎంపీలే కాదు... ఎమ్మెల్యేలు, కౌన్సిలర్లు కూడా నియోజకవర్గంలో కనిపించడం లేదన్నారు. ఆప్ ఎమ్మెల్యేలు మాత్రం నిత్యం ప్రజల్లో ఉంటారని చెప్పారు.

మహాబలిపురం బీచ్‌లో తెలుగు విద్యార్థుల గల్లంతు

మహాబలిపురం: తమిళనాడు మహాబలిపురం బీచ్ వద్ద ఆందోళనకర వాతావరణం నెలకొంది. ముగ్గురు తెలుగు విద్యార్థులు సముద్రంలో గల్లంతయ్యారు. గజ ఈతగాళ్లు రంగంలోకి దిగారు. ఈ ముగ్గురూ చిత్తూరు జిల్లా పలమనేరు ప్రభుత్వ కాలేజ్‌లో చదివే విద్యార్థులుగా తెలుస్తోంది. కాలేజీ తరపున 18 మంది విద్యార్థుల బృందం తమిళనాడు టూర్‌కి వెళ్లింది. సరదాగా ఈత కోసం విద్యార్థులు సముద్రంలో దిగారు. ఇందులో మౌనిష్, విజయ్, ప్రభు అనే ముగ్గురు ఒక్కసారిగా గల్లంతైనట్లు తోటి విద్యార్థులు చెబుతున్నారు. గల్లంతైన విద్యార్థుల ఆచూకీ కోసం గజ ఈతగాళ్లు ప్రయత్నిస్తున్నారు. ఈ ముగ్గురి స్వస్థలాలు... మౌనిష్-బంగారుపాళ్యం, విజయ్- సదుం, ప్రభు-పులిచెర్ల గ్రామంగా తెలుస్తోంది. విద్యార్థుల గల్లంతు సమాచారంతో తల్లిదండ్రులు, బంధువుల్లో ఆందోళన నెలకొంది.

ఫిరాయింపుదారులపై వేటు

హిమాచల్ స్పీకర్‌ను అనుసరించాలి

ఆర్‌జేడీ నేత మనోజ్ కుమార్ ఝా డిమాండ్

పాట్నా: హిమాచల్‌ప్రదేశ్‌లో ఇటీవల బీజేపీకి మద్దతుగా నిలిచిన ఆరుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయడంపై ఆర్‌జేడీ శనివారం హర్షం వ్యక్తం చేసింది. బీహార్‌లో ఫిరాయింపుదారులపైనా అదే విధమైన చర్య తీసుకుంటారని ఆశాభావం వెలిబుచ్చింది. రాష్ట్రంలో అధికార ఎన్‌డీఏకి ఐదుగురు ఎమ్మెల్యేలను కోల్పోయిన ఆర్‌జేడీ జాతీయ అధికార ప్రతినిధి, రాజ్యసభ ఎంపీ మనోజ్ కుమార్ ఝా విలేకరుల సమావేశంలో ఈ మేరకు ప్రకటన చేశారు. ఫిరాయింపుదారులకు బీహార్ అసెంబ్లీలో పార్టీ మొత్తం బలంలో మూడింట రెండు వంతుల సంఖ్య లేదు. సభలో వారి సభ్యత్వం కొనసాగదు' అని నొక్కి చెప్పారు. శాసనసభ్యులు దశలవారీగా అధికార పక్షానికి వెళ్లడం ప్రారంభించేటప్పటికీ 79 మంది ఎమ్మెల్యేలను కలిగి ఉంది. 'హిమాచల్ ప్రదేశ్‌లో ఫిరాయింపుదారులను అనర్హులుగా ప్రకటించినట్లే, బీహార్‌లో కూడా ఉన్న కారణాలతో ఫిరాయింపుదారులను అనర్హులుగా ప్రకటించేలా తగిన చర్యలు తీసుకోవాలని స్పీకర్‌ను కోరుతున్నాం. ఆయన అలా చేయకపోతే, మేము న్యాయపరమైన ఆశ్రయం తీసుకుంటాము' అని ఝా అన్నారు. కేంద్రంలోని అధికారంలో ఉన్న బీజేపీపై విమర్శల దాడి చేసిన ఆర్‌జేడీ ప్రతినిధి... 'బీహార్‌లో నిరుద్యోగ యువత ఆశాకిరణంగా చూస్తున్న మా నాయకుడు తేజస్వి యాదవ్‌ను మానసికంగా దెబ్బతీసేందుకు గుజరాతీ డబ్బు సంచులు విప్పారు' అని విమర్శించారు. పాట్నాలో ఆదివారం జరగనున్న ర్యాలీకి కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీతో సహా బీహార్‌లోని 'మహాఘట్బంధన్ నాయకులందరూ' హాజరయ్యే అవకాశం ఉందని ఝా తెలిపారు. ఒక ప్రశ్నకు సమాధానంగా, 'మేము ఏ నాయకుడిని ప్రత్యేకంగా ఆహ్వానించలేదు. రాహుల్ గాంధీ వస్తున్నారని మా మిత్రపక్షమైన కాంగ్రెస్ చెబుతోంది. మేము వారి మాట ప్రకారం వారిని తీసుకుంటాము' అని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బీహార్ పర్యటన గురించి అడిగిన ప్రశ్నకు, 'మోదీ అనేక ప్రాజెక్టులను ప్రారంభించబోతున్నాడు. అయితే వీటిలో ఒక రహదారీ పూర్తికాలేదు' అని ఆరోపించారు. బీజేపీతో కలిసి కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ ఔరంగాబాద్, బెగుసరాయ్ జిల్లాల్లో ప్రధాన మంత్రితో వేదిక పంచుకోవడంపై ఆయన ప్రశ్నలను సంధించారు. 'ముఖ్యమంత్రిగా ఎవరితో వేదిక పంచుకోవాలనేది ఆయన విచక్షణ. మా నాయకుడు తేజస్వి యాదవ్ సీఎంపైనా, మమ్మల్ని విడిచిపెట్టిన సొంత ఎమ్మెల్యేలపైనా ఒక్క మాట కూడా మాట్లాడకుండా ఆదర్శంగా నిలిచారు' అని ఝా పేర్కొన్నారు.

పొగాకు వ్యాపారి ఇంట్లో ఐటీ సోదాలు

భారీగా ఆస్తుల స్వాధీనం

న్యూఢిల్లీ: మూడు రోజులుగా ఓ పొగాకు వ్యాపారి ఇంట్లో సోదాలు జరుపుతున్న ఐటీ అధికారులు అతడి వద్ద నుంచి రూ.60 కోట్ల విలువైన కార్లు, రూ.2.5 కోట్లు విలువ చేసే బంగారు ఆభరణాలు, గడియారాలు స్వాధీనం చేసుకున్నారు. పెద్ద మొత్తంలో నగదు పట్టుకున్నారు. అంతేకాకుండా కోట్లలో పన్నుఎగవేతకు పాల్పడినట్లు గుర్తించారు. ఈ ఘటన యూపీలోని కాన్పూర్ జిల్లాలో వెలుగు చూసింది. ఈ దాడుల్లో అతడికి విదేశాల్లోనూ ఆస్తులు ఉన్నట్లు డాక్యుమెంట్లు లభించాయని చెప్పారు. అంతేకాకుండా కొన్ని కోట్ల రూపాయలు విలువ చేసే పన్నులను అతడు ప్రభుత్వానికి ఎగ్గొట్టినట్లు ఐటీ సోదాల్లో తేలింది. సంబంధిత పత్రాలన్నింటినీ తాము స్వాధీనం చేసుకున్నామని, ఇప్పటికే విచారణ ప్రారంభించామని ఐటీ శాఖ అధికారి ఒకరు చెప్పారు. కాన్పూర్ జిల్లాలోని నాయగంజ్ ప్రాంతంలో మున్నా మిశ్రా అనే వ్యక్తి బన్షీధర్ టొబాకో కంపెనీ నిర్వహిస్తున్నాడు. రెండు రోజుల క్రితం ఢిల్లీలోని ఇతడి ఇంటిలో ఐటీ అధికారులు సోదాలు నిర్వహించారు. దాడుల్లో భాగంగా మున్నా అక్రమంగా సంపాదించిన ఆస్తులను స్వాధీనం చేసుకున్నారు. విచారణ కొనసాగుతోంది. మున్నాకు విదేశాల్లోని కంపెనీలతోనూ సంబంధాలు ఉన్నట్లు ఆదాయపు పన్ను శాఖ గుర్తించింది. ఈ నేపథ్యంలో మున్నా పొగాకు వ్యాపారం విదేశాలకూ విస్తరించిందా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. అయితే వీటన్నింటిపై నిందితుడు మున్నా మిశ్రా ఇప్పటివరకు నోరే విప్పలేదని అధికారులు చెబుతుండగా, అతడి ఆరోగ్యం బాగాలేదని, ప్రస్తుతం అతడు మాట్లాడలేని పరిస్థితుల్లో ఉన్నాడని మున్నా కుటుంబ సభ్యులు చెబుతున్నారు.

అవినీతికి పర్యాయపదం టీఎంసీ

ప్రధాని మోదీ

కృష్ణానగర్ (ప.బెంగాల్) : ప్రధాన మంత్రి నరేంద్ర శనివారం మమతా బెనర్జీ ప్రభుత్వంపై దాడిని పెంచారు. ఇది 'అణచివేత, రాజవంశ రాజకీయాలు, ద్రోహం'కు పర్యాయపదంగా ఉందని, పథకాలను స్కామ్‌లుగా మార్చడంలో టీఎంసీ 'ప్రావీణ్యం' సాధించిందని ఆరోపించారు. నదియా జిల్లాలోని కృష్ణానగర్‌లో జరిగిన ర్యాలీలో మోదీ మాట్లాడుతూ రాష్ట్రంలోని 42 లోక్‌సభ స్థానాలను బీజేపీ గెలుచుకోవాలనే ప్రతిష్టాత్మక లక్ష్యాన్ని వివరించారు. పశ్చిమ బెంగాల్ పురోగతికి, దేశానికి మధ్య ఉన్న ముఖ్యమైన సహసంబంధాన్ని నొక్కి చెప్పారు. సందేశ్‌ఖలీలో మహిళలపై టీఎంసీ నాయకుల లైంగిక వేధింపుల ఆరోపణలను ప్రస్తావిస్తూ, బాధిత మహిళలను ప్రభుత్వం వదిలివేసిందని, బదులుగా నిందితుల పక్షాన ఉందని మోదీ ఆరోపించారు. 'పశ్చిమ బెంగాల్ ప్రజలు రాష్ట్ర ప్రభుత్వ పనితీరును చూసి నిరాశ చెందారు. వారు చాలా అంచనాలతో టీఎంసీకి చాలాసార్లు భారీ తీర్పు ఇచ్చారు. కానీ ఆ పార్టీ నిరంకుశత్వానికి, వంశ రాజకీయాలకు, ద్రోహానికి మరో పేరుగా మారింది. టీఎంసీ ప్రాధాన్యత అవినీతి, బంధుప్రీతి, రాష్ట్ర అభివృద్ధి కాదు' అని ఆయన అన్నారు. టీఎంసీ అంటే 'తూ, మెయిన్ ఔర్ అవినీతి' అని ఆరోపించారు. కేంద్ర పథకాలను కేటాయించడం, వాటిని తమ సొంతం అని ముద్ర వేయడాన్ని ఆయన నిందించారు. 'మీరందరూ ఇక్కడ భారీ సంఖ్యలో గుమిగూడడం చూస్తుంటే 'ఎన్‌డీఏ సర్కార్, 400 పార్' అని చెప్పగలిగే ఆత్మవిశ్వాసం కలుగుతోంది' అని ఇక్కడ జరిగిన 'బిజోయ్ సంకల్ప సభ'లో ఆయన ప్రజలను ఉద్దేశించి అన్నారు. 'టీఎంసీ పాలనలో పశ్చిమ బెంగాల్ ప్రతిష్ఠను మసకబారింది. ప్రతి పథకాన్ని స్కామ్‌గా మార్చడంలో అది ప్రావీణ్యం సాధించింది. కేంద్ర పథకాలపై స్టిక్కర్‌ను వేసి, దానిని వారిదిగా చెబుతారు. వారు పేదల నుంచి లాక్కోవడానికి, వారిని లేకుండా చేయడానికి వెనుకాడరు' అని ఆరోపించారు. 'రాబోయే సంవత్సరాల్లో బీజేపీ దేశంలో, రాష్ట్రంలో పెట్టుబడులు, ఉపాధి కోసం అసంఖ్యాక అవకాశాలను సృష్టిస్తుంది. దీనిని నిర్ధారించడానికి, మీరు లోక్‌సభ ఎన్నికలలో బీజేపీ విజయాన్ని నిర్ధారించడం ద్వారా మీ సహకారాన్ని గుర్తించాలి. కమలం (బీజేపీ చిహ్నం) పశ్చిమ బెంగాల్‌లోని మొత్తం 42 స్థానాల్లో వికసించాలి' అని అన్నారు. పరిపాలన నిర్ణయాలపై నేరస్తులు మితిమీరిన ప్రభావాన్ని చూపుతున్నారని ఆయన రాష్ట్ర చట్టాన్ని అమలు చేయడాన్ని విమర్శించారు. సందేశ్‌ఖలీ ఘటనల్లో ప్రధాన నిందితుడు షాజహాన్ షేక్ అరెస్ట్ గురించి స్పష్టంగా ప్రస్తావిస్తూ, సందేశ్‌ఖలీ నిందితుడిని అరెస్టు చేయడం రాష్ట్ర ప్రభుత్వానికి ఇష్టం లేదని, అయితే బీజేపీ కార్యకర్తలు మహిళలకు అండగా నిలబడటంతో రాష్ట్ర ప్రభుత్వం తలవంచవలసి వచ్చిందన్నారు.

పోలీసుల అదుపులో నలుగురు?

- రామేశ్వరం కేఫ్ పేలుడుపై దర్యాప్తు ముమ్మరం
- నిందితులను పట్టుకుంటాం: సిద్ధరామయ్య

బెంగళూరు/మైసూరు: కర్నాటకలోని రామేశ్వరం కేఫ్ పేలుడు ఘటనలో నలుగురు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు పోలీస్ వర్గాలు వెల్లడించాయి. మరోవైపు, కేఫ్‌లో జరిగిన పేలుడుకు కారణమైన నిందితులను వీలైనంత త్వరగా పట్టుకుంటామని కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య స్పష్టం చేశారు. సీఎం సిద్ధరామయ్య పేర్కొన్నారు. కేఫ్‌లో జరిగిన పేలుడుకు సంబంధించి నలుగురిని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. వారిని విచారిస్తున్నట్లు పేర్కొన్నాయి. కాగా పేలుడు ఘటనపై దర్యాప్తును సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్‌కు అప్పగించినట్లు బెంగళూరు నగర పోలీస్ కమిషనర్ బీ దయానంద తెలిపారు. దర్యాప్తు ముమ్మరంగా సాగుతోందని పేర్కొన్నారు. అయితే ఇప్పటివరకు ఈ కేసులో అరెస్టులేవీ జరగలేదన్నారు. ఈ కేసుపై పోలీసులు బృందాలుగా ఏర్పడి దర్యాప్తు చేపడుతున్నారని చెప్పారు. కేసు సున్నితత్వం, భద్రతా సమస్యలను దృష్టిలో ఉంచుకుని మీడియా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఎటువంటి ఊహాగానాలకు తావు ఇవ్వొద్దని కోరారు. మరోవైపు, కెంపెగౌడ అంతర్జాతీయ విమానాశ్రయంలో అధికారులు భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు.

రామేశ్వరం కేఫ్‌ను సందర్శించిన సిద్ధరామయ్య

రామేశ్వరం కేఫ్‌లో జరిగిన పేలుడుకు కారణమైన నిందితులను వీలైనంత త్వరగా పట్టుకుంటామని కర్నాటక సీఎం సిద్ధరామయ్య తెలిపారు. సీసీటీవీ ఆధారంగా ఘటన వెనుక ఉన్న వారిని పట్టుకుంటామని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. అలాగే పేలుడు సంభవించిన రామేశ్వరం కేఫ్‌ను ముఖ్యమంత్రి సిద్ధరామయ్య శనివారం సందర్శించారు. ఆ తర్వాత పేలుడు ఘటనలో గాయపడి బ్రూక్‌ఫీల్డ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నవారిని పరామర్శించారు. 'రామేశ్వరం కేఫ్‌లో పేలుడు ఘటనలో నిందితుడి కదలికలు సీసీ కెమెరాలకు చిక్కాయి. పేలుడు కారణమైనవారిని పట్టుకుంటాం. ఫేస్ మాస్క్, క్యాప్ ధరించిన ఒక వ్యక్తి బస్సులో వచ్చి కేఫ్‌కు వచ్చాడు. టిఫిన్‌ను ఆర్డర్ చేసి కేఫ్‌లో ఒక చోట కూర్చున్నాడు. ఆ తర్వాత తన బ్యాగ్ అక్కడే ఉంచి వెళ్లిపోయాడు. పేలుడు ఘటనలో గాయపడ్డవారు క్షేమంగా ఉన్నారు. కేఫ్‌లో పేలుడుపై బీజేపీ రాజకీయాలు చేస్తోంది' అని సిద్ధరామయ్య అన్నారు.

బెంగళూరు ప్రజలు ఆందోళన చెందొద్దు: డీకే

2022లో మంగళూరులో జరిగిన కుక్కర్ పేలుడుకు, రామేశ్వరం కేఫ్ పేలుడుకు మధ్య సంబంధం ఉందని కర్నాటక ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ తెలిపారు. రామేశ్వర్ పేలుడు ఘటనపై పోలీసులు అన్ని కోణాల్లోనూ దర్యాప్తు చేపడుతున్నారని చెప్పారు. 'బెంగళూరు ప్రజలు ఆందోళన చెందనవసరం లేదు. ఇది తక్కువ తీవ్రత కలిగిన పేలుడు. నిందితుడు క్యాప్, ఫేస్ మాస్క్ పెట్టుకున్నప్పటికీ అతడి ముఖం కనిపిస్తుంది' అని చెప్పారు.

శాంతిభద్రతల పరిరక్షణలో కాంగ్రెస్ విఫలం: బీజేపీ

రామేశ్వరం కేఫ్‌లో పేలుడు ఘటనపై కర్నాటక మాజీ ముఖ్యమంత్రి, బీజేపీ నేత బసవరాజ్ బొమ్మై స్పందించారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం మొదటి రోజు నుంచి శాంతిభద్రతల పరిరక్షణలో విఫలమైందని ఆరోపించారు. దేశ వ్యతిరేక శక్తులకు అధికార పార్టీ నేతలు నుంచి మద్దతు లభిస్తోందన్నారు. బీజేపీ సర్కార్ రాష్ట్రంలో అధికారంలో ఉన్న సమయంలో 15మంది స్లీపర్ సెల్స్‌ను జైల్లోకి పంపామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం బుజ్జగింపు రాజకీయాల వల్లే బెంగళూరు నగరంలో ఇలాంటి పేలుడు సంభవించిందని ఆరోపించారు.

ఇదే చివరి అవకాశం

ఫిరాయింపు ఎమ్మెల్సీలకు మండలి చైర్మన్ లేఖ

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: వైసీపీ ఫిరాయింపు ఎమ్మెల్సీలు ఈ నెల ఐదున విచారణకు రావాలని, ఇదే మీకు చివరి అవకాశమని శాసన మండలి కార్యాలయం మరోసారి నోటీసులు జారీజేసింది. వైసీపీ నుంచి ఫిరాయించిన ఎమ్మెల్సీలు సి.రామచంద్రయ్య, వంశీ కృష్ణకు శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషెన్‌రాజు మరోసారి లేఖలు రాశారు. వైసీపీ నుంచి ఎన్నికైన వంశీకృష్ణ, రామచంద్రయ్య పార్టీ ఫిరాయించి, పార్టీ వ్యతిరేక కార్యకలాపాలను నిర్వహిస్తున్నారని... పార్టీ తరపున ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, మేరుగ మురళీ చైర్మన్‌కు ఫిర్యాదు చేశారు. వారిద్దర్నీ అనర్హులుగా చేయాలని కోరారు. వంశీకృష్ణ జనసేనలోను, సి.రామచంద్రయ్య టీడీపీలోను చేరారు. దీంతో చైర్మన్ వారికి మరోసారి లేఖలు రాసి విచారణకు రావాలని ఆదేశించడం చర్చనీయాంశమైంది. ఇప్పటికే ఫిరాయించిన ఎనిమిది మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు పడింది. వారిలో నలుగురు టీడీపీ ఎమ్మెల్యేలు, నలుగురు వైసీపీ ఎమ్మెల్యేలు ఉన్నారు. అసెంబ్లీ స్పీకర్ తమ్మినేని సీతారామ్ అనర్హత వేటు వేశారు. ఇదే దిశగా పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్సీలపై ఎలాంటి చర్యలు ఉంటాయనేదీ రాజకీయంగా ఉత్కంఠగా మారింది.

చిత్తశుద్ధే గీటురాయి

- అభ్యర్థుల ఎంపికపై కసరత్తు
- 1,351 మంది ఆశావహులు
- సీడబ్ల్యూసీ సభ్యుడు గిడుగు రుద్రరాజు

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: విధేయత, నిజాయితీ, చిత్తశుద్ధి అనే ప్రధాన అర్హతగా రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను చేపడతామని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సభ్యులు గిడుగు రుద్రరాజు స్పష్టం చేశారు. విజయవాడ ఆంధ్రరత్న భవన్‌లో శనివారం ప్రదేశ్ ఎన్నికల కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మాణిక్యం ఠాకూర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పీసీసీ అధ్యక్షులు వైఎస్ షర్మిల, ఏఐసీసీ కార్యదర్శి, ఏపీ ఇన్‌ఛార్జ్ మయప్పన్ అధ్వర్యంలో కమిటీ సభ్యులు, పార్టీలోని వివిధ విభాగాల ముఖ్యులు హాజరై, వివిధ అంశాలపై చర్చించామన్నారు. సమావేశంలో అభ్యర్థుల ఎంపికకు సంబంధించి విధివిధానాల రూపకల్పన జరుగుతుందని గిడుగు రుద్రరాజు చెప్పారు. మొత్తం 175 అసెంబ్లీ, 25 పార్లమెంటు స్థానాలకు సంబంధించి 1,351 మంది దరఖాస్తు చేసుకున్నట్లు వివరించారు. విధేయత, నిజాయితీ, చిత్తశుద్ధితో పాటు పారదర్శకంగా, కష్టపడి పని చేసే వారికి మాత్రమే పోటీ చేసే అవకాశం దక్కుతుందని తెలిపారు. ప్లీనరీ సమావేశాల్లో నిర్ణయించిన విధంగా సామాజిక సమతుల్యత పాటిస్తూ 50 శాతం సీట్లను ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, యువతకు కేటాయిస్తామని ఆయన వెల్లడించారు.

5,6 తేదీల్లో అభ్యర్థులతో భేటీ

కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు షర్మిల రెండు రోజుల పాటు ఇప్పటికే కొంత మంది దరఖాస్తుదారులతో సమావేశం అయ్యారని గిడుగు రుద్రరాజు చెప్పారు. టికెట్లు ఆశించి దరఖాస్తు చేసుకున్న మిగిలిన ఆశావహులతో ఈనెల 5, 6 తేదీల్లో విజయవాడలోని ఆంధ్రరత్న భవన్‌లో ఆమె భేటీ అవుతారని అన్నారు. అభ్యర్థుల ఎంపికకు సంబంధించి పార్టీ ప్రాథమికంగా కొన్ని మార్గదర్శకాలను ఏర్పాటు చేసిందని, దాని ప్రకారం ఒడబోత కార్యక్రమం ఉంటుందన్నారు. పార్లమెంటు, అసెంబ్లీ అభ్యర్థుల ఎంపికకు సంబంధించి పార్టీ సీనియర్ నేతలతో పాటు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుల అభిప్రాయాలనూ తెలుసుకుంటామని గిడుగు రుద్రరాజు వివరించారు. స్క్రీనింగ్ కమిటీ జాతీయ అధ్యక్షులు మధుసూదన్ మిస్త్రీకి ఆశావహుల జాబితా పంపుతామన్నారు. పారదర్శకంగా, కష్టపడి పని చేసే వారికి కాంగ్రెస్ పార్టీ తప్పకుండా అవకాశం ఇస్తుందని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ మాజీ సభ్యులు, ఏపీసీసీ మీడియా కమిటీ చైర్మన్ తులసిరెడ్డి పాల్గొన్నారు.

కణితి కాటేస్తోంది!

- ఏటా పెరుగుతున్న క్యాన్సర్ రోగుల సంఖ్య
- పొగాకు ఉత్పత్తుల వినియోగంతో అధికశాతం మృత్యువాత
- దీర్ఘకాలిక ఒత్తిడీ కారణమంటున్న వైద్యులు
- పల్లెల్లో అవగాహన శిబిరాలు అవశ్యమంటున్న వైనం



ఆధునిక ప్రపంచంలో వైద్యశాస్త్రం ఎంత అభివృద్ధి చెందినా క్యాన్సర్ మహమ్మారిని పూర్తిస్థాయిలో నిర్మూలించడం కష్టతరంగా మారుతోంది. జీవనశైలిలో ఏర్పడిన మార్పుల వల్లే క్యాన్సర్ విస్తరిస్తోందని వైద్యులు వెల్లడిస్తున్నారు. పొగాకు ఉత్పత్తులు ఎక్కువగా వినియోగించడం, వారసత్వంగా వచ్చిన జన్యుపరమైన లోపాల వల్ల అధికశాతం మంది క్యాన్సర్ భూతం కోరల్లో చిక్కుకొని ప్రాణం వదిలేస్తున్నారని స్పష్టం చేస్తున్నారు. వైద్యం ఖర్చుతో కూడుకున్నది కావడంతో కొన్ని వర్గాల ప్రజలు భరించే శక్తిలేక తాత్కాలిక ఉపశమనానికి మందులు వాడుతూ జీవితాన్ని చాలిస్తున్నారని చెబుతున్నారు. కణితి కాటేస్తుండటంతో అధికశాతం మంది కాటికి పోతున్నారు. పల్లెల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పిస్తూ ప్రభుత్వాలు భరోసా ఇస్తే క్యాన్సర్ బారినపడేవారి సంఖ్య తగ్గుతుందని సూచిస్తున్నారు.

విశాలాంధ్ర–డిజిటల్: శాస్త్ర, సాంకేతిక రంగాల్లో దూసుకుపోతున్నా క్యాన్సర్ మహమ్మారిని పూర్తిస్థాయిలో నియంత్రించడంలో అగ్ర రాజ్యాలు సైతం వైఫల్యం చెందుతూనే ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఏడాదికి సుమారు మూడు కోట్ల మంది క్యాన్సర్ వ్యాధిబారిన పడుతుండగా పది లక్షల మందికి పైగా మృతి చెందుతున్నారు. అభివృద్ధి చెందుతున్న భారతదేశంలో ఈ ప్రభావం ఎక్కువగా ఉంది. ప్రపంచ కేసులతో పోల్చుకుంటే నాలుగో వంతు భారతీయులు క్యాన్సర్‌కు గురవుతున్నారు. మూడోవంతు మరణిస్తున్నారు. క్యాన్సర్ తొలినాళ్లలో గుర్తించకపోవడమే దీనికి ప్రధాన కారణం. అభివృద్ధి చెందిన, చెందుతున్న దేశాల్లో జీవనశైలిలో ఏర్పడిన మార్పుల వల్లే క్యాన్సర్ విస్తరిస్తోంది. జీవితాంతం శాపంగా మారుతోంది. దీర్ఘకాలిక దగ్గు, బరువు తగ్గడం, పేగు కదలికల్లో మార్పు, రక్తహీనత, ప్లేట్‌లెట్స్ తగ్గడం, అసాధారణ కర్తస్రావం వ్యాధి లక్షణాలుగా వైద్యులు పేర్కొంటున్నారు. పొగాకు ఉత్పత్తులు నమలడం, ఊబకాయం, కొన్ని రకాల అంటువ్యాధులు, పర్యావరణ కాలుష్యం, వారసత్వంగా వచ్చిన జన్యుపరమైన లోపాలు, సరైన ఆహారం సమయానికి తీసుకోకపోవడం, శారీరక శ్రమ లేకపోవడం, అధికంగా మద్యం తాగడం వల్ల క్యాన్సర్ సోకే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. దీర్ఘకాలిక ఒత్తిడి వల్ల కూడా క్యాన్సర్ మహమ్మారి వ్యాప్తి చెందుతోందని ఇటీవల అమెరికా కోల్డ్ స్ప్రింగ్ హార్బర్ లేబొరేటరీ శాస్త్రవేత్తలు నిర్ధారించారు. రోగ నిర్ధారణకు ఐదు నుంచి 10 ఏళ్లు పడుతుందంటున్నారు. అధికశాతం మంది ప్రజలు ఊపిరితిత్తులు, ప్రొస్టేట్, కడుపు, రొమ్ము, గర్భాశయ క్యాన్సర్లతో బాధపడుతున్నారు. అవగాహన లేకపోవడం వల్లనే అధికశాతం మంది వ్యాధిబారిన పడుతున్నట్టు వైద్యులు వెల్లడిస్తున్నారు.

2015–2020 లెక్కల ప్రకారం ప్రతి ఏడాది రోగుల సంఖ్య పెరుగుతూనే ఉంది. సుమారు 25 శాతం పెరుగుదలగా గణాంకాలు చెబుతున్నాయి. 22 శాతం పొగాకు వినియోగం, 10 శాతం ఊబకాయం, 10 శాతం వారసత్వం, 18 శాతం పర్యావరణ కాలుష్యకారకాల వల్ల క్యాన్సర్ వ్యాప్తి చెందినట్టు వెల్లడించింది. మెడికల్ ఇమేజింగ్ బయాప్సీ (ఎంఐబీ), పాప్‌స్మయర్ టెస్ట్, పెర్విన్ ఎగ్జామినేషన్ ద్వారా వ్యాధి నిర్ధారిస్తారు. రోగులకు రేడియేషన్ థెరపీ, సర్జరీ, కెమోథెరపీ, టార్గెటెడ్ థెరపీ ద్వారా వైద్యసేవలు అందిస్తూ బతికించేందుకు శాయశక్తులా కృషి చేస్తున్నారు. ప్రతి ఏడాదీ ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం నిర్వహిస్తూ అవగాహన కల్పిస్తున్నా, ప్రభుత్వాలు నూరు శాతం దృష్టి పెట్టకపోవడం వల్లనే రోగుల సంఖ్య పెరిగిపోతుందని వైద్యులు చెబుతున్నారు. ప్రతి పల్లెలోనూ వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలను చైతన్య పరచాల్సిన ఆవశ్యకత ఉందని స్పష్టం చేస్తున్నారు. వైద్యం ఖర్చుతో కూడుకున్నది కావడంతో రోగులు చికిత్సకు వెనుకడుగు వేస్తున్నట్టు వెల్లడిస్తున్నారు. ప్రభుత్వాలు భరోసా కల్పిస్తే రోగుల సంఖ్య తగ్గే అవకాశాలు అధికంగా ఉన్నాయని, కుటుంబాలు చెల్లాచెదురు కాకుండా ఉంటాయని అంటున్నారు.

ఇదిలా ఉండగా, ఇటీవల కృత్రిమ మేధ (ఏఐ)ను ఉపయోగించి శరీరంలో వేగంగా వ్యాప్తి చెందే కొత్తరకం ప్రొస్టేట్ క్యాన్సర్‌ను బ్రిటన్ శాస్త్రవేత్తలు గుర్తించారు. వ్యాధిలో రెండు ఉపరకాలు ఉన్నట్లు వెల్లడైంది. సరాసరి ప్రతి ఎనిమిది మంది పురుషుల్లో ఒకరు ప్రొస్టేట్ క్యాన్సర్ బారిన పడుతుంటారని వేలాది నమూనాల జన్యు డేటాను విశ్లేషించి శాస్త్రవేత్తలు ఈ నిర్ధారణకు వచ్చారు. వాటి డీఎన్ఏలో తలెత్తుతున్న మార్పులపై అధ్యయనం చేయడానికి ఏఐని వాడారు.

స్క్రీనింగ్ టెస్ట్‌తో మరణాల అదుపు

క్యాన్సర్ వ్యాధి వ్యాప్తికి అవగాహనా లోపమే ప్రధాన కారణం. ఏమాత్రం అనుమానం వచ్చినా స్క్రీనింగ్ టెస్ట్ చేయించాలి. కొన్ని లక్షణాలను బట్టి క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తించడానికి వీలుంటుంది. వ్యాధి ముదరకముందే మందులు వాడితే తగ్గిపోతుంది. చాలామంది వ్యాధి ముదిరిన తరువాత ఆసుపత్రులకు వస్తున్నారు. దీంతో మరణాల సంఖ్య పెరుగుతోంది. శరీరం మొత్తం కణజాలంతో నిండి ఉంటుంది. కణాల విభజన జరుగుతుంటుంది. అలాంటప్పుడు కణాలు చనిపోతూ ఉంటాయి. శరీరంలో ఈ ప్రక్రియకు విఘాతం ఏర్పడితే కొన్ని కణాలు చనిపోకుండా ఉండిపోతాయి. కణాల్లో ఉండే డీఎన్ఏలో మార్పుల వల్ల ఇలా జరుగుతూ ఉంటుంది. వైరస్ రకాల్లో హెచ్‌పీవీ (హ్యూమన్ పాపిలోనా వైరస్) ఒకటి. పులిపిర్లు మాదిరి ఏర్పడుతుంది. వాటిలో అధికశాతం నిరపాయమైనవి. కొన్ని మాత్రం ప్రాణాంతక మైనవి. క్యాన్సర్ తల్లిదండ్రుల నుంచి వారసత్వంగా వచ్చే అవకాశాలు కూడా ఉంటాయి. ఆహారపు అలవాట్లు, స్మోకింగ్, ఊబకాయం, గోప్యత ప్రదేశాల్లో పరిశుభ్రత లేకపోవడం, మల్టీ సెక్స్ వల్ల క్యాన్సర్ బారినపడే అవకాశాలు అధికంగా ఉన్నాయి. శరీరానికి అవసరమైన కణాలతో పాటు అధికంగా వృద్ధిచెంది ట్యూమర్ (కణితి)గా ఏర్పడటమే క్యాన్సర్‌గా పేర్కొంటారు. అయితే ప్రతి కణితి క్యాన్సర్ కారకం కాదు. క్యాన్సర్ కణితి మాత్రం రక్తం ద్వారా ఇతర కణాలకు వ్యాప్తిచెందుతుంది. అధికశాతం మంది మహిళలు రొమ్ము, గర్భాశయ, ఓరల్, పేగు క్యాన్సర్‌తో బాధపడుతూ ఉంటారు. రొమ్ము క్యాన్సర్‌ను మామోగ్రామ్, గర్భసంచి-పాప్‌స్మియర్, పేగు-కొనలోస్కోపీ పరీక్షల ద్వారా నిర్ధారించబడుతుంది. క్యాన్సర్ బారిన పడి కోలుకున్న వారికి ఇక రాదు అన్న అతి విశ్వాసం విడనాడాలి. ఆరోగ్య జాగ్రత్తలు పాటించకపోతే మరలా వచ్చే అవకాశాలూ ఉన్నాయి. భారతదేశంలో అధికశాతం మంది అవగాహన లోపంతో వ్యాధి ముదిరిన తర్వాత వైద్యులను సంప్రదిస్తున్నారు. ఆర్థిక స్థితిగతులు కావచ్చు... ఖర్చుతో కూడుకున్నదన్న అభిప్రాయమూ కావచ్చు. ఎక్స్‌రేలు, సిటీ స్కాన్, ఎంఆర్ఐ, పెట్ స్కాన్ల ద్వారా రోగ నిర్ధారణ చేయవచ్చు. కీమోథెరపీ, రేడియేషన్ థెరపీ, శస్త్ర చికిత్సల ద్వారా నయం చేయవచ్చు.

డాక్టర్ లక్ష్మీ ప్రియదర్శిని, ఎండీడీఎం
మెడికల్ అంకాలజీ, డాక్టర్ గోపీచంద్
క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్, విజయవాడ

భగత్‌సింగ్ అమరత్వాన్ని స్మరిస్తూ...

23న దేశవ్యాప్త కోర్కెలదినం

ఐజేయూ జాతీయ కార్యవర్గం పిలుపు

విశాలాంధ్ర–షిరిడీ (మహారాష్ట్ర): భగత్‌సింగ్ అమరత్వాన్ని స్మరిస్తూ మార్చి 23న జర్నలిస్టుల సమస్యలపై దేశవ్యాప్తంగా కోర్కెల దినం పాటించాలని ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజేయూ) జాతీయ కార్యవర్గం పిలుపు ఇచ్చింది. ఈ సమావేశాలు మహారాష్ట్ర షిరిడీలోని యాపిల్ సాయి రెసిడెన్సీలో శనివారం ప్రారంభమయ్యాయి. మహారాష్ట్ర స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆతిథ్యంలో రెండురోజుల పాటు జరగనున్న సమావేశాలకు ఐజేయూ అధ్యక్షుడు, తెలంగాణ మీడియా అకాడమీ అధ్యక్షుడు కె.శ్రీనివాసరెడ్డి అధ్యక్షత వహించారు. జర్నలిస్టుల భద్రతకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చట్టం చేయాలని, జర్నలిస్టుల, నాన్ జర్నలిస్టుల వేతన సవరణకు తక్షణం వేతన బోర్డు నియమించాలని, మీడియా రంగంలో వేగంగా వస్తున్న మార్పుల నేపథ్యంలో మీడియా స్వరూప స్వభావాలను అధ్యయనం చేయడానికి ఎలాంటి తాత్సారం చేయకుండా వెంటనే మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలని ఐజేయూ కార్యవర్గ సమావేశం డిమాండ్ చేసింది. ఈ మేరకు వివిధ తీర్మానాలను సమావేశం ఆమోదించింది. త్వరలో సార్వత్రిక ఎన్నికలు రానున్న తరుణంలో జర్నలిస్టులను కలవరపరుస్తున్న తక్షణ సమస్యలను పాలక, ప్రతిపక్షాల దృష్టికి, పౌరసమాజం దృష్టికి తెచ్చేందుకు సర్దార్ భగత్‌సింగ్ వర్ధంతి రోజు మార్చి 23న 'జర్నలిస్టుల కోర్కెల దినం' పాటించాలని సమావేశం పిలుపు ఇచ్చింది. ఆ రోజున ప్రజా ప్రతినిధులకు, వివిధ రాజకీయ పక్షాల నేతలకు, అధికారులకు జర్నలిస్టుల సమస్యలపై వినతిపత్రాలు అందజేయాలని ఐజేయూ అనుబంధ రాష్ట్ర సంఘాలను కార్యవర్గం కోరింది. శ్రీనివాసరెడ్డి అధ్యక్షోపన్యాసం చేస్తూ దేశంలో మీడియా సిబ్బందిపై, మీడియా సంస్థలపై పెరుగుతున్న దాడులపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. జర్నలిస్టుల భద్రతకు ప్రత్యేకచట్టం చేయాలన్న డిమాండ్‌ను పునరుద్ఘాటించారు. పాత్రికేయుల వేతన వ్యవస్థ తీరుతెన్నులపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. 2007లో మజీతియా వేజ్ బోర్డు ఏర్పాటు చేయగా 2015లో వేతన సవరణ సిఫార్సుల నివేదిక వచ్చిందని, దాన్ని 2017లో నోటిఫై చేయగా దేశంలో కేవలం 22 శాతం యాజమాన్యాలు మాత్రమే సిఫార్సులు అమలు చేశాయని వెల్లడించారు. జర్నలిస్టుల వేతన సవరణ కోసం కొత్త వేజ్ బోర్డు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు. ఐజేయూ సెక్రెటరీ జనరల్ బల్వీందర్ సింగ్ జమ్మూ గత ఆరునెలలుగా యూనియన్ నిర్వహించిన కార్యకలాపాల నివేదికను కార్యవర్గం ప్రభుత్వ విధానాలను, నిర్ణయాలను విమర్శనాత్మకంగా సమీక్షించే మీడియా సంస్థలపై ప్రభుత్వం నానాటికీ శత్రుపూరితంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. సోషల్ మీడియాను అదుపుచేయడం, ఫేస్ బుక్ పేజీలు స్తంభింప చేయడం, డిజిటల్ మీడియా వేదికల పనిని నిలిపివేయడం వంటి చర్యలు పెరిగిపోయాయన్నారు. దిల్లీ సరిహద్దులో రైతుల ఆందోళనను కవర్ చేస్తున్న పాత్రికేయులకు బాష్పవాయువు గోళాలు తగిలి గాయపడ్డారని గుర్తు చేశారు. సమస్యలపై ఐక్య పోరాటాలు కొనసాగించాలని పిలుపు ఇచ్చారు. ఐజేయూ పూర్వాధ్యక్షుడు ఎస్ఎన్ సిన్హా మాట్లాడుతూ జాతీయస్థాయిలో ఆరు వర్కింగ్ జర్నలిస్ట్స్ యూనియన్లు, వార్తాసంస్థల సిబ్బంది సంఘాలు ఏకతాటి మీదకు వచ్చి పోరాడుతున్నాయని వివరించారు.

స్పెయిన్ మహిళపై అత్యాచారం

ముగ్గుర్ని అరెస్టు చేసిన పోలీసులు

రాంచీ: జార్ఖండ్‌లో దారుణం జరిగింది. పర్యటన కోసం స్పెయిన్ నుంచి వచ్చిన ఓ మహిళపై సామూహిక అత్యాచారం జరిగింది. శనివారం తెల్లవారుజామున దుమ్కా జిల్లాలో ఈ ఘటన వెలుగుచూసింది. బాధితురాలి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసుకుని ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. రాష్ట్ర రాజధాని రాంచీకి 300 కిలోమీటర్ల దూరంలోని హన్స్‌దిహా పోలీస్‌స్టేషన్ పరిధిలోని కురుమహత్‌లో స్పెయిన్‌కు చెందిన పర్యాటక జంట రాత్రివేళ తాత్కాలిక దేరాలో గడుపుతుండగా ఈ దారుణం చోటుచేసుకుంది. ఈ జంట బంగ్లాదేశ్ నుంచి రెండు మోటార్‌సైకిళ్లపై దుమ్కాకు చేరుకుని బీహార్, ఆపై నేపాల్ వెళ్లే క్రమంలో ఉన్నారు. ఇందులో భాగంగా బాధితురాలు తన భర్తతో కలిసి దుమ్కా మీదుగా భాగల్పూర్ కు బైక్ టూర్‌కు వెళ్లారు. రాత్రి 12 గంటల సమయంలో హన్స్‌దిహా మార్కెట్ ముందు జన సంచారం లేని ప్రదేశంలో టెంట్ వేసుకుని నిద్రకు ఉపక్రమించారు. అదే సమయంలో సమీపంలోని కొందరు యువకులు టెంట్‌లోకి చొరబడ్డారు. నిద్రపోతున్న మహిళపై సామూహిక అత్యాచారం చేశారు. అంతే కాకుండా తీవ్రంగా కొట్టి గాయపర్చారు. జనసంచారం లేకపోవడంతో ఆమెకు సహాయం చేసేందుకు ఎవరూ ముందుకు రాలేదు. ఘోరం జరిగిన తర్వాత బాధితురాలు నేరుగా పోలీస్‌స్టేషన్‌కు చేరుకుంది. తమపై జరిగిన దారుణం వివరిస్తూ న్యాయం చేయాలంటూ పోలీసులను వేడుకుంది. బాధితురాలి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే ఈ కేసుకు సంబంధించిన వివరాలు తెలిపేందుకు దుమ్కా ఎస్పీ పీతాంబర్ సింగ్ ఖేర్వార్ నిరాకరించారు. ప్రస్తుతం ముగ్గురిని అదుపులోకి తీసుకున్నామని, మిగిలిన నిందితులను పట్టుకునేందుకు గాలింపు చర్యలు చేపట్టామని తెలిపారు. ఘటనపై విచారణకు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలుసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని వెల్లడించారు. శుక్రవారం రాత్రి 11 గంటల సమయంలో హన్స్‌దిహా పోలీసు పెట్రోలింగ్ బృందం రోడ్డు పక్కన ఇద్దరు వ్యక్తులను గుర్తించినట్లు తెలిపారు.

5న టీడీపీ బీసీ డిక్లరేషన్

రేపటితో ముగియనున్న 'రా కదలిరా' సభలు

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: బలహీన వర్గాల అభ్యున్నతి, రక్షణే లక్ష్యంగా టీడీపీ బీసీ విభాగం 'జయహో బీసీ' పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా పర్యటనలు పూర్తి చేసుకుని ఈ నెల ఐదున బీసీల కోసం ప్రత్యేక డిక్లరేషన్ ప్రకటించనుంది. గుంటూరు జిల్లా మంగళగిరి సమీపంలోని నాగార్జున విశ్వవిద్యాలయం ఎదురుగా బలహీనవర్గాలతో భారీ సభ నిర్వహిస్తున్నారు. జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు డిక్లరేషన్ ప్రకటిస్తారని, రాష్ట్రం నలుమూలల నుంచి భారీసంఖ్యలో బీసీలు హాజరై మహాసభను విజయవంతం చేయాలని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, మాజీ మంత్రి కొల్లు రవీంద్ర శనివారం పార్టీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పిలుపునిచ్చారు. జగన్ అధికారంలోకి రాగానే టీడీపీ ప్రభుత్వం బీసీలకు అమలుచేసిన 30కి పైగా పథకాలు రద్దుచేశారని, దీనిపై ప్రశ్నించిన బీసీలను పొట్టనపెట్టుకున్నాడని మండిపడ్డారు. 57 నెలల జగన్ పాలనలో బీసీలకు జరిగిన అన్యాయం... వంచన మాటల్లో వర్ణించలేనిదన్నారు. మండలస్థాయిలో 850 జయహో బీసీ సమావేశాలు నిర్ణయించాం... ప్రతి బీసీ సోదరుడి అభిప్రాయం తెలుసుకున్నాం... దీనిపై మాజీ మంత్రి యనమల రామకృష్ణుడి నేతృత్వంలోని 15 మంది సభ్యుల కమిటీ బీసీ డిక్లరేషన్ రూపొందించింది... దానిని ఈ నెల ఐదున చంద్రబాబు ప్రకటిస్తారు... రాష్ట్రస్థాయిలో బీసీలకు ఏం చేయాలనే విషయాలతో పాటు జాతీయస్థాయిలో బలహీనవర్గాలకు అందాల్సిన చేయూత వివరాల్ని కూడా డిక్లరేషన్లో ప్రకటించబోతున్నామని రవీంద్ర వివరించారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.